


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 91 పేజీలు: 12 వెల: 6.50





ఒడిలో నాలుగేళ్ల కొడుకుతో తల్లిమృతి

జబల్పూర్ పడవ ప్రమాదం

9లో

## మండుతున్న పిడుగురాళ్ల



46°కు చేరిన ఉష్ణోగ్రత

252 మండలాల్లో 41° పైగా నమోదు

రాష్ట్రంలో కొన్ని చోట్ల వర్షాలు

**విజయవాడ,మే1, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. రాష్ట్రంలోని 20 జిల్లాల పరిధిలో ఎండ తీవ్రత పెరిగింది. 252 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదయింది. పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మరో వైపు ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఒడిశా నుంచి ఏపీ మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కొన్ని రోజులుగా ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వాన ఊరటనిచ్చింది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోని పలు చోట్ల వడగళ్ల వర్షం కురిసింది. పలు చోట్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతపురం నగరంలో తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నిన్న సాయంత్రం నుంచే తీవ్ర గాలులు వీచాయి. తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు >>2

# కార్మిక సంక్షేమమే లక్ష్యం



శుక్రవారం పమిడిముక్కలలో శ్రమశక్తి పురస్కారాలను అందచేస్తున్న సిఎం చంద్రబాబు

నైపుణ్యం పోర్టల్‌తో వివిధ శాఖల సమన్వయం

మచిలీపట్నం బైపాస్ ఆరు లేన్లుగా అభివృద్ధి

35మంది భవన నిర్మాణ కార్మికులకు రూ.5లక్షల ఆర్థిక సాయం

ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు శ్రమశక్తి పురస్కారాలు

పమిడి ముక్కల మేడే 'పేదలసేవ'లో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే1,ప్రభాతవార్తప్రతినిధి:** కార్మిక సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. శ్రామికుల కోసం ప్రత్యేక కార్యచరణరు చేపడతామన్నారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన మేడే, పేదల సేవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. మేడేను పురస్కరించుకుని కార్మికులు, యాజమాన్యాలకు ప్రభుత్వం పురస్కారాలను అందజేసారు. ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు మేడే పురస్కారాలు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమ శక్తి పురస్కారాలను అందించి సత్కరించిన సీఎం చంద్రబాబు అంతకు ముందు కార్మికుల సంక్షేమం, నైపుణ్యం పెంపు అంశాలను తెలియ జేస్తూ ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. వివిధ శాఖలను నైపుణ్యం పోర్టల్‌తో ఇంటిగ్రేట్ చేసినట్లు సీఎంకు అధికారులు తెలిపారు. కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని స్కిల్ డెవలెప్మెంట్ కార్పొరేషన్, మెప్మా, హెల్త్, సివిల్ సప్లైను నైపుణ్యం పోర్టల్‌తో ఇంటిగ్రేషన్ చేశామని సీఎంకు అధికారులు వివరించారు. 35 మంది భవన నిర్మాణ కార్మికులకు పీ4లో భాగంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును సీఎం అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అమరావతిలో నూతన ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, తిరుపతి, ఈఎస్‌ఐ ఆస్పత్రులు తీసుకొస్తామని తెలిపారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యమని అన్నారు. ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని తేల్చిచెప్పారు. చట్టసభల్లో 33 శాతం మంది మహిళలు ఉంటే సభకే శోభ వస్తుందని అన్నారు. కృష్ణా పుష్కరాల నాటికి కృష్ణా జిల్లాలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. బందర్ పోర్టు పనులు 57 >>2

# మహానాడుకు స్థలాన్వేషణ



శుక్రవారం మహానాడు నిర్వహణపై నేతలతో చర్చిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

27 నుంచి నిర్వహించే సభల కోసం కోవూరు, రాజుపాలెం, నెల్లూరులో స్థల పరిశీలన

5లక్షల మందితో వైభవంగా నిర్వహణకు సిద్ధం:మంత్రి ఆనం

**కొడవలూరు (నెల్లూరు), మే 1, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక మహానాడు కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు కోసం జిల్లా వ్యాప్తంగా అనువైన స్థలాల పరిశీలన కొనసాగుతోందన్నారు. మహానాడు నిర్వహణకు సంబంధించి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కాకర్ల సురేష్, కృష్ణారెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు కోవూరు జాతీయ రహదారి సమీపంలోని రేగడి చెలిక వద్ద సుమారు 110 ఎకరాల ఏపీఐఐసీ స్థలాన్ని పరిశీలించారు. అలాగే రాజుపాలెం సమీపంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంతాన్ని కూడా సందర్శించారు.

ఇదే సమయంలో నెల్లూరు రూరల్ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న సాక్షి కార్యాలయం సమీప ప్రాంతాలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి పరిశీలించారు. మహానాడు నిర్వహణకు అనువైన అన్ని ప్రాంతాలపై సమగ్ర నివేదికను పార్టీ కేంద్ర కమిటీకి పంపిస్తామని మంత్రి ఆనం వెల్లడించారు. అనంతరం పార్టీ అధిష్టానం తుది వేదికను ఖరారు చేస్తుందని చెప్పారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత తొలి సారిగా నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయించడం జిల్లా నేతలు, కార్యకర్తల అదృష్టంగా భావిస్తున్నామని మంత్రి ఆనం పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త గర్వపడేలా మహానాడును పసుపు పండుగలా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని తెలిపారు.

మే 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా లక్షలాది మంది కార్యకర్తల సమక్షంలో మహానాడు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఐదు లక్షల మందికి పైగా కార్యకర్తలు, నాయకులు పాల్గొనే ఈ కార్యక్రమం కోసం భారీ బహిరంగ సభ వేదిక, వేలాది వాహనాలకు పార్కింగ్, మూడు రోజులపాటు భోజన వసతి, అతిథులకు నివాస సదుపాయాలు వంటి అన్ని అంశాల్లో సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ డిఎస్పి శ్రీనివాసరావు,కొడవలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ దుర్గా ప్రసాద్ రావు, స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి మరియు ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుకపై లోకాయుక్త కొరడా

సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు

సంస్థ నుంచి రూ.3 కోట్లు వసూలు

**కర్నూలు, మే 1, ప్రభాతవార్త :** ప్రకాశం జిల్లాలో అనుమతించిన పరిమితులకు మించి జరిగిన ఇసుక త్రవ్వకాలు, అక్రమ రవాణా, మరియు సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై నమోదైన ఫిర్యాదులు (1238/2021/బి1, 1301/2021/బి1)పై ఆంధ్రప్రదేశ్ ఉపలోకాయుక్త పి. రజని స్వయంగా విచారణ పూర్తి చేశారు. విచారణలో లైసెన్సుదారు సంస్థ బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనుమతించిన పరిమాణాన్ని మించి ఇసుక త్రవ్వకాలు నిర్వహించినట్లు తేలడంతో సంస్థపై భారీ జరిమానా విధించబడింది. ఉపలోకాయుక్త సిఫార్సుల మేరకు సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు అమలు చేయబడ్డాయి. గనులు మరియు భూగర్భ శాఖ ఉప సంచాలకుడు నరసింహారెడ్డికి రెండువార్షిక వేతన వృద్ధులు సమీ >>2



శుక్రవారం గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

## గ్రామీణులకూ నేత్ర వైద్యం అందుబాటులోకి

గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐకేర్ సెంటర్‌ను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

వైద్య, ఆరోగ్యానికి రూ.19,305 కోట్లు కేటాయింపు

**విజయవాడ మే1, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు సంక్షేమం అభివృద్ధితో పాటు ఆరోగ్యానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత బడ్జెట్ కంటే ఈసారి వైద్యారోగ్యానికి రూ.19,305 కోట్లను కేటాయించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి ఆస్పత్రులు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ జీఎన్ రావులతో కలిసి ఈ ఐ కేర్ సెంటర్ ను సీఎం ప్రారంభించారు.. ఈ ఐ కేర్ సెంటర్ ఏర్పాటుకు సహకారం అందించిన సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ చైర్మన్ జాస్తి వెంకట్ ను సీఎం అభినందించారు. సమాజానికి తిరిగి ఇవ్వాలన్న లక్ష్యంతో జాస్తి వెంకట్ ఈ ఐ కేర్ సెంటర్ కు ఆర్థిక సహకారాన్ని అందించారన్నారు. ఈ ప్రాంతంలో పేదలకు సైతం ఉత్తమ నేత్ర వైద్యం >>2



శుక్రవారం ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్ష దృశ్యం

# అటు ఉడుకు.. ఇటు వణుకు

ఉత్తరాంధ్రలో మారిన వాతావరణం

పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం

మామిడి, జీడి, అరటి రైతులకు అపార నష్టం

**శ్రీకాకుళం/వీరఘట్టం, మే 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉపరితల ద్రోణి ప్రభావంతో వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గత కొన్ని రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలకు కొంత ఉపశమనం లభించగా, పలు ప్రాంతాల్లో మేఘావృతం ఏర్పడింది. ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత మేఘాలు కమ్ముకోవడంతో ఒక్కసారిగా వాతావరణమే మారిపోయింది. ఫలితంగా శుక్రవారం మధ్యాహ్నం నుండి బీభత్సమైన ఈదురు గాలులతో హుదూద్ తుఫాన్ గుర్తుకొచ్చేలా ఉరుములు, పిడుగులతో ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసింది. భారీగా వర్షం కురవడంతో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ బీభత్సం వల్ల ఎక్కువగా మామిడి, జీడి, అరటి రైతులకు అపార నష్టం చేకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పండించిన పంటలు ఒక్కసారిగా నేల కొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట చేతికొస్తున్న టైంలో ఇటువంటి ప్రకృతి సృష్టించిన బీభత్సంతో కుదలైపోతున్నామని రైతులు దిగాలు పడుతున్నారు. అలాగే ఈ భారీ వర్షానికి పలు రహదారులు కూడా పాడైన దాఖలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతివేగంగా >>2

# భగ్గుమన్న వాణిజ్య సిలిండర్



రూ.993 మేర భారీగా పెంపు

ఢిల్లీలో ధర రూ.3071.50

**న్యూఢిల్లీ, మే 1:** దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను ఏకంగా రూ.993కు పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ పెంపు నేటి నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల సిలండర్ ధర రూ.3,071.50కి చేరింది. అదే హైదరాబాద్‌లో అయితే 19 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరలు రూ.1000 పెరిగి రూ. 3315వరకూ చేరింది. ఈ ధరలు శుక్రవారంనుంచే అమలులోకి వచ్చాయి. అయితే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. అమెరికా ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో విడతల వారీగా కమర్షియల్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు పెంచాయి. ఫిబ్రవరి 28 తర్వాత కమర్షియల్ సిలిండర్ ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. మార్చి ప్రారంభంలో సుమారు రూ.115 పెరిగిన ధరలు, ఏప్రిల్ 1న 200 వరకు పెరిగాయి. ఇప్పుడు ఒకేసారి రూ.993 పెంచారు. దీంతో ఒక్క వాణిజ్య సిలిండర్ ధర రూ.3వేలు దాటింది. తాజా పెంపుతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై అదనపు భారం పడనుంది. ఇంధన ధరల విషయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వివరాల ప్రకారం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరిగినప్పటికీ ఆయిల్ కంపెనీలు వాటిని భరిస్తున్నాయని తెలిపింది. దీంతో ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పులేదు. ఇక దేశీయ >>2



## ఓట్ల లెక్కింపు సిబ్బందిపై 'సుప్రీం'కు మమత

ఇసి వైఖరిపై సిఎం ధ్వజం

**న్యూఢిల్లీ, మే 1:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓట్లలెక్కింపు సిబ్బందిగా కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులను నియమించడంపై మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలుచేసి అత్యవసరమని కోరింది.

# గంజాయి మత్తుకు క్షణాల్లో చెక్!




మూత్ర పరీక్ష ద్వారా నిర్ధారణ

రాష్ట్రంలో తొలిసారి తిరుపతిలో అమలు

గంజాయి నిర్మూలనకు నాలుగంచెల విధానం

**తిరుపతి,మే 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పుణ్యక్షేత్రంగానే గాక యాత్రాస్థలంగా కూడా ప్రసిద్ధి చెందడం, పుణ్యక్షేత్రాల జిల్లాగా అలరారుతుండటంతో మత్తుపదార్థాల నిషేధమే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో గంజాయి నిర్మూలనకు నాలుగు అంచెల విధానాన్ని అవలంభిస్తున్నట్లు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతి జిల్లాలో పోలీసుశాఖ తరపున నూతన పరికరాలను తెప్పించారు. ఈ పరికరం ద్వారా గంజాయి సేవించినా, మత్తులో ఉన్నా వెంటనే మూత్రం పరీక్షద్వారా క్షణాల్లో పాజిటివ్ గా నిర్ధారణ అవుతుంది. ఈ పరికరంలో మూత్రం రెండు చుక్కలతో ఆ వ్యక్తి యొక్క మత్తు ఎరుపురంగులో మారితే పాజిటివ్‌గా నిర్ధారణ చేస్తారు. >>2

# అకాల వర్షానికి అపార నష్టం

## శ్రీకాకుళం జిల్లాలో నేలకూలిన బొప్పాయితోటలు

## కరిగిపోయిన ఉప్పు మడులు

**సంతబొమ్మాళి/బూర్జ (శ్రీకాకుళం జిల్లా), మే 1 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి, బూర్జ మండలాల్లో అకాల వర్షం ధాటికి భారీ నష్టం వాటిల్లింది. సంతబొమ్మాళి మండలంలో గత రెండు రోజులుగా ఉరుములు మెరుపులతో కూడిన గాలివానతో ఉప్పుకుప్పలు నీటమునిగాయి. దీంతో ఉప్పు రైతులకు అపార నష్టం వాటిల్లి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మండలంలో నౌపడ, సీతానగరం, శెలగపేట, మర్రిపాడు గ్రామాల్లో పలువురు ఉప్పు రైతులు ఉప్పు పంట సాగు చేస్తున్నారు.చేతికి అందవచ్చిన పంట మడులలోనే గంగపాలు అవటంతో 50శాతం పైగా ఉప్పు పంటకు నష్టం వాటిల్లిందని లబోది బోమంటున్నారు. వర్షానికి పూర్తిగా ఉప్పు మడుల్లో వర్షపు నీరు చేరడంతో మరో పది రోజుల వరకు ఎటువంటి పని ఉండదని, ఉప్పునిల్వ చేసేందుకు ప్లాట్ పామ్ లేకపోవడం పండిన పంటకు రక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఆరుగాలం కష్టపడి పండించుకున్న మామిడి, బొప్పాయి చేతికి అంది వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యంలో చెట్లు నేలకొరిగి కాయలన్నీ రాలిపోయి తీవ్ర నష్టం ఏర్పడింది.


ఈదురుగాలులకు నేలకూలిన బొప్పాయి పంట

## భవన నిర్మాణ కార్మికులతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు

**విజయవాడ. మే 1, ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణాజిల్లా వీరంకిలాకు గ్రామంలో మేడే సందర్భంగా సిఎం చంద్రబాబు కొత్తగా నిర్మిస్తున్న ఓ భవనం వద్దకు వెళ్లిన సీఎం అక్కడ పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులను పలకరించారు. తాపీ మేస్త్రీ అల్లా భక్షు, అక్కడ కూలీగా పనిచేస్తున్న మహిళ సుమలతతో మాట్లాడి వారి రోజు వారీ ఉపాధి, కుటుంబ నేపథ్యం, ఇబ్బందులను గురించి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. అనంతరం వారికి మన మిత్ర వాట్సప్ యాప్‌ను ద్వారా కార్మికులను అందుబాటులో ఉన్న సేవలు, వాటిని ఉపయోగించుకునే తీరును స్వయంగా తెలియజేశారు. అదే భవనంలోని మొదటి అంతస్తులో పని చేస్తున్న రాడ్ బెండింగ్ కార్మికుడు కొండేటి సీమయ్య, సెంట్రింగ్ కార్మికుడు బోలెం శ్రీనివాసరావుతో మాట్లాడి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శ్రీహరిరావు అనే భవన నిర్మాణ కార్మికుడి కుమార్తె మణికొండ అఖిల ఇటీవలే ఓ బిడ్డకు జన్మనివ్వటంతో కార్మికుల సంక్షేమంలో భాగంగా రూ.20 వేల చెక్కును ఆమెకు ఆర్థికసాయంగా ముఖ్యమంత్రి అందించారు.

## పూడి శ్రీహరికి ఏపీ హైకోర్టులో ఊరట!

**విజయవాడ, మే 1, ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సీఎం జగన్ సీపీఆర్‌వో పూడి శ్రీహరికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది..సోషల్ మీడియా పోస్టుల కేసులో అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.. 41ఏ నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని ఏపీ హైకోర్టు సూచించింది..వైసీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సీపీఆర్‌వో పూడి శ్రీహరి పని చేసారు. సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుత సీఎం చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు పెట్టినందుకు పోలీసులు కేసులు నమోదు చేసింది.

# భగ్గుమన్న వాణిజ్య సిలిండర్

>> ఎయిర్‌లైన్స్‌కు విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలను కూడా కేంద్రం యథాతథంగా ఉంచింది. అంతర్జాతీయ విమానసర్వీసుల సంస్థలకు మాత్రం ఐదుశాతం ధరలను పెంచారు. నెలవారీ పెరుగుదలల్లో రెండోసారి పెంచినట్లయింది. కిలోలీటరుకు 76.55 డాలర్లు పెంచారు. ప్రస్తుతం ఢిల్లీలో కిలో లీటరుకు 1511.86 డాలర్లుగా నమోదయింది. ఇదిలా ఉంటే పెట్రోలు డీజిల్‌పై లీటరుకు రూ.4-5 వరకూ పెంచే అవకాశం ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. అలాగే గృహావసరాల సిలిండర్లపైనా కూడా రూ.40నుంచి 50 వరకూ పెంచుతారన్న వార్తలు వెలవడుతుండటంతో వంటగ్యాస్ కూడా ఇకపై మరింత ప్రియం కానున్నది.

# గంజాయి మత్తుకు క్షణాల్లో చెక్!

>> ఇందుకు తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యవర్గాలు అందుబాటులో ఉంటారు. శుక్రవారం ఉదయం తిరుపతి పోలీస్ జిల్లాలో ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పోలీస్ అధికారులతో కలసి వివరించారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా విద్యాలయాలు, కళాశాలతో బాటు అన్ని గ్రామాలలో గంజాయి సేవనం వల్ల కలిగే అనర్థాలు, మత్తుపదార్థాలకు బానిసలు గాకుండా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. పదే పదే గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న 16 మంది గుర్తించి వారిపై పిడిచట్టంక్రింద కేసులు నమోదు చేయగా, వారిలో 12 మందికి ఆమోదం లభించడంతో వారిని జైలుకు పంపడమైనది, మిగతా నలుగురు పరిశీలనలో ఉన్నారు. నూతన ఒరవడితో గంజాయి సేవించే వారిని నిర్ధారించడానికి ప్రత్యేకంగా తయారు చేయబడిన మెడికల్ కిట్‌ల ద్వారా టెస్టింగుకి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పరీక్ష కిట్ లను జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్‌లకు అందజేశారు. టెస్టులలో పాజిటివ్‌గా వచ్చిన వారి ద్వారా గంజాయి లభ్యతకి సంబంధించిన సమాచారం సేకరించడంతో పాటు గంజాయి సేవించే వారిలో పరివర్తన తీసుకుని రావడానికి ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. గంజాయిపై సమాచారాన్ని 1972, 112కి తెలిపితే వివరాలు గోప్యం గా ఉంచబడుతుందన్నారు. తిరుపతి జిల్లాలో గంజాయి రహిత సమాజం నిర్మాణం కోసం పోలీస్ శాఖ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. పదే పదే టెస్టుల్లో పాజిటివ్‌గా వస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు ,రవి మనోహరచారి, ఐ.రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్‌బి డిఎస్ పి.గీతాకుమారి, సిఐ విక్రమ్, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, శ్రీలత పాల్గొన్నారు.

# మండుతున్న పిడుగురాళ్ల

>> రాత్రి పడిన వర్షం కాస్త ఉపశమనాన్ని కలిగించింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో అరగంట పాటు భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అయితే ప్రజలకు ఎక్కడ ఇబ్బంది కలగలేదు. వర్షం నీరు ఒక్కసారిగా పెద్ద ఎత్తున రావటంతో కాలువల్లో చెత్తాచెదారం మురుగు రోడ్డు పైకి చేరింది. విద్యుత్ సమస్య ఏర్పడిన ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు మరమ్మత్తులు చేపడుతున్నారు. శ్రీకాకుళం జిల్లా అంతటా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. జిల్లాలో తెల్లవారుజాము నుంచే పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, సారవకోట, మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లో వాన కురిసింది. అలాగే ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, టెక్కలి, జలుమూరు ,కోటబొమ్మాళి, సారవకోట, నందిగాం, ఎల్.ఎన్ పేట, హిరమండలంతో పాటు మరికొన్ని మండలాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురియడంతో ప్రయాణికులు ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ సాయంత్రం ఒక్కసారి మేఘావృతంలో వాతావరణం మారి ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లపై ఉన్న చిన్న చిన్న దుకాణాలు, తోపుడి బళ్లు గొడుగులు గాలికి ఎగిరిపోయాయి. భారీ వర్షానికి చెట్లు కొమ్మలు వీరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్తు అంతరాయం ఏర్పడింది.: కడప జిల్లా లింగాల మండల పరిధిలోని గుణకనపల్లి, రామట్లపల్లి, చిన్నకుడాల, మురారిచింతలతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన వాన గాలులకు వందల ఎకరాల్లో అరటి పంట నేలమట్టమైంది. కాపు దశలో ఉన్న పంట నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందే విధంగా అధికారులు కృషి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. విశాఖలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. తగరపువలస, ఆనందపురం ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. ఒడిశా నుంచి తెలంగాణ, ఏపీ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఆవర్తనం ప్రభావంతో కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉంది అధికారులు తెలిపారు.ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ నగర పరిధిలోను, పలు గ్రామాల్లో కొద్ది సేపు ఈదురుగాలులు వీచాయి.కొద్దిపాటి వాన చినుకులు పడ్డాయి.గుంటూరు, కృష్ణా.ఉమ్మడి గోదావరి జిల్లాల్లోను పరిస్దితి నెలకుంది.

ఇక రానున్న రెండు రోజులు రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 64 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా పల్నాడులో 19, పార్వతీపురం మన్యంలో 10, ప్రకాశంలో 10 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లోని 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

## కార్మిక సంక్షేమమే లక్ష్యం

>> శాతం పూర్తయ్యాయని డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జిల్లా అభివృద్ధిని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తామని వెల్లడించారు. భారత్ మాలా ప్రాజెక్టులో భాగంగా మచిలీపట్నం బైపాస్ 6 లైన్లుగా అభివృద్ధి చెందనుందని తెలిపారు. హైదరాబాద్ మచిలీపట్నం హైవే ఎక్స్ ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయ పడ్డారు. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఆంధ్రప్రదేశ్‌కు పునర్వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చాం.

**ప్రజల సంతోషాన్ని చూసి కష్టాన్ని మర్చిపోతున్నా:** ప్రజా ప్రభుత్వం పాలనలో ప్రజల సంతోషాన్ని చూసి కష్టాన్ని మర్చిపోతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. పెన్షన్ల పంపిణీని భారంగా చూడటం లేదని బాధ్యతగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 62.47 లక్షల మందికి ప్రతీ నెలా అందిస్తున్నామని గడచిన 22 నెలల్లో రూ.63వేల కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. ప్రతీ నెలా రూ.2,721 కోట్ల చొప్పున ఏడాదికి రూ.33 వేల కోట్లు మేర వ్యయం చేస్తున్నామని దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్దమొత్తంలో సంక్షేమం కోసం ఖర్చు చేయటం లేదన్నారు

**శరవేంగా పోలవరం పనులు:** సీఎం చంద్రబాబు సభలో తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు. 13 ఏళ్లక్రితం నిర్మించిన పట్టిసీమ ఎత్తిపోతలతో కృష్ణా డెల్టాకు నీటి ఎద్దడి లేకుండా పంటలు వస్తున్నాయి 2019 తర్వాత కూడా టీడీపీ ప్రభుత్వమే వచ్చి ఉంటే పోలవరం పూర్తయ్యేది. గత పాలకుల నిరక్ష్యంతో డయాఫ్రాంవాల్ కొట్టుకుపోయింది. మళ్లీ పనులు వేగంగా చేస్తున్నాం పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం.బందరు పోర్టుకు 2014లో భూసేకరణ చేశాం. 2019లో టెండర్లు రద్దు చేసి గందరగోళం చేశారు.బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్, ఆఫ్ షోర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబర్ కు బందరు పోర్టు పూర్తి చేయాలని లక్ష్యం విధించుకున్నామన్నారు. మచిలీపట్నం బైపాస్ రోడ్డు 2 లేన్ల నుంచి 6 లేన్లు చేస్తున్నారు. బీచ్ రోడ్డును విస్తరిస్తున్నారు.విజయవాడ నుంచి మచిలీపట్నంకు 6 లేన్ల రోడ్డుగా విస్తరణ జరుగుతోంది. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు ఎక్స్ ప్రెస్ హైవే వస్తోంది. అభివృద్ధి జరగాలంటే భూములు ఉండాలి. అమరావతి రైతులు ఒక్క రూపాయి తీసుకోకుండా 29 వేల మంది 33 వేల ఎకరాలు అందించారు. రాజధాని రావడంతో వారి దశాదిశ మారింది.

**దేశంలోనే అతిపెద్ద పెట్టుబడి" గూగుల్ ది ":** దేశంలోనే అతిపెద్ద పెట్టుబడిగూగుల్ ది రూ.1.35 లక్షల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొంటూ రియలన్స్ కూడా 17 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 15 చోట్ల లేబర్ అడ్డాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేను రైతు కుటుంబం నుంచి వచ్చిన వాణ్నే..నాకూ కష్టాలు తెలుసు. ఆధునీకరణలో ముందుకెళ్తున్నాం. కార్మికుడు కొడుకు ఎందుకు ఒక పరిశ్రమ స్థాపించకూడద అన్న ఆలోచనా విధానంతో మార్పు తెచ్చుకుని నైపుణ్యం ఇచ్చి పనిముట్లు అందించే రెట్టింపుగా పని చేయవచ్చు. లేబర్ అడ్డా స్కిల్ డెవలెప్మెంట్ కేంద్రంగా మారుతుంది.


శుక్రవారం ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం దృశ్యం

# అటు ఉడుకు.. ఇటు వణుకు

>> వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూడా నేల కొరిగాయి. విద్యుత్ వైర్లు తెగి ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. దీంతో విద్యుత్ శాఖకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందోనని ప్రజలు ఎదురు చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా గ్రామాలలో భారీ వర్షానికి వర్షపు నీటితో కాలువల్లో ఉన్న చెత్తాచెదారం రోడ్డుపైకి వచ్చి అపారశుద్ధం కారణంగా అంటురోగాలకు ఆహ్వానిస్తున్నాయి. పలుచోట్ల భారీ వృక్షాలు కూడా నేలకొరిగి ట్రాఫిక్ కు అడ్డంకిగా మారాయి. ఏది ఏమైనా ఈ వర్షం ప్రజలకు కొంతవరకు ఉపశమనం కలిగించినప్పటికీ, నష్టం మాత్రం ఆపారంగా లేకపోలేదు. మరో ఐదు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని, అనంతరం వాతావరణం స్థిరపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అనంతరం వాతావరణం స్థిరపడే అవకాశం ఉందని చెబుతుంది. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నందున చెట్లు కింద నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా పమిడిముక్కలలో శుక్రవారం పర్యటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పమిడిముక్కలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముగించుకుని వేరే కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో గ్రామంలో అంగన్‌దీడీ సెంటర్ కన్పించడంతో ముఖ్యమంత్రి అక్కడ ఆగారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో కాసేపు ముచ్చటించారు. అక్కడ చిన్నారులు పాడిన రైమ్స్ విన్నారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై టీచర్లు, ఆయాలను అడిగి తెలుసుకున్నారు. వారికి మంచి శిక్షణతో పాటు పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు.

## ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు రూ.501 కోట్లు చెల్లింపు

**విజయవాడ, మే 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు కూటమి ప్రభుత్వం బకాయిల్లో ఇప్పటివరకు రూ.501 కోట్లు వరకు చెల్లించింది. పెండింగులో ఉన్న మొత్తంలో ట్రై పార్టీ బిల్ డిస్కొంటింగ్ అగ్రిమెంట్ విధానంలో రూ.1000 కోట్లు చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎన్టీఆర్ వైద్యా సేవా ట్రస్టు, ఆసుపత్రుల యాజమాన్యాల మధ్య కుదిరిన ఒప్పందాలు అనుసరించి గత సోమవారం నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి. మొత్తం 278 ఆసుపత్రుల యాజమాన్యాలకు కలిపి రూ.501 కోట్ల వరకు చెల్లింపులు జరిగినట్లు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఇంఛార్జి సీఈఓ, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. బిల్ డిస్కొంటింగ్ విధానంలో బకాయిలు పొందేందుకు 873 కు గాను 531 ఆసుపత్రుల యాజమాన్యాల దరఖాస్తు చేశాయి. వీటిలో 336 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. బకాయిలపై ఆసుపత్రుల యాజమాన్యాలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చెల్లింపులు జరుగుతున్నాయి.

## కడప మాజీ మేయర్ పెద దస్తగిరి కేసులో విచారణ వాయిదా వేసిన ఏపీ హైకోర్టు

**విజయవాడ, మే 1, ప్రభాతవార్త ప్రతినిధి:**
పెద్ద దస్తగిరి హత్యఘటనలో పోలీసులు తన పై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కడప మాజీ డిప్యూటి మేయర్ నిత్యానందరెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటీషన్‌పై హైకోర్టు విచా రణ జరిపింది.తదుపరి విచారణ వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేసింది. ఈ కేసుదర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, చార్జ్ షీట్ దాఖలు చేయకపోవడంతో కేసును క్వాష్‌చేసే ప్రశ్నే ఉత్ప న్నం కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. బండి నిత్యానందరెడ్డి కీలక పాత్ర అని ప్రభుత్వ తరపు న్యాయవాది పీపీ మెండా లక్ష్మి నారాయణ వాదించారు. హత్య తరువాత నిందితులు పిటి షనర్నే ఆశ్రయించారన్నారు. నిందితులు పారి పోయేందుకు నిత్యానందరెడ్డి డబ్బు ఏర్పాటు చేశారని కోర్టుకు తెలిపారు. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని నిత్యానందరెడ్డికి హైకోర్టు ఆదేశించింది. బీఎన్ఎస్ఎస్‌లోని చట్టనిబంధన లను అనుసరించాలని దర్యాప్తు అధికారికి ఉత్తర్వు లిచ్చింది.పిటిషనర్‌పై హత్య కేసు నమోదు అయిందని హైకోర్టు గుర్తుచేసింది. అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంటే ముందస్తు బెయిల్ వేసుకోవా లని న్యాయస్థానం సూచించింది.ఏడేళ్లకు పైబడి శిక్షకు వీలున్న సెక్షన్లు అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది.

## జలజీవన్ ద్వారా సురక్షిత నీటి సరఫరా

### మిషన్ అదనపు కార్యదర్శి కమల్‌కిషోర్

**పోలవరం జిల్లా ప్రతినిధి మే 1 ప్రభాతవార్త**

దేశంలోని వివిధ రాష్ట్రాల్లోఉన్న మారుమూల గ్రామాల ప్రజలకు జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందని కేంద్ర ప్రభుత్వ అడిషనల్ జల జీవన్ మిషన్ కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ అన్నారు. శుక్రవారం పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీలోని పందిరి మామిడి కోట గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు కులాయిలు ప్రారంభోత్సవానికి కేంద్ర ప్రభుత్వ జల జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ షోన్, పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్, గ్రామీణ నీటిపారుదల ఇంజనీరింగ్ చీఫ్ గాయత్రి ముఖ్య అతిథులుగా హాజరై తాగినీటి కులాయిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమల్ కిషోర్ సోన్ మాట్లాడుతూ దేశంలోని గిరిజన ప్రాంతాలలో గిరిజనులు తాగునీటి ద్వారా అనారోగ్య సమస్యలు రాకుండా జలజీవన్ మిషన్ ద్వారా మారుమూల గ్రామాల్లో ఇంటింటికి తాగునీరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, ఆసుపత్రులకు, పంచాయితీ కార్యాలయాలకు, గ్రామీణ గృహాలకు,తాగునీరు అందించే విధంగా ఎక్కడికి అక్కడ చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు.ప్రతిరోజు జల జీవన్ మిషన్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి సుమారు 55 లీటర్ల సురక్షితమైన త్రాగు నీటిని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తరతరాలుగా కాలువలు, చలమనీరు తాగేవరని,గతంలో అనారోగ్య సమస్యల బారినపడేవారని అదేవిధంగా గిరిజన ప్రాంతంలోని ప్రజలు తాగునీటి ద్వారా ఎటువంటి వ్యాధులు రాకుండా జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పందిరి మామిడి కోట గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులతో రూ.15.7 లక్షల రూపాయల వ్యయంతో 20వేల లీటర్ల సామర్థం ట్యాంక్ ధ్వారా 98 కుటుంబాలకు ఇంటింటికి త్రాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు.జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిలు ప్రతి ఇంటిలో త్రాగు నీటిని వృధా చేయకుండా త్రాగునీటి కుళాయిలు చెడిపోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నీటిని వాడుకోవాలని ఆయన అన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ఎప్పటికప్పుడు త్రాగు నీటిని పరీక్ష చేసే విధంగా ఐదుగురు సభ్యులను గ్రామ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతిగ్రామంలో రానున్న తరాల వారికి భూగర్భ జలాలు సుమారు 6 మీటర్లు పెంచాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును వృధాకాకుండా ఎక్కడికి అక్కడ నీటిని కట్టడ చేసి భూగర్భ జలాన్ని పెంచే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పూర్వ నుండి కాలువల నీరు తాగడం వల్ల బాగుందా? అదేవిధంగా జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు పథకం ద్వారా ఇంటింటికి కుళాయిలు వేయడం ఈ పథకం బాగున్నదా? అని గ్రామస్తులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పూర్వం నుండి పందిరి మామిడి కోటలోని గిరిజనులు కాలువలోని చలమలు నీటిని ఏ విధంగా గతంలో ఏర్పాటు చేసుకున్నది ముఖ్య అతిథులు పరిశీలించారు. చలమ నీటిని వృధా కాకుండా జలదార ప్రోగ్రాం ద్వారా నీటిని గ్రామాల్లోని ప్రజలకు వివిధ రకాలైన పంటలు ఏర్పాటు చేసుకునే విధంగా జలదార ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిపారు దల శాఖ సూపర్డెంట్ ఇంజనీర్ మితిన్, ఈఈలు నాగేశ్వరరావు, గిరి, శివాజీ, డిఈ సుబ్బారావు, గ్రేస్ రాజ్, తాసిల్దార్ అమ్మాజీ, ఎంపీ డీవో చంద్రశేఖర్, ఏవో కుమారి, ఏఈలు నారాయణ రావు, ఎస్.శ్రీనివాస్, సీతారాం నాయక్, సురేష్ బాబు,డాక్టర్ నితిన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ ఇసుకపై లోకాయుక్త కొరడా

>>కృత ప్రభావంతో నిలిపివేయగా, ప్రత్యేక అమలు విభాగం పోలీసు ఇన్స్పెక్టర్ బొమ్మిశెట్టి లతకు రెండు సంవత్సరాల పాటు వార్షిక వేతన వృద్ధి వాయిదా వేయబడింది. అలాగే ఉప పోలీసు ఇన్‌స్పెక్టర్ షేక్ రజియా సుల్తానా బేగమ్‌కు కూడా రెండు సంవత్సరాల పాటు వార్షిక వేతన వృద్ధి వాయిదా విధించారు. అక్రమ ఇసుక త్రవ్వకాల నేపథ్యంలో హైకోర్టు వ్యాజ్య పిటిషన్ నెం.35899/2015 ఆదేశాల ప్రకారం బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ నుంచి ఇప్పటికే రూ.3 కోట్లు వసూలు చేయబడినట్లు వెల్లడైంది. అధికారులపై చర్యలు, జరిమానా వసూళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ఈ అంశంపై మరింత జోక్యం అవసరం లేదని ఉపలోకాయుక్త అభిప్రాయపడి రెండు ఫిర్యాదులను మూసివేశారు. అయితే హైకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ కేసును పునః పరిశీలించి చట్టప్రకారం సంబంధిత సంస్థపై తగిన జరిమానా పూర్తిస్థాయిలో విధించాలని ఉపలోకాయుక్త ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు.

## నేత్ర వైద్యం అందుబాటులోకి

>> అందుతుందని సీఎం అన్నారు. ఈ ఐ కేర్ సెంటర్‌కు ఏడాదికి 50 వేలమంది అవుట్ పేషెంట్లను పరీక్షిచే అవకాశం ఉందని 5 వేల వరకూ శస్త్రచికిత్సలు నిర్వహించే సామర్థంతో ఏర్పాటు చేయటం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీ తెలంగాణా, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో సేవలంది స్తున్న ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ లాభాపేక్ష లేకుండా సేవలంది స్తోందని సీఎం కొనియాడారు. కంటి చికిత్సల విషయంలో శ్రద్ధ తీసుకుంటూ ఈ ఏడాది 4 లక్షల కేటరాక్ట్ సర్జరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పాఠశాల విద్యార్థులకు కూడా ఐ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని సీఎం వివరించారు. ప్రభుత్వం చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులతో మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఎం తెలియ చేశారు. అంతకుముందు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు ఐకేర్ సెంటర్‌లోని వివిధ విభాగాలను ముఖ్యమంత్రికి వివ రించారు. ఆస్పత్రిలోని ఆధునాతన కంటి పరీక్షా యంత్రం వద్ద సీఎం కంటిని వైద్యులు పరీక్షించారు.

### వారం - వర్జ్యం

02-05-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
పాడ్యమి రా.12.51
విశాఖ పూర్తి
వర్జ్యం : ఉ.10.47-మ.12.33
దు.తె.5.42-ఉ.7.21
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** విదేశాలలోని మీ వారి నుండి ఆర్థిక సహాయాన్ని అందుకోగలుగుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృషభం :** ఆధ్యాత్మిక విషయాలకు, ప్రయాణములకు ఇది అనుకూల సమయము. కనుమరుగైన వస్తువులు దొరుకుతాయి.

**మిథునం:** మీరు తెలుసుకున్న సమాచారములో పొరపాటు జరిగి, అవతలవారిని అపార్థం చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

**కర్కాటకం:** తొందరపడవద్దు. ఎంతో కాలముగా వాయిదా పడుతున్న విషయములు పరిష్కారమవుతాయి.

**సింహం:** దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా కాలం గడుపుతారు.వ్యాపారాలు లాభిస్తాయి.

**కన్య :** సంతాన విద్యా విషయములలో ప్రోత్సాహాన్ని చూపుతారు. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

**తుల :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. నూతన వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** పైరవీలు, రాజకీయాలు, సినీ రంగంలో సరికొత్త అవకాశాలు మీకు మేలు చేకూరుస్తాయి. స్థిర చరాస్తులు కొనుగోలు.

**ధనుస్సు:** చిన్న చిన్న సినిమాలు తీయాలనుకునే ఔత్సాహికులకు సరికొత్త అవకాశాలు ముందుకు వస్తాయి.వస్తులాభం.

**మకరం:** సంతానం విద్యాపరంగా మంచి పురోభివృద్ధిని సాధిస్తారు. పలుకుబడి నామమాత్రంగా పెరుగుతుంది.

**కుంభం:** ఋణాలు చేయవలసి రావచ్చు. కొత్త వ్యాపార ప్రయత్నాలు వాయిదా వేయండి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త.

**మీనం :** స్థిరమైన నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేరు. కుటుంబ సలహాలు మీ ప్రశాంతతకు భంగం కలిగించే సూచనలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సింఘాల్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

## అప్పటి ఇఒ అనిల్ కుమారే నిందితుడని స్పష్టం చేసిన దినేష్ ఏకసభ్య కమిషన్

### ప్రభుత్వానికి చేరిన నివేదిక, సింఘాల్, ఆయన సహోద్యోగులపై చర్యకు సిఫారసు

### టిటిడి కల్తీ నెయ్యి కేసు కొత్త మలుపు



**విజయవాడ.మే1.ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి తిరుమల దేవస్థానం కల్తీ నెయ్యి వ్యవహారంలో అప్పటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌కు ఉచ్చుబిగుస్తుంది.ఈ కేసులో ఆయన ప్రమేయం స్పష్టంగా ఉన్నట్లు మాజీ సీఎస్ దినేస్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పడిన ఏకసభ్య కమిషన్ ధృవీకరించింది.ఆయననే కీలక నిందితునిగా నిర్ధారిస్తూ నివే దికను సిద్ధం చేసి, ప్రభుత్వానికి అప్పగించినట్లు కీలక సమా చారం. అంతేకాకుండా అనిల్ కుమార్ సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ కమిషన్ నివేదిక ఇచ్చింది. నెయ్యి నిబంధనలను సడలించడం ద్వారా కల్తీ నెయ్యి దందాకు వైసీపీ ప్రభుత్వ హయాంలో బీజం పడింది.ఇది బహిరంగ సత్యమైన నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అప్పటి ఈవో సింఘాల్ అడ్డు చెప్పలేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా అవకతవకలపై స్పష్టమై అవగాహన ఉన్నా సింఘాల్ స్పందించలేదని దినేశ్‌కుమార్ నివేదిక స్పష్టంచేసింది. సింఘాల్‌పై అభియోగాలు,ఆయనను కుంభకోణంలో కీలకగా దోషిగా పేర్కోడానికి కారణాలను ఏక సభ్యకమిషన్ నివేదిక పకడ్బంది ఆధారాలతో వివరించింది.ఇప్పటికే ఈ నివేదికను ముఖ్య మంత్రి చంద్రబాబును, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్ర సాద్‌ను కలిసి దినేష్‌కుమార్ స్వయంగా అందజేసారు.

నివేదికను పరిశీలించిన తరువాత క్రిమినల్ చర్యలకు ఆదేశించే దిశలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. తిరుమల కల్తీనెయ్యి సరఫరా విష యంలో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ జరిపింది. అధికారుల వైఫల్యాలను ఎత్తిచూపుతూ, వారిపై చర్యలుతీసుకోవాలని ప్రభుత్వానికి నివేది కలు ఇచ్చింది. వీటి ఆధారంగా అసలు కల్తీనెయ్యి కేసులో అధికా రుల పాత్ర ఏంటి? ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వా లంటూ దినేశ్‌కుమార్‌ను ఏకసభ్య కమిషన్‌గా నియమిస్తూ ప్రభు త్వం ఈ ఏడాది ఫిబ్రవరి 20న జీవో 458 జారీ చేసింది. 45 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ వ్యవహారంలో పలు లోతైన అంశాలు ఇమిడి ఉండటంతో అనంతర కాలంలో కమిషన్ విచారణ గడువును పొడిగించారు.


ఈ క్రమంలో అనేక అంశాలపై సమగ్ర పరిశీలన చేసి దినేష్‌కుమార్ నివేదిక రూపొందించారు. నిబంధనల సడలింపు వల్లే కల్తీనెయ్యి సరఫరాకు అవకాశం చిక్కిందని నివేదికలో వివరించారు. అప్పటి టీటీడీ ఈవో, ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్ సింఘాల్ పాత్ర ఇందులో ఉందని విచారణ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిసింది.

> అభిప్రాయాలు ఎప్పుడూ మార్చుకోని వ్యక్తి నిల్వ నీటితో సమానం. నిల్వ నీటిలో ఎన్నో జీవులు పెరుగుతాయి.
>
> - ఆస్కార్‌వైల్డ్

# మాటలతో ధరలు తగ్గవు!

'పదాల కన్న గొప్పది వాక్‌శక్తి, వాక్ శక్తి కన్న గొప్పది మనస్సు, మనస్సు కన్న గొప్పది సంకల్పం. మన పాలకుల్లో ఈ సంకల్పలోపం కారణంగానే ప్రజలకు ఇక్కట్ల మీద ఇక్కట్లు వచ్చి పడుతున్నాయేమోననిపిస్తున్నది. ఇతర సమస్యల మాటలెలా ఉన్నా రోజురోజుకు పెరిగిపోతూ ప్రజాజీవితాలను నరక ప్రాయంగా మారుస్తున్నది. తాజాగా వాణిజ్య సిలిండర్ ధర రూ.993 పెరిగి మూడువేల మూడువందల పదిహేను రూపాయలకు చేరుకుంది. దీని ప్రభావం ఇతర వస్తువులపైన ముఖ్యంగా హోటళ్లల్లో అమ్మే తినుబండారాలపై తీవ్రంగా ఉంటుంది. మరొకపక్క పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశాలున్నట్లు చెప్తున్నారు. కేంద్రం ప్రస్తుతానికి లేదని చెప్తున్నా పరిస్థితులు అలా కన్పించడం లేదు. ఇక నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చే ఆలోచన కానీ, ప్రయత్నం కానీ త్రికరణ శుద్ధిగా జరగడం లేదు. ధరల నియంత్రణకు, సమీక్షలకు సమావేశాలకు కొరత లేదు. కమిటీల మీద కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదం మోపుతాం, అవసరం అయితే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామంటూ ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ, అటు కేంద్ర ప్రభుత్వం కానీ హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. కానీ ఇవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో దళారులు లేరు. ప్రస్తుత పాలకులే కాదు, ఏపార్టీ అధికారంలో ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమ నిల్వలు చేసేవారిపై చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదరించడం ఒక రివాజుగా మారిపోయింది. అయితే ఈ విషయంలో గతంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్ మార్కెటీర్లను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా గడగడలాడిన సందర్భాలు లేకపోలేదు. కానీ అవి రాను రాను తగ్గిపోతున్నాయి. అధికారులను వారి వారి విధులను స్వేచ్ఛగా చేయనీయడం లేదేమోననిపిస్తున్నది. అన్నింటిలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం తమ సిఫారసులకు, రాజకీయ ఒత్తిడిలకు లొంగని సమర్థులైన అధికారులను బదలీ వేటుతోనో, ఇతర కుంటిసాకులతో శంకరగిరి మాన్యాలు పట్టించడం ఏనాటి నుంచో ఆరంభమైనా ఇటీవల పెరిగిపోతున్నది. అందుకే అప్పటి భయభక్తులు ఇప్పుడు లేవు. అధికారుల్లో కూడా అంకితభావం తగ్గిందనే చెప్పొచ్చు. బిల్లు, బెల్లు అనే తీరులోనే వ్యవహరించేవారు ఎక్కువైపోయారు. దీనికితోడు రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరు పెద్దలు మరికొందరు అక్రమ వ్యాపారస్తులతో మమేకం అవుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతున్నది. ఎన్నికలు కూడా అలానే రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంత ఉందని చెప్పక తప్పదు. కొందరు బడావ్యాపారులు, మరికొందరు రాజకీయ నాయకులతో అవినాభావ సంబంధాలు ఏర్పర్చుకుంటున్నారు. చివరకు ఈ భారమంతా ప్రజలు భరించక తప్పడం లేదు. దీంతో ఎన్ని కేసులు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు జారీ చేసినా తమను ఎవరూ ఏమీ చేయలేరనే దీమా అక్రమ వ్యాపారుల్లో అంతకంతకు పెరిగిపోతున్నది. ధరలు పెరగడానికి ముఖ్య కారణాల్లో ఇదొకటి. ద్రవ్యోల్బణంతోపాటుమార్కెట్ మాయాజాలం కూడా ఉందనేది నిర్వివాదం. పప్పుదినుసుల సాగు వివిధ కారణాలతో తగ్గిపోతున్న మాట వాస్తవం. ప్రకృతి సహకరించకపోవడం, అకాల వర్షాలతోపాటు చీడపీడలతో ఈసాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ పరిస్థితులను ముందుగానే ఊహించి దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు, దళారులుపావులు కదపడం సహజమే. ఈ విష యంలో పాలకులకు నిర్దిష్టమైన ప్రణాళిక, ముందుచూపు లేకపోవడం దురదృష్టకరం. రైతుల దగ్గర సరుకులున్నప్పుడు ధరలు పాతాళాలోకానికి పడిపోతున్నాయి. వారి దగ్గర నుండి వ్యాపారుల గోదాముల్లోకి చేరిన తర్వాత ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం ఉల్లిగడ్డల ధరలు చూసినా కిలో పది రూపాయలలోపే రైతుల వద్ద కొంటున్నారు. సాగు ఖర్చుల మాట దేవుడెరుగు. కనీసం రవాణా ఖర్చులు కూడా వస్తాయా లేదా అన్నట్లుగాఉంది పరిస్థితి. మొన్న పూల రైతులు చిత్తూరు జిల్లాల్లో రోడ్లపై పోసిపోయారు. రైతుల పరిస్థితి ఇలా ఉంటే వినియోగ దారుడికి మాత్రం ఏనిత్యావసర వస్తువులధరలు చూసినా మండిపోతున్నాయి. ఉత్పత్తులన్నీ ఎక్కడ ఏమోవుతున్నాయి? ఎక్కడెక్కడ గోదా ముల్లో ఉన్నాయి? అవి ఎవరివి? నిబంధనలు అతిక్ర మించి దాచిన అక్రమ నిల్వలు ఎన్ని? తదితర వివరాలు అధికారులకు తెలియకుండాపోయాయి. అవకాశాలు ఏమాత్రం లేవు. వాటిని బయటపెట్టి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాగలిగితే కొంతమేరకైనా ధరలు తగ్గే అవకాశాలుంటాయి. ఇక రైతులు నేరుగా తమ ఉత్పత్తులను వినియోగదారులకు అమ్ముకునేందుకు ప్రత్యేకంగా రైతు బజార్ల విధానాన్ని ప్రవేశపెట్టారు. కానీ అది కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి. దళారులే పట్టాదారు పాసుపుస్తకాలు సంపాదించి రైతుల అవతారమెత్తి ఈ రైతు బజార్లలో ఏకకాలంలో అన్నిరకాల కూరగాయలు పండించినట్లు రైతు బజార్లలో పెట్టి అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. సమీక్షలు, సమావేశాలతో కాలం గడపకుండాఅక్రమ నిల్వలను బయటకు తేవాలి. నల్లబజారులో అమ్మేవారిపై ఉక్కుపాదం మోపి ధరలను అదుపులోకి తేవాలి. ఇందు లో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదు.

> మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం ఈ నాలుగు వెనక్కి రావు.
>
> ప్లినీ



> సలహా ఇచ్చేటప్పుడు విచక్షణ పాటించాలి. స్వీకరించేటప్పుడు వినమ్రంగా ఉండాలి.
>
> స్వామి వివేకానంద



## ప్రజావాక్కు



### ప్రాణాలు తీస్తున్న పేలుళ్లు

భారతదేశంలోని బాణసంచా తయారీ కేంద్రాలలో తరచుగా జరుగుతున్న పేలుళ్ల సామాన్యుల ప్రాణాలను గాలిలోదీపంగా మారుస్తున్నాయి. గతఐదు సంవత్సరాలలో సుమారు 180 ప్రమాదాలు సంభవించగా, 480 మందికిపైగా ప్రాణాలుకోల్పోవడం అత్యంత విచారకరం. ముఖ్యంగా తమిళనాడులోని విరుదునగర్ జిల్లా ఇటువంటి మరణకాండలకు కేంద్రబిందువుగా మారింది. భద్రతా ప్రమాణాలను విస్మరించడం, నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో కూడా పనులు కొనసాగించడం యాజమాన్యాల లాభాపేక్షకు నిదర్శనం. పరిమితికి మించి కార్మికులనుగుమిగూడించడం, నిషేధిత రసాయనాల వినియోగం, ముడి సరుకుల అక్రమ నిల్వలు ఈ విపత్తులకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. అనుమతి పొందిన సంస్థలు కూడా భద్రతా చర్యలను గాలికి వదిలేయడం వల్లఅమాయక కార్మికులు బలిఅవుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఎగ్జిట్ పోల్స్‌పై నమ్మకం పోతోంది

గతంలో పోలింగ్ పూర్తయిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలయ్యేవి. అవి దాదాపు వాస్తవానికి దగ్గరగా ఖచ్చితంగాఉండేవి. కానీ, నేడుఎగ్జిట్ పోల్స్ నిర్వహించే వారు. ఆయారాజకీయపార్టీలకు అనుకూలంగా సర్వే చేస్తున్నారు. దాంతో అసలు ఫలితాలను ప్రజలకు అందించలేకపోతున్నారు. గతంలో వేర్వేరు సంస్థలు నిర్వహించిన ఫలితాలు వేర్వేరుగా ఉండేవి. ఇప్పుడు అన్నిసంస్థల సర్వేలు ఒకేలా ఉండటంతో, ఎగ్జిట్ పోల్స్‌పై ప్రజలలో నమ్మకంపోయింది. అందుకే ఈ ఎగ్జిట్ పోల్స్ వివాదాస్పదం అవుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్ పైనిర్వహించే సంస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అంతేకాని రాజకీయ పార్టీలకుకాదనిగ్రహించాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపిలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజల ఫిర్యాదులు వివిధ శాఖలకుసంబంధించి ప్రత్యక్షంగా జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ వారు స్వీకరణ చేస్తూ వారికి రసీదు ఇవ్వడం ఎంతో తృప్తికరం. వారు సమస్య స్థితిని వ్యక్తంచేయడం కూడా కొంత ఉపశమనం ఉంటుంది. ఐతే ఫిర్యాదుల సంఖ్యశాఖలవారీ ప్రకటనతోపాటు, దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి హెచ్చు ప్రాధాన్యత ఉంటుంది. వాటి స్థితిని బట్టి వ్యవధి అవసరం.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

### ఏడు రోజులు ఏడు సబ్జెక్టులు

విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు చాలా కీలకమైనవి. సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ మొదటి సర్టిఫికేట్. కొంత కాలం పూర్వం సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ అని ఉండేది. ఆ సర్టిఫికెట్ ఆధారంగానే విద్యార్థిని విద్యార్థుల పుట్టిన తేదీ ధ్రువపరచడం జరుగుతూ ఉన్నది. ఇంటర్మీడియట్ బోర్డు ఒక దోపిడీ వ్యవస్థగా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఇంటర్మీడియట్ బోర్డును రద్దుచేసి ప్రస్తుతం ఉన్న హై స్కూల్స్, హై స్కూల్ ప్లస్‌గా మార్చాలి. అదేవిధంగా ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు జనరల్ సైన్స్ ను విడదీసి విడివిడిగా భౌతిక శాస్త్రం జీవశాస్త్రం సబ్జెక్టులుగా పెట్టి ఏడు సబ్జెక్టులు పదవ తరగతి వరకు బోధించి బోర్డ్ ఎగ్జామ్స్ పెట్టాలి. ఒక ఎగ్జామినేషన్‌కు ఇంకొక ఎగ్జామినేషన్ మధ్య మధ్యలో సెలవులు ఇవ్వకుండా పరీక్షలను వరుసగా ఆదివారం కూడా మినహాయింపు లేకుండా ఏడు రోజులు ఏడు సబ్జెక్టులు పెట్టాలి.

- వీరగంట రూపవతి, బొబ్బిలి

### ఆవేదన

విదేశాలకు వెళ్లిన పిల్లలు తమ భవిష్యత్తు కోసం కష్టపడుతుంటారు, కానీ ఇక్కడ వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులు ఒంటరితనంతో జీవిస్తున్నారు. డబ్బులు పంపించడం బాధ్యతలో ఒకభాగమే గానీ, అదిప్రేమను, తోడును భర్తీ చేయదు. ఫోన్‌కాల్స్ మాత్రమేకాదు, వీడియో కాల్స్‌లో చూసినంత మాత్రాన కూడా ఆ ప్రేమను అనుభవించలేరు. పిల్లల నవ్వుల్లో జీవించిన తల్లిదండ్రులు, ఇప్పుడు స్క్రీన్‌లో కనిపించే ముఖాలకే పరిమితమవ్వడం బాధాకరం. పెంచితే ఇలానా?" అన్న ప్రశ్నవారి మనసులో నిశ్శబ్దంగా మార్మోగుతుంది. వాళ్లు ఆశించేది డబ్బు కాదు, తమ పిల్లల సమీపం, స్నేహం, మమత. వృద్ధాప్యంలో ఒక దగ్గరగా ఉండటం, ఒక ఆప్యాయమైన మాట. ఇవే వారికి నిజమైన ఆనందం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### సాంకేతిక లోపం

మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ఓపెన్ కావడం లేదు. తరుచూ సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయి. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈలోపం కారణంగా అనేకమంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

- పి. రాజశేఖర్, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అటవీ సంస్కృతిని అణచలేమా?

**ఈ రాక్షస క్రీడ ఇంత వికృతరూపం దాలుస్తున్నా నిందితులను సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారంటే ఏమనుకోవాలి. అక్కడక్కడ కేసులు నమోదు చేసినా కొద్దిపాటి శిక్షలతో బయటపడుతున్నారు. ప్రాణ సమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న వింత పశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా, నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించే వారికి ఒక తిరుగులేని హెచ్చరికను అందించగలుగుతాం. దేశం నుంచి ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతారు. చట్టాన్ని అమలు చేసే చిత్త శుద్ధిలేనప్పుడు, త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, శిక్షలు, హెచ్చరికలు అన్నీ నిష్ప్రయోజనమే.**

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని ఎందరు నేతలు ఎన్నిసార్లు హెచ్చరించినా ర్యాగింగ్ భూతం వదిలిపెట్టడం లేదు. ఈ ర్యాగింగ్‌కు ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. వీటిలో కొన్ని మాత్రమే వెలుగు చూస్తున్నాయి. తమకు జరిగిన అవమానాలు భరించలేక, బయటకు చెప్పుకోలేక, వారిలో వారు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలు చేసుకోవడానికి కూడా వెనుకాడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ ఆటవిక సంస్కృతి కొనసాగుతూనే ఉంది. చాలా సందర్భాల్లో ఈ దురదృష్టకర సంఘటనలు వెలుగు చూడడం లేదు. అయితే వైద్య కళాశాలల్లో ర్యాగింగ్‌ను నిరోధించేందుకు జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి) ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పోర్టల్ బాధిత విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతున్నది. ఇందుకు తాజాగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో(కెఎంసి) జరిగిన ర్యాగింగ్‌ను ఉదహరించవచ్చు. కేవలం యాప్ ద్వారానే ఈ ర్యాగింగ్ వెలుగు చూసింది. సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. అయితే ఆ ఘర్షణకు సంబంధించి రెండువర్గాలు రాజీ కుదుర్చుకున్నాయి. కానీ ఆ పక్క రోజు జూనియర్స్ తమ వాట్సాప్ గ్రూపులో సీనియర్లపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ఈ విషయం సీనియర్లకు తెలియడంతో వసతి గృహంలోని భవనంపైకి జూనియర్లను పిలిపించి వాట్సాప్ పోస్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమేకాక మోకాళ్లపై కూర్చోబెట్టి తప్పయిందని, మరొకసారి ఇలా చేయమని క్షమాపణలు చెప్పించుకున్నారు. ఈ దృశ్యాలను కూడా జూనియర్లు సెల్‌ఫోన్‌లో రహస్యంగా రికార్డు చేశారు. దాన్ని జాతీయ వైద్య మండలి ఫిర్యాదుల పోర్టల్‌కు పంపించారు. దీంతో ఎన్ఎంసి అధికారులు వెంటనే రంగంలోకి దిగి డిఎంఇకి లేఖరాశారు. దీంతో డిఎంఇ సంబంధిత ప్రిన్సిపల్‌కు సమాచారం ఇచ్చి విచారణకు ఆదేశించారు. అప్పటివరకు కెఎంసి అధికారులకు ర్యాగింగ్ విషయం తెలియలేదంటే ఏమనుకోవాలి?. దీంతో ఆఘమేఘాలపై రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి ర్యాగింగ్ జరిగిందని నిర్ధారించారు. ఏడుగురు సీనియర్లను ఆరు నెలలపాటు సస్పెండ్ చేస్తూ ప్రిన్సిపల్ ఆదేశాలు ఇచ్చారు. అలాగే కోర్సు పూర్తయ్యేవరకు వసతి గృహంలో ఉండడానికి వీల్లేదని నిర్ధేశించారు. ఇక హైదరాబాద్‌లోనిఉస్మానియా వైద్యకళాశాలలో పిజి ప్రథమ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థి ఆత్మహత్యకు సీనియర్ల ర్యాగింగే కారణమంటూ కుటుంబ సభ్యులు గత నెల పదిహేనో తేదీన ఉస్మానియ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాడని, కళాశాలలో కొందరు ర్యాగింగ్ చేస్తున్నారని ఇటీవల తమకు ఫోన్‌లో చెప్పినట్లు వారంటున్నారు. అయితే అక్కడికి వచ్చి మాట్లాడుతామని చెబితే ఫిర్యాదులు చేస్తే వేధింపులు మరింత ఎక్కువ అవుతాయని, రావొద్దని చెప్పినట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. పిజిలో తను అనుకున్న విభాగంలో సీటు రాకపోవడం వల్ల ఒత్తిడితో బాధపడుతూ ఒక మానసిక వైద్యుడి సూచనతో మాత్రలు కూడా వాడుతున్నాడని, గదిలో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు, మత్తు ఇంజక్షన్ తీసుకొని ప్రాణాలు తీసుకున్నాడనేది మరొక వాదన. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతయేడాది గుజరాత్‌లోని పాఠక్ జిల్లాలోని వైద్యకళాశాలలో సీనియర్లు ఒక జూనియర్ విద్యార్థిని మూడుగంటలపాటు నిలబెట్టి పైశాచిక ఆనందం పొందారు. దాంతో ఆ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లి ఆతర్వాత అటునుండి అటే పరలోకానికిపయనం కట్టాడు. తెలంగాణలో ఖమ్మం జిల్లాలో కొత్తగా చేరిన ఒక విద్యార్థి హెయిర్‌స్టయిల్ బాగాలేదంటూ సీనియర్లు ర్యాగింగ్ చేశారు. ఈ విషయం ఆ కాలేజీ ర్యాగింగ్ నిరోధక కమిటీ ఇన్‌ఛార్జ్ దృష్టికి పోవడంతో జూనియర్‌పై ఆగ్రహం చేసిన సీనియర్లు తమ మీదనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఆ విద్యార్థికి గుండుకొట్టించారు. ఇలా దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్ కాలేజీల్లోనే కాదు ఇప్పుడు డిగ్రీకాలేజీలు, చివరకు ఇంటర్మీడియేట్ స్థాయికి కూడా ఈర్యాగింగ్ భూతం విస్తరిస్తున్నది. దీనిని నిరోధించేందుకు చట్టాలు చేస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యుజిసి) కఠిన మార్గదర్శకాలను రూపొందించింది. అయినా ఫలితం లేకుండాపోతున్నది. యేడాది యేడాదికి పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. కాలేజీల్లో జూనియర్లకు రక్షణ కవచంగా ఉండాల్సిన కొందరు అధ్యాపకులు ర్యాగింగ్ చేసేవారికి కాపలాదారు లుగా మారిపోవడం దురదృష్టకరం. 'నేను చదువుతున్న కాలేజీలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనొచ్చు. కానీ వారే నీచంగా ప్రవర్తిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి? నాలాగే ఇక్కడ చాలామంది అమ్మాయిలు బాధపడుతున్నారు, మాలో ఎవరో ఒకరు చనిపోతేనే ఈ విషయం బయటి ప్రపంచానికి తెలుస్తుంది. అందుకే నేను ఈ పనిచేస్తున్నా' అంటూ గత యేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఒక విద్యార్థిని ప్రాణం తీసుకుంది. ఇలాంటి సంఘటనలు బయటపడినప్పుడు ప్రభుత్వాలు, భద్రతా వ్యవస్థలు, ర్యాగింగ్ నిరోధక కమిటీలు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ర్యాగింగ్ నిరోధక నిబంధనలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ యుజిసి కళాశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తూనేఉంది. అయినా ఎలాంటి మార్పులు రావడం లేదు. కొందరు విద్యార్థులు ఈ ర్యాగింగ్ పేరుతో సాగిస్తున్న కార్య క్రమాలు వినడానికి జుగుప్సా కరంగా ఉంటున్నాయి. ఈ వికృత చేష్టలను వీడియో టేప్‌చేసి దాంతోజూనియర్లను బ్లాక్‌మెయిల్ చేసి మళ్లీ మళ్లీ ఉపయోగించుకునే తలంపు సభ్యసమాజాన్ని తలవంచుకునేలా చేస్తున్నది. కొన్నిసార్లు పోలీసులు రంగప్రవేశం చేసి, నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేసిన తర్వాత కూడా యాజమాన్యాలు స్పందించడం లేదు. అసలు ర్యాగింగ్ అనేది ముందుగా కేవలం ఇంజినీరింగ్, మెడికల్‌లాంటి ప్రొఫెషనల్ కాలేజీల్లో 19వశతాబ్దం ఆరంభంలో మొదలైందని చెప్తారు. ఇది రానురాను కాలేజీలన్నింటికి విస్తరించింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఇంటర్మీడియేట్ విద్యను పూర్తిచేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకుంటూ కాలేజీలోనికి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరకు, భయం పోగొట్టి నలుగురు కలిసిమెలిసి ఉండేలా చేసేందుకు చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. ప్రారంభంలో అంతవరకే పరిమితమైంది. కానీ రాను రాను శృతిమించడంతో కొందరు విద్యార్థులకు ప్రాణాంతక, వికృత కేళిగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విష వలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా చేస్తున్న ఈ ర్యాగింగ్‌ను లేత మనసులు తట్టుకోలేకపోతున్నాయి. దీనికి అశ్లీల సాహిత్యం, నీలిచిత్రాలు, మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు తోడు కావడంతో పరాకాష్టకు చేరిందని చెప్పొచ్చు. ఇప్పటికే దేశంలో ఎంతోమంది మెరికల్లాంటి విద్యార్థులు దీనికి బలైపోయారు. అకారణంగా మెరికల్లాంటి పిల్లలను కోల్పోయిన ఆ కుటుంబాల గర్భశోకాన్ని ఏమిచ్చి తీర్చగలరు? ఈ రాక్షస క్రీడ ఇంత వికృతరూపం దాలుస్తున్నా నిందితులను సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారు. అక్కడక్కడ కేసులు నమోదు చేసినా కొద్దిపాటి శిక్షలతో బయటపడుతున్నారు. ప్రాణసమానంగాపెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా, నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించేవారికి ఒక తిరుగులేని హెచ్చరికను అందించగలుగుతాం. దేశం నుంచి ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతారు. చట్టాన్ని అమలు చేసేందుకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, హెచ్చరికలు అన్నీ నిష్ప్రయోజనమే. •

## ఒక్క మాట

# యుద్ధాలతో ప్రపంచం అతలాకుతలం


కనుమ ఎల్లారెడ్డి

నేడు విశ్వం యుద్ధాలతో చాలా భయానక వాతావరణం తలపిస్తోంది. రష్యా, ఉక్రెన్ యుద్ధం ఒక ప్రక్క సాగుతుండగా, మరోప్రక్క ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులతో భయకంపితుల్ని చేస్తోంది. ఇరాన్‌లో అంతా మరుభూమిని తలపిస్తోంది. అమెరికాకుతోడుగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తోడుగా నిలిచాయి. ఇరాన్ ప్రక్క హెజ్‌బొల్లా, ఇరాకీ మిలిషియా అండగా నిలిచాయి. ఇవి లెబనాన్‌లోని తీవ్రవాద సంస్థలు. ఇందులో హెజ్‌బొల్లా భయంకరమైన సంస్థ. ఆకస్మాతుగా ఇజ్రాయెల్ పై దాడి చేసింది. ఈ దాడులను ఇజ్రాయెల్ తిప్పి కొటిడితే భారీ నష్టమే జరిగిపోయింది. ఇలా దాడులు, ప్రతి దాడులతో విశ్వం అతలాకుతలమవుతోంది. ఆయా దేశాలలోని పౌరులు ఏ క్షణనా ఏమి జరుగుతుందో అని బిక్కు బిక్కుమంటున్నారు. ఇప్పుడు రష్యా, ఉక్రెన్ యుద్ధం కంటే ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల గురించే ఎక్కువగా చర్చించుకుంటున్నారు. అటు ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. ఈ పరస్పర దాడులతో మధ్యలో కువైట్, సౌది, ఖతర్ తీవ్రంగా నష్టపోతున్నాయి. ఫలితంగానే సౌదిలోని ఆరామ్ కొ చమురు కేంద్రంపై ఇరాన్ దాడి చేసి తీవ్ర నష్టం కలిగించింది. ఇలా పరస్పర దాడులతో ఏం సాధిస్తాయో అర్థం కావడం లేదు. అసలు తప్పంతా అమెరికా, ఇజ్రాయెల్ దాడులతోనే వచ్చింది. ముందు నుంచి ఇరాన్‌ను మెత్తగా మచ్చిక చేసుకుని అణు స్థావరాలు వాటిలోని నిల్వలను ధ్వంసం చేసివుంటే ఏ తగాదా ఉండేది కాదు. దీనికితోడు ఇరాన్ భద్రతా మండలి సెక్రటరీ అలీ లరీ జని మేము చర్చలకోసం ప్రయత్నం చేయడం లేదు అనడం గమనార్హం. ఒక విధంగా చుస్తే ఖమేని లక్ష్యంగా ఇది కొనసాగింది. ఇజ్రాయెల్ అత్యంత సాంకేతికతతో 'మోసద్' అనే క్షిపణితో ఇరాన్ అధినేతను మట్టు పెట్టింది. రంగంలోకి హెజ్బుల్లా రాకపోయి ఉంటే బాగుండేది. ఎందుకంటే ఏడాదిక్రితమే ఇజ్రాయెల్, హెజ్బుల్లా మధ్య కాల్పుల ఒప్పందం జరిగింది. ఇదే విషయం లెబనాన్ చెప్పినా కూడా హెజ్బుల్లా వెనక్కి తగ్గలేదు. కాని ఖమేని మృతితో ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇప్పుడు యుద్ధం భీకర రూపం దాల్చుతోంది. ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్, అమెరికాకు కూడా నష్టం వాటిల్లుతోంది. అయితే ఇవి ఆ దేశాలు లెక్క చేయవు. మొత్తం ఇరాన్ పూర్తిగా మరు భూమిగా మారాలని అమెరికా, ఇరాన్ పై అత్యాధునిక ఆయుధాలు వినియోగిస్తోంది. ఇది ఇలా ఉండగా ఇజ్రాయెల్ ప్రకటన మా దాడిలో ఇరాన్ పగ్గాలు చేపట్టిన ఆయా తుల్లా ఆలీ రెజా కూడా మరణించారన్న వార్త హల్‌చల్ చేసింది. అయితే ఇరాన్ దీన్ని ధ్రువీకరించలేదు. ఇలా దేశ నాయకులను చంపుకుంటూపోతే ప్రగతి ఏ దేశమైన ఏమి సాధించలేదు. ఇలా మధ్య ప్రాచ్యం అట్టుడికిపోతోంది. ఈ యుద్ధాలతోనే వేగలేకపోతుంటే పాక్, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధం మరో కోణంలో జరుగుతోంది. పాక్‌లోని బెలూచిస్థాన్ కూడా పాక్ పై గుర్రుగా ఉంది. ఇప్పుడు దేశాల మధ్య శాంతి కావాలి, అంతర్జాతీయ చట్టాలను అన్ని దేశాలు పాటించాలి. శాంతి సంస్థ ఐక్యరాజ్య సమితి మధ్యవర్తిత్వంతో దేశాలు యుద్ధం ముగించి శాంతి పరిమళాలు కురిపించాలి. ఇది ఏ స్థాయికి పోతుందో చెప్పలేం. యుద్ధం ఆపడమా, చర్చలు చేపట్టడ మా అనేది నాయకులే తేల్చుకోవాలి. చర్చలకు సిద్ధం అని ఇరాన్ చెబుతున్నప్పుడు అమెరికా అంగీకరించాలి. చర్చలుతోనే పశ్చిమ ఆసియాలో శాంతి నెలకొంటుంది అనే అభిప్రాయం వ్యక్తమావుతోంది. లేకపోతే అమాయక, ఏమి తెలియని పౌరులు మరణిస్తారు. ఇది ఎంత మాత్రం సహింపరానిది. విశ్వం యుద్ధాల మయం అయితే అభివృద్ధి కుంటు పడుతుంది. ఇప్పటికైనా నాయకులు కళ్లు తెరవాలి. హింసతో ఏదీ సాధ్యం కాదు. కనుక చర్యల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలి. •

# ప్రైవేటు ప్రయాణం నుంచి ప్రభుత్వ సారథ్యం వైపు..

రామ కిష్టయ్య సంగన భట్ల

హైదరాబాద్ మహానగర చరిత్రలో మెట్రో రైలు కేవలం ఒక రవాణా సౌకర్యం మాత్రమే కాదు, అది ఒక సామాజిక, ఆర్థిక విప్లవం. భాగ్యనగర జీవన రేఖగామారిన ఈ ప్రాజెక్టు, ఇప్పుడు ఒక కీలకమైన పరివర్తన దశలోఉంది. దశాబ్ద కాలంపాటు ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచిన ఈ ప్రయాణం, ఇప్పుడు ప్రభుత్వ సారథ్యం వైపు మళ్లుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఎల్‌అండ్‌టి మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్‌లో ఈక్విటీ వాటాను కొనుగోలు చేయాలని భావించడం వెనుక కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే లేదు, దాని వెనుక నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న ఒక వ్యూహాత్మక దార్శనికత ఉంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు బీజాలు 2008లోనే పడ్డాయి. అప్పట్లో ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి) మెట్రో ప్రాజెక్టుగా ఇది ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మొదట మేటాస్ సంస్థకు అప్పగించినా, ఆ తర్వాత తలెత్తిన సంక్షోభాలవల్ల 2010లో ఎల్‌అండ్‌టి సంస్థ ఈ బృహత్తర బాధ్యతను స్వీకరించింది. సుమారు 22 వేల కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మితమైన ఈ వ్యవస్థ, మూడు ప్రధాన కారిడార్ల ద్వారా 69 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 2017 నవంబర్ 28న అప్పటి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా మియాపూర్ నుండి నాగోల్ వరకు ప్రారంభమైన ఈ ప్రయాణం, అనతి కాలంలోనే నగర వాసుల దైనందిన జీవితంలో అంతర్భాగమైంది. ప్రస్తుత గణాంకాల ప్రకారం, నిత్యం ఐదు లక్షల నుండి ఆరు లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు. ఐటీ హబ్‌లకు ప్రయాణించే ఉద్యోగులు, వాణిజ్య ప్రాంతాలకు వెళ్లే వ్యాపారులు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరికీ మెట్రో ఒక సురక్షితమైన, వేగవంతమైన మార్గంగా నిలిచింది. అయితే, ఈ వెలుగుల వెనుక ఆర్థికపరమైన సవాళ్లు కూడా ఉన్నాయి. మెట్రో ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చుకోలేకపోయింది. ముఖ్యంగా కోవిడ్19 మహమ్మారి విధించిన లాక్‌డౌన్ సమయం ఈ సంస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రయాణికుల సంఖ్య తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం, బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించాల్సి రావడం వంటి కారణాలతో ఎల్ అండ్ టి సంస్థ ఆర్థిక ఒత్తిడికి గురైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టులో భాగస్వామి కావాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఈక్విటీని కొనుగోలు చేయడం వల్ల మెట్రో కేవలం ఒక వ్యాపార వస్తువుగా కాకుండా, ప్రజా సేవా దృక్పథంతో నడిచే అవకాశం ఉంటుంది. దీనివల్ల చార్జీల నియంత్రణ, భద్రత, విస్తరణ నిర్ణయాల్లో ప్రభుత్వానికి పూర్తిస్వేచ్ఛ లభిస్తుంది. మరోవైపు, హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న కొద్దీ పాత మెట్రో మార్గాలు సరిపోవడం లేదు. నగరంలోని నలు మూలలను అనుసంధానం చేయడానికి 'మెట్రో ఫేజ్2' విస్తరణ అనివార్యమైంది. ప్రభుత్వం సుమారు 76 కిలోమీటర్ల మేర కొత్త మార్గాలను ప్రతిపాదించింది. ఇందులో అత్యంత కీలకమైనది రాయదుర్గం నుండి శంషాబాద్ విమానాశ్రయం



వరకు సాగే 31కిలోమీటర్ల ఎయిర్‌పోర్టు కారిడార్. సుమారు 6,000 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఈ మార్గంవల్ల అంతర్జాతీయ ప్రయాణికులకు ట్రాఫిక్ చిక్కులు తప్పుతాయి. అలాగే నాగోల్ నుండి ఎల్బీనగర్ వరకు అనుసంధానం చేయడం, మియాపూర్ నుండి పటాన్‌చెరు వరకు పొడిగించడం వంటి ప్రణాళికలు నగర పరిధిని మరింతగా పెంచుతాయి. వీటన్నిటికంటే ముఖ్యంగా, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న పాతబస్తీ మెట్రో అంశం ఇప్పుడు ఒకకొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఎంజీబీఎస్ నుండి చాంద్రాయణ గుట్ట వరకు పాతబస్తీ గుండా మెట్రోను నిర్మించడం సామాజికంగా, రాజకీయంగా సవాలుతో కూడుకున్నది. భూసేకరణ సమస్యలు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, ఇరుకైన రహదారులు అడ్డంకులుగా నిలిచినప్పటికీ, పాతనగర ప్రజలకు కూడా ఆధునిక రవాణాఫలాలను అందించాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. ఇది నగరంలోని రెండు విభాగాల మధ్య ఉన్న రవాణా అంతరాన్ని తొలగించి, సమగ్ర నగర అభివృద్ధికి బాటలు వేస్తుంది. మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం వల్ల లభించే మరోగొప్ప ప్రయోజనం 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్'. అంటే మెట్రో రైలును టీజీఎస్‌ఆర్‌టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు త్వరలో రానున్న రీజినల్ రింగ్ రోడ్‌తో అనుసంధానించడం. దీనివల్ల ప్రయాణికులు ఒకే టికెట్ లేదా కార్డ్ ద్వారా వివిధ రకాల రవాణా మార్గాల్లో ప్రయాణించవచ్చు. ఇది నగరంలో వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించి, కాలుష్య నివారణకు తోడ్పడుతుంది. అలాగే 'ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్' పద్ధతిలో మెట్రో స్టేషన్ల చుట్టూ వాణిజ్య సముదాయాలను నిర్మించడం ద్వారా ప్రభుత్వం అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. కానీ ఈ ప్రస్థానంలో ఆర్థిక సవాళ్లు ప్రధానమైనవి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాలు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. ఈ క్రమంలో మెట్రో ఈక్విటీని కొనుగోలు చేయడం, కొత్త ఫేజ్ నిర్మాణానికి వేలకోట్ల రూపాయలను సమీకరించడం ప్రభుత్వానికి ఒక కత్తిమీద సాము వంటిదే. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన వాటా, రుణాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుండి సహాయం పొందే విషయంలో రాజకీయ చతురత అవసరం. ప్రభుత్వం నియంత్రణలోకి వెళ్ళినప్పుడు ప్రైవేటు రంగంలోని చురుకుదనం, నాణ్యత తగ్గకుండా చూసుకోవడం కూడా ఒక పెద్ద బాధ్యత. బ్యూరోక్రసీ వల్ల నిర్ణయాల్లో జాప్యం జరగకుండా ఒక స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మాత్రమే ఈ లక్ష్యాలను సాధించవచ్చు. హైదరాబాద్‌ను కేవలం ఒక ప్రాంతీయ నగరంగా కాకుండా, గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆలోచనలో మెట్రో విస్తరణ ఒక ముఖ్యమైన పిల్లర్. ఐటీ, ఫార్మా రంగాలు ఇప్పటికే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఈరంగాల్లో పెట్టుబడులు పెరగాలంటే మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి. ఒక సమర్థవంతమైన మెట్రోవ్యవస్థ కార్బన్ ఫుట్‌ప్రింట్‌ను తగ్గించి, నగరాన్ని పర్యావరణహితంగా మారుస్తుంది. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థే ఆ నగర ఆర్థిక శక్తిని నిర్ణయిస్తుంది. హైదరాబాద్ మెట్రో పరిణామ క్రమం ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ నుండి ప్రభుత్వ భాగస్వామ్యం వైపు సాగుతున్న ఈప్రయాణం కేవలం యాజమాన్యమార్పు మాత్రమే కాదు, అది నగరప్రణాళికలో ఒక నూతన విప్లవం. •

MN 5 PAGE-GNT :MN 5 PAGE-GNT 01/01/2001 11:43 Page 1



గుంటూరు వార్త

## రానున్న ఐదు రోజులు ఎండల తీవ్రత పట్ల
# అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ

**41 సెల్సియస్ నుండి 54 సెల్సియస్ వరకు ఎండ వేడిమి ..**

**ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దు**

**గుంటూరు, మే1, ప్రభాతవార్త ప్రతినిధి :** రానున్న ఐదు రోజుల పాటు జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉండనుందని, ప్రజలు



అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రానున్న ఐదు రోజులలో వేసవి తీవ్రత (హీట్ ఇండెక్స్) అధికంగా ఉంటుందని సూచించింది అన్నారు. 41 సెల్సియస్ నుండి 54 సెల్సియస్ వరకు ఎండ వేడిమి ఉండవచ్చని తెలియజేసిందన్నారు. గుంటూరు తూర్పు, మేడికొండూరు, కొల్లిపర, మంగళగిరి, పొన్నూరు ఫిరంగిపురం, చేబ్రోలు, పెదనందిపాడు, తాడేపల్లి, తాడికొండ, గుంటూరు పశ్చిమం, పెదకాకాని, కాకుమాను, తెనాలి, వట్టిచెరుకూరు, తుళ్ళూరు, దుగ్గిరాల, ప్రత్తిపాడు మండలాలు ఈ ప్రభావానికి లోన అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అత్యవసర పనులు ఉంటే మినహా ప్రజలు ఎవరు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రావద్దని ఆయన సూచించారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తాగాలని సూచించారు. చిన్నారులు, వయసు మీరినవారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు చూడాలని చెప్పారు. డీ హైడ్రేషన్ కు గురికాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు టోపి, తలపాగా వంటివి ధరించాలన్నారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగవద్దని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని, అధికారులు ప్రజలకు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

## ఘనంగా రథోత్సవం..



11

# రాష్ట్రానికి ఆర్థిక భారం ఉన్నా..పెన్షన్ల పంపిణీ ఆగదు..

**గుంటూరు, మే1,ప్రభాతవార్త ప్రతినిధి :** గత ప్రభుత్వం 1వ తేదీన పెన్షన్లు అందించడంలో విఫలమైంది. రాష్ట్రంలో ఆర్థిక భారం ఉన్నప్పటికీ లబ్ధిదారులకు పెన్షన్లను అందించడం కూటమి ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనం. ప్రతి నెల 1వ తేదీన అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తూ



ఆర్థిక భరోసా కల్పిస్తోంది." అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు మాట్లాడారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని 14వ డివిజన్, రామ్

### పింఛన్ల పంపిణీలో పెమ్మసాని

రహీమ్ కాలనీలో జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ గారి తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పెమ్మసాని గారు మాట్లాడుతూ..వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర అర్హులైన వారికి సమయానికి పారదర్శకంగా కూటమి ప్రభుత్వం పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇతర రాష్ట్రాల్లో పెన్షన్ మొత్తాలు తక్కువగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో అధిక మొత్తంలో పెన్షన్లు అందిస్తున్నామని, దివ్యాంగులకు నెలకు రూ. 6000లు, పూర్తిగా వికలాంగులైన వారికి రూ. 15000ల వరకు పెన్షన్ అందిస్తున్నామని వివరించారు. ఈరోజు గుంటూరు ఈస్ట్, గుంటూరు వెస్ట్, ప్రత్తిపాడు ప్రాంతాల్లో కలిపి సుమారు రూ. 25 కోట్ల విలువైన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. అదేవిధంగా 86 మంది కొత్త లబ్ధిదారులకు కూడా పెన్షన్లు మంజూరు చేయడం తెలిపారు.

## ఏఎన్‌యులో ఇక అంతా ప్రొఫెసర్‌లే..!

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మే1,ప్రభాతవార్త:** ఏఎన్‌యులో శుక్రవారం అధ్యాపకులకు సిఏఎస్ (కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్) ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూల ద్వారా ఇప్పటి వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌లుగా ఉన్న వారు ప్రొఫెసర్‌లుగా పదోన్నతులు పొందనున్నారు. దీంతో వర్సిటీలో ఉన్నవారంతా ప్రొఫెసర్ హోదాలో ఉంటారు. కాగా ప్రస్తుతం ప్రొఫెసర్‌లుగా ఉన్న మరికొందరు సీనియర్ ప్రొఫెసర్ హోదా కోసం కూడా సిఏఎస్‌కు దరఖాస్తు చేసుకుని



పాల్గొన్నారు. ఇక వర్సిటీలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్, ఒకరు అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో ఉన్నారు. సిఏఎస్ ఇంటర్వ్యూలు రాత్రి 10గం.ల వరకు జరిగాయి. ఈనెల 15వ తేదీకి కొంచెం అటుఇటుగా అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చేందుకు వర్సిటీ సన్నాహాలు చేస్తుంది. గత వారంలో రోస్టర్ కమిటీని వర్సిటీ నియమించింది. ప్రభుత్వ ఒత్తిడి నేపథ్యంలో నోటిఫికేషన్‌కు సన్నద్ధం చేస్తున్నారు.

# గుంటూరు పార్లమెంట్ నేతల ఆత్మీయ విందు

### పాల్గొన్న విద్య మరియు ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

**గుంటూరు, మే1,ప్రభాతవార్త ప్రతినిధి :** గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాసంలో గుంటూరు పార్లమెంట్ కు చెందిన ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు, సమావేశం శుక్రవారం సాయంత్రం జరిగింది. పెమ్మసాని గారి నివాసంలో జరిగిన ఈ విందు భేటీకి విద్య మరియు ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గారు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా



పార్టీ బలోపేతంపైనా నేతలు సమాలోచనలు జరిపారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలతో పాటు గుంటూరు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నేతలు చర్చించారు. నియోజకవర్గాల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళికలపై కూడా చర్చించారు. గడిచిన 22 నెలల కాలంలో సాధించిన అభివృద్ధి నిధుల సేకరణ తదితర అంశాలపై మాట్లాడారు. పార్టీ ప్రతిపక్షంలో ఉండగా టిడిపి కోసం కృషిచేసిన కార్యకర్తలు కొన్ని సందర్భాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి పెమ్మసాని గారు అలాగే ఎమ్మెల్యేలు కలిసి మంత్రి నారా లోకేష్ గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని, ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని లోకేష్ గారు ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు స్పష్టం చేశారు. కూటమి పాలనలోనే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు సాధించామని, తద్వారా యువతకు హెచ్చు సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో నేతల ఆత్మీయ కలయికను పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సమావేశంలో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మహమ్మద్ నజీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, గల్లా మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన
# కలెక్టర్

**గుంటూరు, మే1,ప్రభాతవార్త ప్రతినిధి :** ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ శుక్రవారం గుంటూరు పట్టణంలోని ఆకులతోటలో పంపిణీ చేశారు. ప్రజలతో మమేకమై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఏ విధంగా అందుతున్నాయని ఆరా తీసారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,53,379 మంది పింఛనుదారులకు రూ.110.50 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను ఎంతో ప్రాధాన్యతతో ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో మొత్తం పింఛన్లలో వృద్ధాప్యపు పింఛన్లు 1,13,860., వితంతువులు 71,608., చేనేతకారులు 3,765., గీతకార్మికులు 443., మత్స్యకారులు 564., ఒంటరి మహిళలు 11,265., చర్మకారులు 866., హిజ్రాలు 67., హెచ్.ఐ.వి బాధితులు 2,580, కళాకారులు 74, డప్పు కళాకారులు 847., దివ్యాంగులు 24,493, వైద్య సంబంధిత పింఛనుదారులు 1,587., సైనిక సంక్షేమం 25., అభయహస్తం 3,932.,అమరావతిభూముల సంబంధిత 17,413 పింఛన్లు పంపిణీ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుంటూరు రూపురేఖలు మారాలి

### సుందరమైన,ఆకర్షణీయమైన పట్టణంగా మారాలి

**గుంటూరు, మే1,ప్రభాతవార్త ప్రతినిధి :** గుంటూరు పట్టణ రూపురేఖలు మారాలని, సుందరమైన, ఆకర్షణీయమైన పట్టణంగా మారాలని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పెమ్మసాని చంద్ర శేఖర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడాలని అన్నారు. సురక్షిత తాగునీరు, చక్కని పారిశుధ్యం, ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కులు, మంచి రహదారులు, కాలువలు వంటి సౌకర్యాలు సమకూర్చి సుందరమైన పట్టణంగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఆసక్తిగల పౌరులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా వాణిజ్య సంస్థల నుండి వచ్చే చెత్త నిర్మాణ వట్ల దృష్టి సారించాలని ఆదేశించారు. పారిశుధ్యం నిర్వహణను ప్రాధాన్యతగా చేపట్టాలని అన్నారు. ప్రజా వినియోగం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మరుగుదొడ్లు నిర్మించాలని అన్నారు. బొంగరాలబీడు వద్ద మంచి పార్కు అభివృద్ధి చేయాలని ఆదేశించారు.



శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ పనులు త్వరగా పూర్తి చేయుటకు అవసరం మేరకు కార్మికులను పెంచాలని, 2027 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు వేగవంతంగా పూర్తి చేయుటకు ఉన్న ఆటంకాలను పరిష్కరించాలని ఆదేశించారు. గోరంట్ల నీటి పథకం జూన్ మొదటి వారం నాటికి ప్రారంభం కావాలని ఆదేశించారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు నియంత్రణపై అవగాహన కల్పించాలని సూచించారు. శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ పనులు చేపట్టి కొనసాగిస్తున్న కాంట్రాక్టర్ లను కొనసాగించడం వలన పనులు త్వరగా పూర్తి కాగలవని చెప్పారు. శాసన సభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ కుక్కల బెడద నియంత్రించాల్సిన అవసరం ఉందని, ప్రత్యేక స్థలాలు కేటాయించాలని సూచించారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగు పడాలని అన్నారు. కాలువల్లో పూడికలు తీయడం పక్కాగా చేపట్టాలని అన్నారు. ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఇ.ఎస్.ఎల్.ఆర్), జీ.ఎస్.ఎల్.ఆర్ పనులు చేయడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. శాసన సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు వేగవంతంగా పూర్తి చేయుటకు ఉన్న ఆటంకాలను పరిష్కరించాలన్నారు. మహిళలు ఉచిత బస్సు సౌకర్యం బాగా వినియోగిస్తున్నారని, ప్రజా మరుగుదొడ్లు ఎక్కువ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ మానస సరోవరం అభివృద్ధి పనులను పి.పి.పి మోడ్ లో చేపట్టుటకు ఆలోచన ఉందన్నారు. అమృత్ 2.0 క్రింద చెరువు పునరుద్ధరణకు అవకాశం ఉందని చెప్పారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు శాస్త్రీయ విశ్లేషణ చేసి ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. పట్టణంలో జంక్షన్ ల వద్ద సుందరీకరణ చర్యలు చేపడుతున్నామని, పోస్టర్లు గోడలు మీద అతికించి పట్టణాన్ని అందవిహీనంగా చేయకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు. జంక్షన్ ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, తద్వారా ప్రమాదాలు జరుగుతున్నట్లు గమనించడం జరిగిందన్నారు.గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ పి.వి.కె నాయుడు వెజిటబుల్ మార్కెట్ నిర్మాణానికి ఆసక్తి ఉన్న వారి (Expression of Interest) నుండి దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ నాటికి ఆహ్వానించామన్నారు. నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం నిర్వహణ అప్పగించుటకు ప్రభుత్వానికి సమర్పించాలని తెలిపారు. ఎన్.టి.ఆర్ మానస సరోవరం అభివృద్ధి పనులకు డి.పి.ఆర్ ల తయారీ బాధ్యత ఎపిటి కో కు అప్పగించమని అన్నారు. దీనిని పి.పి.పి మోడ్ లో చేపట్టుటకు ఆలోచన ఉందన్నారు. బి.ఆర్ స్టేడియం తొలగింపు, పునరుద్ధరణ., ఉద్యోగ నగర్ లో 1590 కిలో లీటర్ల నీటి పథకం, ఏ.టి.అగ్రహారంలో 16 వందల కిలో లీటర్ల నీటి పథకం ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయుటకు చర్యలు తీసుకున్నామని వివరించారు. తాగు నీటి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పారిశుధ్య నిర్వహణకు రెండు వందల ఇ ఆటోలను ప్రభుత్వం పంపిణీ చేయనుందని తద్వారా పారిశుధ్యం మెరుగుదలకు మరింత అవకాశం కలుగుతుందని అన్నారు. కాలువల నిర్వహణ రూ.3.67 కోట్లుతో చేపడుతున్నామని తెలిపారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాత్రి పారిశుధ్య నిర్వహణ ప్రయోగాత్మకంగా చేపట్టామని తెలిపారు. జరిగిన పనులకు సంబంధించిన బిల్లులను ఆడిట్ తేదీలను అనుసరించి అప్ లోడ్ చేస్తున్నామని తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, నగరపాలక సంస్థ కమిషనర్ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వర రావు, చీఫ్ మెడికల్ అధికారి డా. శాంతి లత, చీఫ్ టౌన్ ప్లానింగ్ అధికారి రాంబాబు, ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ లు సి.హెచ్.రమేష్, ఎం.శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్లీ బర్డ్ ఆఫర్ ఇంటి పన్నుపై 5 శాతం రాయితీ

గుంటూరు, మే 1 : ఎర్లీ బర్డ్ ఆఫర్ (న్యూ త్రీ ఫ్రీ) క్రింద ఇంటి పన్నుపై 5 శాతం రాయితీని ఇవ్వడం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 27 ఆర్థిక సంవత్సరానికి విధించిన ఇంటి పన్ను మే 31వ తేదీ లోపు చెల్లించిన వారికి రాయితీ వస్తుందని వివరించారు. ఐనవోలు శాఖమూరు, వెలగపూడి




గ్రామ పంచయతీల పరిధిలో గల వి.ఐ.టి విశ్వవిద్యాలయ యాజమాన్యం రూ.1,26,25,845/ లు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందజేసి రూ.5,89,993/ న్యూ త్రీ ఫ్రీ క్రింద 5 శాతం రాయితీ పొందారని, తక్కెళ్ళపాడు సైబర్ డెంటల్ కాలేజి రూ.3,14,489/లు చెక్ ద్వారా చెల్లించి రూ.11,074,00/ లు రాయితీ పొందారని తెలిపారు. తెనాలి ఇంజనీరింగ్ కాలేజి సెక్రటరి జంపాల సుశీల రూ.2,84,872/ లు చెల్లించి రూ.9,689/ లు రాయితీ పొందారని వివరించారు. ఆయా సంస్థలు డిమాండ్ డ్రాఫ్ట్, చెక్కుల ద్వారా చెల్లించిన మొత్తాలను పంచాయతీరాజ్ సంచాలకులు కృష్ణ తేజకు శుక్రవారం అందజేయడం జరిగిందని వివరించారు. జిల్లా ప్రజలందరూ మే 31వ తేదీ లోగా ఎర్లీ బర్డ్ ఆఫర్ అవకాశం సద్వినియోగం చేసుకొని ఇంటి పన్నుపై రాయితీ పొందాలని విజ్ఞప్తి చేశారు.

## అమరావతి నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకం

### మేడే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, మే 1,ప్రభాతవార్త :** అమరావతి నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు కార్మిక దినోత్సవం అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల కోసం వివాహ కానుక రూ.20 వేలు,, ప్రసూతి సహాయం రూ.20 వేలు సహజ మరణం



సందర్భంగా శుక్రవారం గుంటూరు నియోజకవర్గ వ్యాప్తంగా మేడేడే వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత గుంటూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పలు చోట్ల మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో కార్మిక శక్తి చోదకంగా మారుతుందని చెప్పారు. ప్రతి చోటా కార్మికులే యంత్రాలై కదిలి రూ.60 వేలు, అంత్యక్రియల ఖర్చులు రూ. 20 వేల చొప్పున ప్రభుత్వ అందిస్తోందని తెలిపారు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఇంటిగ్రేటెడ్ లేబర్ ఎమినిటీస్ కాంప్లెక్స్ ల నిర్మాణం, ప్రివెంట్ హెల్త్ స్కీమ్ ప్రోగ్రాం వంటి పథకాల ద్వారా కార్మికులకు అండగా నిలుస్తున్నట్లు స్పష్టం చేశారు. మహిళా కార్మికులకు భద్రతతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు

## జన గణన 2027ను
# విజయవంతం చేయాలి

### నగర కమిషనర్ కే. మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, మే 1, ప్రభాతవార్త :** జన గణన 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. జనాభా గణన 2027 కార్యక్రమం కోసం ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం చాలా సురక్షితంగా ఉంటుందని, ఎటువంటి అపోహాలకు గురికావద్దని, జన గణనపై సందేహాలకు జిఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా కాల్ సెంటర్ 0863 2345105 ఏర్పాటు చేశామని గుంటూరు నగర ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ శుక్రవారవెల్లడించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని 3 చార్జీల్లో (3 నియోజకవర్గాలు) 18,088 కుటుంబాలు స్వీయ గణనలో వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జనాభా గణన పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతోందని, నగరంలో 1310 హౌస్ లిస్టింగ్




బ్లాక్ లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దీనికోసం 1272 మంది ఎన్యూమరేటర్లను, 201 సూపర్వైజర్లను, ముగ్గురు ఛార్జ్ అధికారులను నియమించామన్నారు. ఎన్యుమరేటర్లు మే 1వ తేదీన తమకు కేటాయించిన ఇళ్లకు సంబంధించి హద్దులు సరిచూసుకుని, మే 30వ తేదీ వరకు ప్రతి ఇంటినీ సందర్శించి మ్యాప్ ఆధారంగా సరిహద్దులను గుర్తించి మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.

## డివిజన్ ప్రజలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయటం అదృష్టం

### నగర మాజీ డిప్యూటీ మేయర్ షేక్.సజీలా

గుంటూరు కార్పొరేషన్, మే 1 ( ప్రభాత వార్త ) : గుంటూరు నగరంలోని తన 7వ డివిజన్‌లో ప్రజలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ అందించడం అదృష్టం గా భావిస్తునానని నగర మాజీ డిప్యూటీ మేయర్ షేక్.సజీలా అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు ప్రత్యక్షంగా నాయకుల చేతుల మీదుగా అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో షేక్ హసన్ భాష (రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్),షేక్ షౌకత్ (మాజీ



స్టాండింగ్ కమిటీ చైర్మన్)హాజరై లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు.అలాగే డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు ఆసిఫ్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, మే 1,ప్రభాతవార్త :** గుంటూరు నగర పాలక సంస్థ ప్రగతిపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, నగర మౌలిక వసతులపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద తీవ్ర సమస్యగా మారిందని, దానిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుక్కల శస్త్రచికిత్స కేంద్రాలను రూపకల్పన సిద్ధం చేస్తున్నామని చెప్పారు. దీనిని ప్రజాభిప్రాయానికి పంపించి, ప్రజల ఆసక్తి మరియు ప్రాజెక్టు సాధ్యతపై అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. మే 15 నాటికి ప్రజాభిప్రాయం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకొని త్వరలోనే మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి ఎత్తైన సేవా జలాశయాలు, భూగర్భ జలాశయాల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నా యని తెలిపారు. ఏటి అగ్రహారం, గుజ్జనగుండ్ల ప్రాంతాల్లో పనులు శరవేగంగా సాగుతున్నాయని, 2027 నాటికి పనులు పూర్తిచేసి



ఏర్పాటు చేసి వేగంగా శస్త్రచికిత్సలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా కుక్కలకు ప్రత్యేక ఆహార కేంద్రాలు ఏర్పాటు చేసి, అక్కడే ఆహారం మరియు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. కుక్కల సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. పట్టణ పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలని, కాలువలలో పేరుకుపోయిన మట్టిని పూర్తిస్థాయిలో తొలగించాలని అధికారులను కోరారు. వర్షాకాలానికి ముందే అన్ని కాలువలను శుభ్రపరచి ఎక్కడా నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు.పీవీకే నాయుడు మార్కెట్ పునర్నిర్మాణంపై సమావేశంలో విస్తృత చర్చ జరిగిందని, గతంలో రూపొందించిన నమూనాను పునరుద్ధరించి కొత్త నగరంలో ఎక్కడా నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.వాణిజ్య వ్యర్థాల నిర్వహణ, శుభ్రత వ్యవస్థలపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిపారు. చెత్త రహిత నగర లక్ష్యంతో ముందుకు వెళ్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని, దీనిపై కఠిన పర్యవేక్షణ అవసరమని చెప్పారు.ప్రజా మరుగుదొడ్ల అంశంపై మాట్లాడుతూ నగరానికి దాదాపు 20 మరుగుదొడ్లు అవసరమని, అందులో 10ను పునరుద్ధరించాల్సి ఉందన్నారు. గతంలో మాదిరిగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా కాకుండా, వంతెనల కింద లేదా ప్రజలకు ఇబ్బంది కలగని ప్రాంతాలను గుర్తించి కొత్త మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ
# పేదల జీవితాలకు ఆర్థిక భద్రత : ప్రత్తిపాటి

**యడ్లపాడు, మే 1, ప్రభాతవార్త :** రాష్ట్రం ఎంత ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ పేదల జీవితాలకు ఆర్థిక భద్రత కల్పించాలన్న ఏకైక లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా రూ.3,500 కోట్లకు పైగా సాయాన్ని



సామాజిక పింఛన్ల రూపంలో అందిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. జగన్ ఆర్థిక విధ్వంసం వల్లే ఇప్పటికీ అర్హులైన వారికి ప్రభుత్వం పింఛన్లు అందించలేకపోయిందని, జూన్ నెల నుంచి కొత్త పింఛన్ల మంజూరుకు సిద్ధమైందని ఆయన తెలియచేశారు. జనగణనలో ప్రజలు విధిగా భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ, వ్యక్తిగత వివరాలు అందిస్తేనే వారికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా , సకాలంలో అందుతాయని ప్రత్తిపాటి తెలిపారు. మండల కేంద్రం యడ్లపాడు గ్రామంలో శుక్రవారం సామాజిక పించన్‌ల పంపిణీ కార్యక్రమంలో అయన పాల్గొన్ని వృద్దులకు పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మద్దినేని సుబ్బారావు , కందిమల్ల రఘురామావు, జాలాది సుబ్బారావు, చౌదరి, సుదర్శన్, పెంట్యాల శేషయ్య, కెల్లంపల్లి అచ్చయ్య, పోపూరి రాఘవయ్య, పోపూరి వెంకయ్య, కాకుమాను చంటి, నాగేశ్వరరావు , సీతారామయ్య, పోతురాజు, ఎంపీడీవో వి హేమలతదేవి, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యడ్లపాడు ఎస్సై శివరామకృష్ణకు అరుదైన ఆహ్వానం

## డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్ కార్యక్రమంలో పాల్గొన్న వైనం

**యడ్లపాడు, మే 1, ప్రభాతవార్త :** ప్రజా సేవలో అంకితభావంతో పనిచేస్తూ,



శాంతిభద్రతల పరిరక్షణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారిని డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్ పేరుతో గౌరవించడం ద్వారా క్షేత్రస్థాయి అధికారుల్లో నూతనోత్తేజాన్ని నింపడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తనకు వచ్చిన అవార్డు స్ఫూర్తితో వ్యవస్థలో మార్పు తెస్తున్న అసలైన విజేతలతో సమయాన్ని గడపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాలలో ప్రతిభ కనపర్చిన వారికి అహ్వానాలు అందుకొని కార్యక్రమానికి వెళ్లటం జరిగింది. ఇందులో భాగంగానే యడ్లపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఎహెచ్‌వో టి శివరామకృష్ణ అహ్వానం అందుకొని కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన సమావేశంలోనూ తనకు మాట్లాడే అవకాశం కల్పించటం జరిగిందని, ఇది తనకు మర్చి పోలేని తీపి జ్ఞాపకంగా మిగిలిపోతుందని తెలిపారు.

**వెల్లు వెత్తుతున్న అభినందనలు :** రాష్ట్రా స్థాయి గుర్తింపు పొందిన ఎస్.ఐ శివరామకృష్ణ కి పలువురు ఉన్నతాధికారులు మరియు ప్రముఖుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

**విధుల పట్ల నిబద్ధత..** కఠినమైన సమయాల్లోనూ సమయస్ఫూర్తితో వ్యవహరించి, నేరాల నియంత్రణలో ఆయన కీలక పాత్ర పోషించారు.

**ప్రజా ఆదరణ..** సామాన్య ప్రజలకు న్యాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటారనే పేరును సంపాదించుకున్నారు. శివరామకృష్ణ ని ఆయన శ్రేయోభిలాషులు మరియు తోటి సిబ్బంది హృదయపూర్వక అభినందనలతో ముంచెత్తారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# నేటి నుండి బాసట ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం

**యడ్లపాడు, మే 1, ప్రభాతవార్త :** బాసట సామాజిక సాంస్కృతిక వేదిక అధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరము శనివారం నుండి ప్రారంభించటం జరుగుతుందని కమిటి నిర్వాహక సభ్యుడు నూతలపాటి కాళిదాసు తెలిపారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ ఈ సంవత్సరం యడ్లపాడు గ్రామంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు మరియు లింగారావుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. అనుభవము కల్గిన ఉపాధ్యాయులచే విద్యాబోధన, మట్టితో బోమ్మలు చేయడం, కథలు చెప్పడం, వ్రాయడం, పూపర్లతో అర్టికల్స్ తయారు చేయించడం, వకృత్వం, సరదా అటలు, పాటలు వంటి అంశాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. దీనితోపాటు విద్యార్దుల లక్ష్యసాధన కొరకు ప్రముఖులచే ఉపన్యాసములు ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు ఉదయం 7.30నిమిషాల నుండి ఉదయం 11.30నిమిషాల వరకు నిర్వహించటం జరుగుతుందని, లింగరావుపాలెంనగ్రామంలోని కమిటీ సభ్యులు సామినేని శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించనున్నారని తెలిపారు. కావున చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు.

# ఘనంగా గౌతమ బుద్ధుని జయంతి

**నరసరావుపేట, మే 1 ప్రభాతవార్త :** శాంతి, అహింస, ధర్మ సిద్ధాంతంతో భారత దేశాన్ని ప్రపంచముతో అనుసంధానించి ఒక గుర్తింపు తెచ్చిన మహనీయుడు గౌతమ బుద్ధుడు అని పలువురు ప్రముఖులు గుర్తు చేశారు.శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత



వహించారు . వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని జయంతిని ఘనంగా నిర్వహించారు. చతురార్య సత్యాలు, పంచశీల గురించి, అష్టాంగ మార్గం గురించి, బౌద్ధ సంగీతులు ఆంధ్రదేశంలో బౌద్ధ మత ప్రభావం గురించి సభలో తెలియజేశారు.బౌద్ధ స్తూపాలు విహారాలు, ఆరామాలు బౌద్ధాన్ని ఆదరించిన రాజులు వివరాలు పేర్కొన్నారు. డా బి.ఆర్ అంబేద్కర్ పై బౌద్ధ మత ప్రభావం ఉందన్నారు. ఆధునిక బోధిసత్వగా ఏ విధంగా అంబేద్కర్ పేరు గడించిరని తెలిపారు.పలు విషయాలను స్వర్ణ చినరామిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి కార్యదర్శి ఏ. మధు కుమార్, ఏపీజిఇఏ సంయుక్త కార్యదర్శి షేక్. బాజీ, మంజీరా మెలోడీస్ కొఠారి రంజిత్ కుమార్, పండిట్ ఈఊరి వెంకటరెడ్డి, శ్రీ వాసవి మిత్ర మండలి అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు మామిళ్ళ కృష్ణయ్య, పి. వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలు సనాతన సంప్రదాయాలకు నిలయాలు: ఎమ్మెల్యే జూలకంటి

**కారంపూడి, మే 1 ప్రభాతవార్త:** ఆలయాలు సనాతన సంప్రదాయాలకు నిలయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. శుక్రవారం మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నూతన నిర్మాణాలకు ఎమ్మెల్యే జూలకంటి శంకుస్థాపన చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో ఘనంగా మే డే వేడుకలు

**నరసరావుపేట, మే 1, ప్రభాతవార్త :** సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ సుందరయ్య జయంతి, మేడే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి.శివకుమారి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు






ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ, పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, రైతులు, విద్యార్థియువజన సమస్త ప్రజానీకం బాధల నుంచి విముక్తి పొందేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అన్నారు. ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావంతో స్వార్థం లేకుండా జీవించడానికి ఆయన తన వ్యక్తిగత జీవితాన్నే త్యాగం చేశారని తెలిపారు. సుందరయ్య చూపిన మార్గంలో నడుస్తూ కార్మిక వర్గ రాజ్యం సాధన కోసం కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో సిఐటియు నాయకులు మేడే కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్, కుమారి హరిబాబు, జె. శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.పిడిఎం ఆధ్వర్యంలో ఘనంగా మేడే స్థానిక అష్ఫాఖుల్లా ఖాన్ కాలనీలో శుక్రవారం దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎం), ప్రజా సంఘాలు, కాలనీవాసుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ శ్రామిక దీక్ష దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిడిఎం రాష్ట్ర కార్యదర్శి జి. రామకృష్ణ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి షేక్. మస్తాన్ వలి మేడే జెండాను ఆవిష్కరించారు. పిడిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో గత 140 సంవత్సరాల కిందట వేలాదిమంది కార్మికులు తమకు ఎనిమిది గంటల పని విధానం సమాన పనికి సమాన వేతనం లాంటి అనేక హక్కుల కోసం పెట్టుబడిదారులకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించడంతో ఈ ఉద్యమాన్ని పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వం అణిచివేయాలని కార్మికులపై కాల్పులకు తెగబడ్డారని తెలిపారు. ఈ కాల్పులలో అమరులైన వీరుల స్ఫూర్తితో ప్రతి సంవత్సరం మేడే కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా కార్మికులు జరుపుకుంటున్నారని అన్నారు. మేడే అమరుల స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, షేక్. దర్యావలి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోట నాయక్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు. ప్రగతిశీల కార్మిక సమైక్య ఆధ్వర్యంలో :: దోపిడీ వర్గ రాజకీయాల ప్రభావం కార్మిక వర్గంపై బలంగా ఉండటంవల్ల కార్మికులను విభజించే అవకాశం రాజకీయ పార్టీలకు సులువైందని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి కొండారెడ్డి ఆరోపించారు.140వ మేడే దినోత్సవం సందర్భంగా ప్రకాష్ నగర్ లోని హెచ్ పి గ్యాస్ గూడెం వద్ద మేడే జెండా ఎగురవేసారు.అమరుల రక్తంతో ఎరుపెక్కిన జెండానే ఈ ఎర్రజెండా అన్నారు.ఈ రోజు ప్రభుత్వాలు కార్పోరేట్ కంపెనీల సేవలో తరిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందన్నారు. కార్పోరేట్ కంపెనీలు వాళ్ళ అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రాజీలేని, లొంగుబాటు లేని నాయకత్వం సారధ్యంలో కార్మిక వర్గ పోరాటాలను బలోపేతం చేయడమే చికాగో అమరులకు మనం అందించే ఘనమైన నివాళి అన్నారు. మేడే జెండా ఆవిష్కరణలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు శిఖినం సాంబయ్య, ఎస్ కె షరీఫ్, హెచ్ పి గ్యాస్ యూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, నాయకులు పి సూర్య నారాయణ, వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, కె వెంకటరెడ్డి, శివన్నారాయణ, బంగారు బాబు, అంజిరెడ్డి,రాము, కె అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేఖర్ రెడ్డి, కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరవింద బాబు

**నరసరావుపేట, మే 1 ప్రభాతవార్త :** తెలుగు భాషా సాహిత్యాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన శ్రీశ్రీ కళావేదిక సంకల్పించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత ఇలాంటి మహాసభలు భాషా వికాసానికి, సాంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేస్తాయని అన్నారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతులను పరిరక్షించి భావితరాలకు అందించాలనే ఉన్నత ఆశయంతో ఈ మహాసభలను నిర్వహిస్తున్నారని తెలిపారు. 2026 జూన్ 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా రెండు రోజుల సాహితీ క్రతువు జరగనుంది.



ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు రచయితలు, కవులు, కళాకారులు, భాషాభిమానులు ఒకే వేదికపై కలిసే అవకాశం ఈ సభల ద్వారా లభిస్తుందని అన్నారు. ప్రపంచ నలుమూలల నుండి సాహితీవేత్తలు, కళాకారులు, భాషాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. మహాసభల వివరాలకు పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.వెంకటేశ్వరంను 98664 81047 నంబర్ ను సంప్రదించవచ్చని కార్యక్రమంలో సభ్యులు తెలియజేశారు .

# 10ఫలితాల్లో నారాయణ విద్యార్థుల విజయభేరి


**మాచర్ల, మే 1 ప్రభాతవార్త:** పదో తరగి పరీక్షల్లో స్థానిక నారాయణ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ




కనబరిచారు. ఈ సందర్భంగా ఎంఈఓలు కోటేశ్వరరావు, సురేష్‌లు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో పదో తరగతికి చాలా ప్రాముఖ్యత ఉంటుందన్నారు. విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యను అభ్యసించడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం నారాయణ స్కూల్స్ పల్నాడు జిల్లా ఏజీఎం జానకిరామిరెడ్డి ఆర్అండ్ హెడ్ సింహాద్రి, జెడ్‌సీఓ భద్రారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి పాఠశాల ప్రగతి గురించి వివరించారు. పాఠశాలలో సాహితీ 593, మానీషా 591, గురుప్రణయ్‌రెడ్డి 590, యూగేంద్రసాయి 589, దుర్గా కౌశిక్ 589, సాకేత్‌రెడ్డి 588, ప్రణీత్ 587, సమీర్ 583 వచ్చాయన్నారు. ప్రతి ఇద్దరిలో ఒకరికి 550పైగా మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌ఛార్జిలు ఆంజనేయులు, విజయలత, ఉదయలక్ష్మి, రాజేశ్వరి, రవినాయక్, తదితర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛను : ఎమ్మెల్యే జూలకంటి

**కారంపూడి, మే 1, ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా ప్రతినెలా 1న అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేయడం కూటమి ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం



మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామంలో జరిగిన పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులందరికీ పింఛను అందజేసి, స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను ఆరా తీశారు.

**మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే**

ఒప్పిచర్ల గ్రామంలో పింఛను పంపిణీ కార్యక్రమంలో భాగంగా పర్యటించిన ఎమ్మెల్యే జూలకంటిని గ్రామానికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు తన కుమార్తె వెంకట శివ కోమలితో వచ్చి పింఛను మంజూరు విషయంలో ఎదురవుతున్న సమస్యను వివరించారు. పుట్టుకతో ఆరోగ్యంగా ఉండి, జన్యుపర లోపంతో అంగవైకల్యం వచ్చిందని పాప తండ్రి చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చిన్నారికి పంఛనుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులు జారీ చేసి, తక్షణమే పింఛను మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. దీంతో పాప తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం




కారంపూడి, మే 1 ప్రభాతవార్త: మండల పరిధిలోని నరమాలపాడు, మిరియాల 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల సందర్భంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్తు ఏఈ రమణయ్య తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# గరుడవాహనము పై శ్రీ రంగనాయక స్వామి వారు

**యడ్లపాడు, మే 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సొలస గ్రామంలోని శ్రీ భూసమేత శ్రీరంగనాయక స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవములలో భాగంగా శుక్రవారం స్వామివారు గరుడ వాహనముపై గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించటం జరిగిందని, రాత్రి ధ్వజావరోహణ అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేయటం జరిగిందని అలయ అర్చకులు పరుచూరి రామకృష్ణమాచార్యులు తెలిపారు.



# పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, మే 1 ప్రభాతవార్త :** నరసరావుపేటలోని పలు వార్డులలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం తెల్లవారుజామునే వారి ఇండ్లకు వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని అన్నారు. వృద్ధులు, వికలాంగులు



పెన్షన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రస్తుతం రాష్ట్రంలో 65 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ప్రతి నెలా పెన్షన్ అందుకుంటున్నారు. 2024 జూన్‌లో జీవో నెం.43 ద్వారా పెన్షన్లను భారీగా పెంచామని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 45,000 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.20 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రతి నెల 1వ తేదీన గ్రామ/వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల సమక్షంలో పెన్షన్లు పంపిణీ చేస్తుండగా మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దే అందజేస్తున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరుణ్ బాబుతెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తిన,అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా గ్రామ నాభిశిలా ప్రతిష్ట మహోత్సవం

**రొంపిచర్ల, మే 1 ప్రభాతవార్త :** మండలంలో అన్నవరం గ్రామంలో శుక్రవారం గ్రామ నాభిశిలా (బొడ్రాయి) ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది.గ్రామంలో నాభి శిలా ప్రతిష్ఠతో పాటు అద్దంకమ్మ,శ్రీ అభయాంజనేయ స్వామి 26అడుగుల ఏకశిలా విగ్రహం ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది.వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ,ఈ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ కోడెల శివరాం ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికీ టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ



సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు సతీసమేతంగా అద్దంకమ్మ ఆలయాన్ని సందర్శించి,ఆలయ అభివృద్ధికి 50,116 రూపాయలు విరాళం ఇచ్చినారు.అదే విధంగా డాక్టర్ కోడెల శివరాం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.గ్రామానికి ఆడపడుచులు, బంధువులు, మిత్రులు రాకతో సందడి నెలకొంది.తమ పుట్టిళ్ళకు వచ్చిన ఆడపడుచులకు పుట్టింటి వారు నూతన వ్ర లను బహుకరించారు.అనంతరం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.రాత్రి వేళ్ళల్లో గ్రామంలో రెండు విద్యుత్ ఎలక్ట్రిక్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# శ్రీచక్ర సిమెంటు ఫ్యాక్టరీలో కార్మిక దినోత్సవం

కారంపూడి, మే 1 ప్రభాతవార్త: శ్రీచక్ర సిమెంటు ఫ్యాక్టరీలో శుక్రవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ఇన్‌ఛార్జి వి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కార్మికుతల చేతుల మీదుగా మేడే



జెండాను ఆవిష్కరించి, దాని ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

# సత్యసాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**కారంపూడి, మే 1 ప్రభాతవార్త:** సత్యసాయి బాబా ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకుని గత తొమ్మిది రోజులుగా మండుటెండలలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులపాటు దాతల సహకారంతో




నిర్విరామంగా మజ్జిగ పంపిణీ చేశారు. శుక్రవారం మజ్జిగ చలివేంద్రానికి సింద్రి వెంకటరమణ జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, ఒప్పిచర్ల వాస్తవ్యులు వెలనాటి వెంకటేశ్వర్లు మనవరాలు విశేషణ శ్రీసాయి అమృత పుట్టినరోజు సందర్భంగా సహకరించారు. వేసవికాలం మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండుటెండలలో మజ్జిగ చలివేంద్రం ద్వారా బాటసారుల దాహాన్ని తీరుస్తున్న సత్యసాయి సేవా కమిటీ సేవాతత్పరతను పలువురు అభినందిస్తున్నారు.

MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 09:55 Page 1



# బాపట్ల జిల్లా వార్త



## ఆరేపల్లి నూకాలమ్మ తల్లిని దర్శించుకున్న ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్



**చెరుకుపల్లి, మే1, ప్రభాతవార్త :** బాపట్ల పార్లమెంటు సభ్యులు కృష్ణ ప్రసాద్ శుక్రవారం మండలంలోని ఆరేపల్లి గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తెన్నేటి కృష్ణ ప్రసాద్ కు, అనగాని శివప్రసాద్ కు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మత్తి భాస్కరరావు, పూషడపు దుర్గాప్రసాద్, డెల్టా చైర్మన్ పంతాని మురళీధర్ రావు, బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు గుర్రం మురహరి, పలువురు కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్



**చెరుకుపల్లి ,మే 1 ,ప్రభాతవార్త:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ప్రభుత్వం అందిస్తుందని మండల పార్టీ అధ్యక్షుడు తాత ఏడుకొండలు అన్నారు. శుక్రవారం మండలంలోని గాంధీ నగర్‌లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పెన్షన్ దారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ సభాని,టిడిపి నాయకులు పూషడపు కుమారస్వామి, సనకా శ్రీనివాసరావు, మతి శ్రీను, ఆలుమోలు దుర్గారెడ్డి, మత్తి పవన్, సీతారామయ్య, సచివాలయం సిబ్బంది, స్థానికుల పలువురు పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యంలో భావపురి..

**బాపట్ల,మే1. ప్రభాతవార్త ప్రతినిధి:** భావపురి క్షేత్రం భక్తిసాగరమైంది. బాపట్ల పట్టణంలోని అతి ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీమతసుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీర భావనారాయణ స్వామి వారి 1433వ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన ఖిదివ్య రథోత్సవంఖి శుక్రవారం భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన



భక్తజనం గోవింద నామస్మరణతో భావపురి పురవీధులు మారుమోగాయి.

**వైభవంగా రథం లాగిన ప్రముఖులు:**ఈ పవిత్ర మహోత్సవంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, స్థానిక


**కనుల పండువగా క్షీర భావనారాయణ స్వామి రథోత్సవం**
**జయజయధ్వానాల మధ్య సాగిన రథాగమనం**
**పాల్గొన్న కలెక్టర్ వి. వినోద్ కుమార్, ఎస్పీ బి. ఉమామహేశ్వర్**

శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ . మాజీ శాసనసభ్యులు కోణార్ రఘుపతి లు పాల్గొన్నారు. తొలుత స్వామివారిని దర్శించుకున్న వీరు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి స్వామివారి దివ్య రథాన్ని లాగి రథోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**భారీ బందోబస్తు..** మెరుగైన సౌకర్యాలు:రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా, పొరుగు ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఉంచారు. మున్సిపల్ అధికారులు భక్తులకు తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చక బృందం, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు.

## నిషేధిత భూముల జాబితా నుంచి పట్టా భూములను తొలగిస్తాం : కలెక్టర్

**బాపట్ల. మే 1. ప్రభాతవార్త ప్రతినిధి:** నిషేధిత భూముల జాబితా నుంచి పట్టా భూములను తొలగిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి పట్టాభూముల తొలగింపు ప్రక్రియపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశంను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఅర్హత ఉన్న పట్టా భూములకు యాజమాన్య హక్కు పత్రాలు ఇస్తామన్నారు. చెరుకుపల్లి, చీరాల, మార్టూరు, నగరం, నిజాంపట్నం, పర్చూరు, పిట్లవానిపాలెం, చుండూరు, వేటపాలెం మండలాల నుంచి నమోదైన 47 అర్జీలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఆయా దరఖాస్తులను నిశితంగా ఆయన పరిశీలించారు. విచారించిన తదుపరి ఆ భూములకు సంబంధించిన దస్త్రాలు, వెబ్ ల్యాండింగ్ లో వివరాలను పరిశీలించారు. తదుపరి అర్హులకు హక్కు పత్రాలు ఇవ్వాలని వీటికి సంబంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో అధికారికంగా ఆయన ఆమోద ముద్ర వేశారు. కొంత మంది దరఖాస్తుదారులకు నోటీసులు ఇచ్చి వారి నుంచి వివరణ పొందాలని ఆయన తహసిల్దార్లను ఆదేశించారు. కొన్ని దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి



నివేదిక అందజేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండుటవలన ఆసుపత్రులందు, పాఠశాలలు, ఆర్టీసీ బస్టాండ్, నగర కూడళ్ళు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, వస్త్ర దుకాణా షాపులు మరియు వీలైనన్ని ఎక్కువ చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి కి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట , డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీఓలు గ్లోరియా, చంద్రశేఖర్, శ్రీదేవి, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉంటే ఎస్ఓఎస్ నొక్కండి.. నిమిషాల్లో పోలీసులు వస్తారు

### బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన

**బాపట్ల, మే1, ప్రభాతవార్త ప్రతినిధి :**మహిళల భద్రతే ధ్యేయం.. మీ రక్షణే మా బాధ్యత అంటూ బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ విద్యార్థినుల్లో ధైర్యం నింపారు. శుక్రవారం బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖశక్తి యాప్ఖ వినియోగం, మహిళా భద్రతపై భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ




కళాశాలల నుంచి సుమారు 2,000 మంది విద్యార్థినులు హాజరై, శక్తి యాప్‌పై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రివెన్షన్, ప్రొటెక్షన్, ప్రాసిక్యూషన్ అనే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 5 శక్తి బృందాలు నిరంతరం నిఘా ఉంచుతాయని, ఆకతాయిల ఆటకట్టిస్తామని హెచ్చరించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలను బాపట్ల జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ



సహించబోమన్నారు.

ప్రతి విద్యార్థిని తమ మొబైల్‌లో తప్పనిసరిగా ఖశక్తి యాప్ఖ నిక్షిప్తం చేసుకోవాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే యాప్‌లోని ఎస్ ఓ ఎస్ బటన్ నొక్కండి. నిమిషాల వ్యవధిలోనే శక్తి బృందాలు లేదా సమీప పోలీసులు మీ వద్దకు చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. అనంతరం విద్యార్థినులతో సరదాగా ముచ్చటించిన ఎస్పీ, కళాశాలల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు కింది టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలన్నారు. అన్ని అత్యవసర పరిస్థితులకు: 112గృహహింస, వేధింపులు: 181సైబర్ నేరాలు: 1930మైనర్లపై వేధింపులు 1098గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం: 1972 ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సిహెచ్. చంద్రమోళి, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ హిమబిందు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# రేపల్లెలో మేడే వేడుకలు

**రేపల్లె, మే 1, ప్రభాతవార్త:** రేపల్లె పట్టణంలో శుక్రవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్మికులకు అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలను వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ తెలియజేశారు. అరుణ పతాక ఆవిష్కరణ వేడుకలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకలలో సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్. మణిలాల్, ఝాన్సీ, కె.వి.లక్ష్మణరావు, రమేష్‌బాబు, ధర్మరాజు, వై.కిషోర్, సాయిప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన మేడే వేడుకలలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, కన్నెగంటి రమేష్‌బాబు, సింగం వాణిశ్రీ, పి.నాగాంజనేయులు, కె.శ్రీను, భిక్షాలు, ఆవుల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఏఐఎఫ్‌టియు న్యూ ఆధ్వర్యంలో మండలంలోని పేటేరులో జరిగిన మేడే వేడుకలలో యూనియన్ నాయకులు మద్రివాడ వెంకటరావు, టి.శ్రీను, కె.మోహన్‌రావు, కె.రాఘవ తదితరులు పాల్గొన్నారు. భట్టి ప్రోలు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన మేడే వేడుకలలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, సిఐటియు మండల కార్యదర్శి బి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన



140వ మేడే దినోత్సవంలో ఏఐటియుసి అధ్యక్షుడు బందారు శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకుడు వి.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ, కె.వీరమోహనరావు, సత్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, షేక్ బాబ్జీ, కె.బాలకృష్ణ, స్వామి నాయక్, అంబటి పీటర్‌పాల్, కోటేశ్వరరావు, పాండు, టి.చెంగాలి తదితరులు

## బుద్ధ పౌర్ణమి వేడుక



**రేపల్లె, మే 1, ప్రభాతవార్త:** బుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ ఉద్యానవనంలో బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బుద్ధిష్ట్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డి.సాంబశివరావు మాట్లాడుతూ శాంతి, సమాధానం, ప్రేమ, ఆప్యాయతలకు అనుగుణంగా గౌతమ బుద్ధుని జీవితం కొనసాగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంచర్ల రవి, సిహెచ్. రాఘవల్లేశ్వరరావు, మాజీ వైస్ ఛైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, రిటైర్డ్ జడ్జి ప్రసాదరావు, దోవ రమేష్ రాంజీ, ఎస్సీ ఎస్టీబీసి మైనారిటీ సమైక్య ప్రధాన కార్యదర్శి రాచాబత్తుని శ్రీనివాసరావు, ఆలూరి నారాయణ, కంచర్ల వెంకట్రావు, పెద్దపల్లి హానోక్, ఒడుగు రాంబాబు, పి.నాగార్జున, మల్లేశ్వరి, కె.భాస్కర్, రబ్బానీ, ఆది ఆంధ్ర నవ బుద్ధిస్ట్ సొసైటీ నాయకులు, బహుజన సంక్షేమ సంఘం ప్రతినిధులు, దళిత నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అభయాంజనేయుని విగ్రహా ప్రతిష్టకు భూమిపూజ

**కర్లపాలెం, మే1, ప్రభాతవార్త:** మండలంలోని ఎంపీ రాజుపాలెం దండుబాట రోడ్డులో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి



విగ్రహ ప్రతిష్టా కార్యక్రమానికి శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. గ్రామస్తుల సామూహిక సహకారంతో తలపెట్టిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వేదమంత్రాల సాక్షిగా వైభవంగా సాగింది. శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలుబ్రహ్మశ్రీ వెల్లంకి భవాని శంకర్ శా ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయాన్నే గణపతి పూజతో ప్రారంభించి, పుణ్యాహవాచనం, భూమిపూజ నిర్వహించి విగ్రహ స్థాపనకు అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలోపిట్టు చంద్రశేఖర రెడ్డి. పిట్టురామకృష్ణారెడ్డిశ్రవణం కోటిరెడ్డి. పిట్టు శ్రీనివాసరెడ్డిపిట్టు తిరుమలరెడ్డి దంపతులుతదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులందరి సహకారంతో త్వరలోనే ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.

## గౌతమ బుద్ధుని సందేశాలు ప్రపంచ శాంతికి మార్గదర్శకం : డాక్టర్ పావని ప్రియాంక

**రేపల్లె, మే 1, ప్రభాతవార్త:** ప్రపంచ మానవాళికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం అష్టాంగ మార్గం ,పంచశీలను బోధించిన గౌతమ బుద్ధుని సందేశాలు ప్రపంచ శాంతికి మార్గదర్శకమని రేపల్లె ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఉప్పలపు పావని ప్రియాంక అన్నారు. భట్టిప్రోలు మండలంలోని కోళ్ళపాలెంలో



శుక్రవారం గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి 4 ఆర్య సత్యాలను వెల్లడించారన్నారు. ప్రపంచం దు:ఖమయమని, దు:ఖానికి కారణం కోరిక అని, కోరికలను జయించడం ద్వారా దు:ఖాన్ని పోగొట్టుకోవచ్చని, దు:ఖ నివారణకు అష్టాంగ మార్గాన్ని అనసరించాలని గౌతమ బుద్ధుడు పేర్కొన్నారని చెప్పారు. అష్టాంగ మార్గాలను పరిగణలోకి తీసుకుంటే సత్యం, అసత్యాల మధ్య తేడాను గురి_ంచాలన్నారు. మంచి ఆలోచనలను కలిగి ఉండాలని పావని ప్రియాంక తెలిపారు. నిజం మాట్లాడటం, అబద్ధాలు, కఠినమైన మాటలను నివారించాలన్నారు. అహింస, దానం, సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. మోసం లేకుండా దర్మబద్ధంగా జీవించాలని చెప్పారు. మనస్సును అదుపులో ఉంచుకుని మంచి పనుల కోసం కృషి చేయాలన్నారు. అహింస అంటే ప్రాణి హింస చేయకూడదని తెలిపారు. లోకంలో ఏదీ శాశ్వతం కాదని తెలుసుకోవాలన్నారు. మనం చేసే పనుల ఫలితాలను అనుభవించాల్సిందేనని ఆమె చెప్పారు. బుద్ధుని బోధనలు ఆచరణీమన్నారు. ప్రవల్లిక సపోర్టజ్ ఆధ్వర్యంలో ఆరుష్ వైద్యశాల, ఫోకస్ ఐ హాస్పిటల్ సహకారంతో అంబేద్కర్ యువజన సంఘం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రజలకు ఆరుష్ వైద్యశాల డాక్టర్లు అశోక్‌కుమార్, లలిత వైష్ణవి, ఫోకస్ వైద్యశాల కంటి డాక్టర్ పి.అరుణారాణి సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు దుస్సాలువాలతో డాక ్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రవల్లిక సపోర్టజ్ ప్రతినిధులు, ఆది ఆంధ్ర నవ బుద్ధిస్ట్ సొసైటీ నాయకులు, బహుజన సంక్షేమ సంఘం ప్రతినిధులు, దళిత నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతోనే కార్మికులు తమ హక్కులు సాధించగలుగుతారు : ఏంఆర్కే మూర్తి

**చెరువుపల్లి, మే1, ప్రభాతవార్త :** కార్మికులు సంఘటితం ద్వారానే తమ హక్కులను సాధించుకో గలుగుతారని టిడిపి సీనియర్ నాయకులు ఎం ఆర్ కె మూర్తి అన్నారు. మే డే సందర్భంగా మండల కేంద్రమైన చెరుకుపల్లి సంపద సృష్టి కేంద్రం వద్ద పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో



ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అవగాహన లేకపోవడం ద్వారా కార్మికులు ప్రభుత్వపరంగా ఎంతో ప్రయోజనకరమైన పథకాల ప్రయోజనాలును పొందలేకపోతున్నారన్నారు. కార్మికుల కోసం కనీస వేతన చట్టం, కుటుంబ సంక్షేమం, పిల్లల విద్య ప్రయోజనాలు, కుటుంబ సంక్షేమ ప్రయోజనాలతో కూడిన పలు పథకాలను ప్రభుత్వాలు ఎప్పటినుంచో ప్రవేశపెట్టేయన్నారు. వాటిని కేవలం అవగాహనతో మరియు కార్మికుల ఐకమత్యంతో మాత్రమే సాధించుకోగలుగు తారని సూచించారు. ఈ సందర్భంగా మే డే పతాకాన్ని ఎగరవేసి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ ఆర్గనైజరీ సెక్రెటరీ మల్లాది రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు సొంటి సుబ్బయ్య, జనసేన పార్టీ నాయకులు మొఖమాటం పృధ్వి, కొత్రా నాంచారయ్య, జజ్జర శ్రీనివాసరావు, పంచాయతీ కార్మికులు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## చిన్నతనం నుండి ఆధ్యాత్మికత ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చు

చెరుకుపల్లి ,మే 1 ,ప్రభాతవార్త: బాల్యం నుండే ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం ద్వారా జీవితంలో సత్ప్రవర్తన మరియు సృజనాత్మకతను కలిగి ఉంటారని ఆధ్యాత్మికవేత్త చిలుకోటి లక్ష్మీ ్మనారాయణ అన్నారు. భగవద్గీత బాలల శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెరుకుపల్లి కాపుల



బజారు రాముల వారి ఆలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సనాతన ధర్మం మనిషి మనుగడను, మనిషి నడవడికను స్పష్టం చేస్తుందని తద్వారా ప్రకృతి పరిరక్షణకు సనాతన ధర్మం ఎంతగానో దోహదపడుతున్నారు. ముఖ్యంగా బాల్యం నుండి భగవద్గీత అవగాహన ద్వారా వయస్సు పెరిగిన కొంది వారి యొక్క సత్ప్రవర్తన సమాజానికి ఎంతో మేలు చేస్తుంది అన్నారు. అంతేకాకుండా ప్రకృతిని ప్రేమించడం తోటి ప్రాణులను సమానంగా చూడటం వలన మానవ జన్మ సార్ధకత ఏర్పడుతుందన్నారు. అనంతరం పీటా న్యూటన్, సత్యవతి దంపతులు చిన్నారులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కోట విజయ్ కుమార్, వేణు, వెంకటసుబ్బయ్య, వాలి బాబు, ధన కుమార్, స్థానికులు పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా వై.వి.సుబ్బారెడ్డి జన్మదిన వేడుక

**రేపల్లె, మే 1, ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతగా ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాల కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి సేవలు ప్రశంసనీయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ



కొనియాడారు. పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రముఖ రాజకీయవేత్త, వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పీటా నాగమోహన్‌కృష్ణ మాట్లాడుతూ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం, పార్టీ అభ్యున్నతి కోసం పనిచేసే వై.వి.సుబ్బారెడ్డి నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రజా సేవలో ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన ఆకాక్షించారు. 16వ లోక్‌సభలో రాజ్యసభ సభ్యునిగా, వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకునిగా కొనసాగుతూ ఎన్నో సమస్యలపై గళం విప్పుతున్నారని ఆయన చెప్పారు. రాజకీయ నిబద్ధత కలిగిన నేతగా ప్రజల ఆదరణ పొందుతున్నారని పీటా నాగమోహన్‌కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా కార్యకర్తలు, పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వర్గం హక్కుల కోసం ఉద్యమించాలి

### - సీఐటీయూ నాయకులు ములకా శివసాంబిరెడ్డి

**కొల్లిపర, మే 1, ప్రభాతవార్త:** మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం హక్కుల కోసం ఉద్యమించాలని సీఐటీయూ నాయకులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా నాయకులు శివసాంబిరెడ్డి మాట్లాడుతూ శ్రమజీవుల ఏకైక పండుగ మేడే అని, ఆ స్ఫూర్తే శ్రమ దోపిడికి విముక్తి మార్గమని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని.. ఉద్యోగ భద్రత కల్పించాలని.. పంచాయతీ కార్మికులకు టెండర్



విధానం రద్దు చేసి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ పోరాడుతుందన్నారు. కార్మికవర్గ ఐక్యతతోనే హక్కులు సాధ్యపడుతుందని చెప్పారు. సిఐటియు మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మిక.. కర్షక ఐక్యత కోసం సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి ఎందరో ప్రాణ త్యాగాలు చేసి సాధించిన హక్కుల రక్షణకు కార్మికులందరూ అప్రమత్తమై పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో షేక్ జానీ భాషా, ఉల్లపల్లి రామయ్య, అజారుద్దీన్, మల్లోల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా శ్రీ పోదిలమ్మ తల్లి తిరునాళ్ళ



**రేపల్లె, మే 1, ప్రభాతవార్త:** గ్రామాలను, ప్రజలను రక్షించే గ్రామ దేవతగా పోదిలమ్మ తల్లి మహిమలను భక్తులకు చూపటం అభినందనీయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ అన్నారు. శుక్రవారం రేపల్లె మండలంలోని మైనేనివారిపాలెంలో శ్రీ పోదిలమ్మ తల్లి తిరునాళ్ళ అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తిమార్గాన్ని అనుసరిస్తున్నందునే పోదిలమ్మ తల్లి అనుగ్రహం లభిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర జాయింట్ కార్యదర్శి చిమటా బాలాజీ, రేపల్లె రూరల్ మండల కన్వీనర్ మేడికొండ అనిల్, రేపల్లె పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, నిజాంపట్నం మండల కన్వీనర్ యార్లగడ్డ రాంబాబు, ఉయ్యూరు గంగాధరరావు, ఉయ్యూరు కిట్టయ్య, ఉయ్యూరు శివ నాగేశ్వరరావు, కేసన నాగమల్లేశ్వరరావు, కేసన ముక్తేశ్వరరావు, ఏసన్న సాంబయ్య, వాకా గోపి, దాసరి సుందరయ్య, రౌతు నాగరాజు, వైకాపా కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కోల్‌కతాలో తగ్గని ఉద్రిక్తత

- స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత లేదంటూ రోడ్డెక్కిన టిఎంసి
- ఇవిఎంలు ట్యాంపరింగ్ చేస్తే సహించబోమన్న సిఎం మమత
- కోలకతాలోని ఇండోర్ స్టేడియం వద్ద భారీ ధర్నా



**కోల్‌కతా, మే 1:** ఓటింగ్ ప్రక్రియ ముగిసి మే 4న ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో కొత్త వివాదం ఏర్పడింది. ఎన్నికల సంఘంపై అధికార టీఎంసీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కయ్యాయని పేర్కొంది. కొందరు వ్యక్తులు ఏ పార్టీ నేతలు అక్కడ లేకుండా స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపర్చిన ఈవీఎంలను తెరుస్తున్న వీడియో ఫుటేజ్‌ను టీఎంసీ ఎక్స్‌లో విడుదల చేస్తూ బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కుతో భారీ ఎన్నికల మోసం జరిగిందని ఆరోపించింది. పేర్ల తొలగింపు, ఓటర్లను బెదిరించడం నుంచి ఈవీఎంలను తారుమారు చేయడం వరకు ఎన్నికలను ప్రభావితం చేసే ప్రయత్నాలు పెచ్చుమీరాయని, ఇది ఒక నిస్సహాయక చర్య అని టీఎంసీ విమర్శించింది. టీఎంసీ ఆరోపణతో పార్టీ వర్గాలు ఎన్నికల సంఘం చర్యపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. టీఎంసీ నేతలు శశిపంజా, కునాల్ ఘోష్‌లు బ్యాలెట్‌బాక్స్‌లు భద్రపర్చిన కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియం బయట ధర్నా ప్రారంభించారు. బెనర్జీ భవానీపూర్, దక్షిణ కోల్‌కతాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల బ్యాలెట్ బాక్స్‌లు భద్రపర్చిన షెకావత్ మెమోరియల్ గర్ల్స్ హైస్కూల్‌కు చేరుకున్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలకు తెగించి పోరాడతామని ఆమె స్పష్టం చేశారు. ఈవీఎంల భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె స్వయంగా కోల్‌కతాలోని ఓ స్ట్రాంగ్‌రూమ్ వద్ద మూడు గంటలకుపైగా ఉన్నారు. దక్షిణ కోల్‌కతాలోని సాఖావత్ మెమోరియల్ స్కూల్‌లో భవానీపూర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్‌రూమ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, బ్యాలెట్ బాక్సులను తెరుస్తున్నారని టీఎంసీ ఆరోపించింది. దీనికి సంబంధించిన వీడియోలు టీవీలో చూసిన తర్వాత మమతా బెనర్జీ గురువారం రాత్రి నేరుగా అక్కడికి చేరుకున్నారు. భవానీపూర్ అభ్యర్థిగా తనకున్న హక్కుతో స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎం యంత్రాన్ని దొంగిలించడానికి లేదా కౌంటింగ్‌ను తారుమారు చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే మేం ప్రాణాలకు తెగించి పోరాడతామని హెచ్చరించారు. తనను మొదట సెంట్రల్ ఫోర్సెస్ సిబ్బంది అడ్డుకున్నారని, కానీ ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థిగా తనకు ఉన్న హక్కును వినియోగించుకుని లోపలికి వెళ్లానని తెలిపారు. తాజా ఆరోపణలతో పశ్చిమ బెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రూల్స్‌కు వ్యతిరేకంగా ఏం చేసినా సహించేది లేదన్నారు. కౌంటింగ్ జరిగే మే 4వ తేదీ వరకు పార్టీ వర్గాలు నిరంతరం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద గస్తీ నిర్వహించాలని పార్టీ వర్గాలకు మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో విజయం పట్ల మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 226 సీట్లలో విజయంసాధిస్తామని ఆమె ప్రకటించారు. ఈ క్రమంలో నాయకులు, పార్టీ వర్గాలు బ్యాలెట్ బాక్స్‌లు ఉంచిన ప్రాంతంపై నిఘా ఉంచి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్‌కు ముందే స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చిన బ్యాలెట్ బాక్స్‌లను బీజేపీ తెరుస్తున్నదంటూ టీఎంసీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం గురువారం ఖండించింది. స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపర్చిన ఈవీఎంలన్నీ సురక్షితంగా, భద్రంగా ఉన్నాయని స్పష్టం చేసింది. టీఎంసీ వీడియోలో చూపింది పోస్టల్ బ్యాలెట్ల కోసం ఉద్దేశించిన మరో స్ట్రాంగ్ రూమని వివరణ ఇచ్చింది. స్ట్రాంగ్‌రూమ్‌లో కూర్చుకున్న మమతా బెనర్జీ వీడియోపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందించారు. స్ట్రాంగ్‌రూమ్‌లో దీదీ ఉన్నంత వరకు తమ ఎలక్షన్ ఏజెంట్ అడ్వకేట్ సుర్యానిల్ దాస్ ఉంటారన్నారు. ఎటువంటి తప్పుడు విధానాలను ఆమె అవలంబించబోదన్న ఆశిస్తున్నట్లు తెలిపారు.

# భారత్‌గడ్డపై పాకిస్థాన్ మరోసారి ఉగ్రదాడికి కుట్ర


## నిఘా వర్గాలు హెచ్చరిక



ఆసిమ్ మునీర్

**ఇస్లామాబాద్, మే 1 :** భారత గడ్డపై మరో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోందని, ఈసారి జమ్మూకశ్మీర్‌ను లక్ష్యంగాచేసుకుని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్‌ను ప్రతీకార దాడులకు పురిగొల్పి, ఆ తర్వాత అమెరికా వంటి దేశాల జోక్యాన్ని కోరడం ద్వారా కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లాలనేది పాక్ పన్నాగంగా కనిపిస్తోంది. ఈ మొత్తం వ్యూహం వెనుక పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ వ్యక్తిగత, రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. దేశీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న అసిమ్ మునీర్, తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి భారత్‌పై ఒక పెద్ద దాడిని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆయన దృష్టి మళ్లీ భారత్‌పైకి మళ్లింది. కశ్మీర్ అంశాన్ని రగిలించడం ద్వారా పాకిస్థాన్‌లో తన ఇమేజ్‌ను పెంచుకుని, భవిష్యత్తులో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలనేది ఆయన దీర్ఘకాలిక ప్రణాళిక అని ఓ అధికారి తెలిపారు. ఇందుకోసం మునీర్ రెండంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మొదటి దశలో, కశ్మీర్‌లోని స్థానిక యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించి, చిన్నచిన్న దాడులు చేయించడం ద్వారా లోయలో అశాంతిని సృష్టించడం. దీని వల్ల పర్యాటక రంగం దెబ్బతినడంతో పాటు సరిహద్దుల్లో మోహరించిన భారత భద్రతా బలగాల దృష్టిని అంతర్గత భద్రత వైపు మళ్లించవచ్చు. రెండో దశలో, ఈ అదను చూసి సరిహద్దుల్లోని లాంచ్‌ప్యాడ్‌లలో సిద్ధంగా ఉన్న పెద్ద సంఖ్యలోని పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించి, ఒక భారీ దాడికిపాల్పడటం వారి వ్యూహంలో భాగం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్‌చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అది తమ అంతర్గత వ్యవహారమని భారత్ గట్టిగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ చేత సైనిక చర్యకు ఆస్కారం కల్పించి, దానిని సాకుగా చూపి అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకునేలా చేయాలన్నదే మునీర్ అసలు లక్ష్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసినా ఫర్వాలేదన్న తెగింపుతో మునీర్ ఉన్నారని, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే ముఖ్యమని మునీర్ సన్నిహితుల చెబుతున్నారు.

# మరణానికి ముందు ఎప్‌స్టీన్ ఆత్మహత్యలేఖ!



**వాషింగ్టన్, మే 1:** అమెరికాలో సంచలనం సృష్టించిన లైంగిక నేరగాడు, వివాదాస్పద ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ జైలులో ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసినట్లుగా భావిస్తున్న ఒక సూసైడ్ నోట్‌ను గత ఏడేళ్లుగా అత్యంత రహస్యంగా ఉంచారన్న సమాచారం బయటకు పొక్కింది. ఈ నోట్‌ను బహిర్గతం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో ఈ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఎప్‌స్టీన్ మృతిపై దర్యాప్తులో ఈ లేఖ కీలకం కానుందని నిపుణులు భావిస్తున్నారు. ఎప్‌స్టీన్ 2019 ఆగస్టులో మాన్‌హాటన్ కరెక్షనల్ సెంటర్‌లోని తన గదిలో మరణించిన విషయం తెలిసిందే. ఆ ఘటనకు కొన్ని వారాల ముందు జులై నెలలో అతను మొదటిసారి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో అతని సెల్‌మేట్, పలు హత్య కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న మాజీ పోలీస్ అధికారి నికోలస్ టార్టాగ్లియోన్‌కు ఈ నోట్ దొరికింది. వారిద్దరి గదిలోని ఒక పుస్తకంలో, పసుపు రంగు కాగితంపై ఇక వీడ్కోలు చెప్పే సమయం వచ్చిందని రాసి ఉన్నట్లు టార్టాగ్లియోన్ గుర్తించాడు. తనపై దాడి చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని ఎప్‌స్టీన్ ఆరోపిస్తాడేమోనన్న భయంతో, టార్టాగ్లియోన్ ఆ నోట్‌ను జైలు అధికారులకు కాకుండా నేరుగా తన న్యాయవాదులకు అప్పగించాడు. వారు దాని ప్రామాణికతను నిర్ధారించుకున్నారని చెబుతున్నప్పటికీ, ఆ తర్వాత టార్టాగ్లియోన్ కేసును విచారిస్తున్న ఫెడరల్ జడ్జి ఆ నోట్‌ను సీల్‌చేసి, గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఎప్‌స్టీన్ మృతిపై దర్యాప్తు చేస్తున్న అధికారులు గానీ, న్యాయ శాఖ గానీ ఈ నోట్‌ను పరిశీలించలేదు. ఈ నోట్‌కు టార్టాగ్లియోన్ కేసుతో సంబంధం లేదని, ఎప్‌స్టీన్ చివరి రోజుల్లోని మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి, అతని మృతిపై దర్యాప్తులో ఇది కీలకమైన ఆధారమని అమెరికా మీడియావాదిస్తోంది. అందుకే దానిని బహిర్గతం చేయాలని కోర్టులో ఒక పత్రిక పిటిషన్ దాఖలు చేసింది. ప్రపంచంలోని అత్యంత శక్తిమంతులతో ఎప్‌స్టీన్ నెరిపిన లైంగిక నేరాల నెట్‌వర్క్‌కు సంబంధించిన వేలాది పత్రాలు ఇటీవల బయటకు వస్తున్న నేపథ్యంలో ఈ సూసైడ్ నోట్ ఉదంతం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఫెడరల్ సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలపై విచారణ ఖైదీగా ఉండగానే ఎప్‌స్టీన్ మరణించడం అప్పట్లో జైలు భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది.

# బర్త్‌డేకేక్ మృతుల కేసు నిందితుడి ఎన్‌కౌంటర్

**బులంద్‌షహర్, మే 1:** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో సంచలనం సృష్టించిన ట్రిపుల్ మర్డర్ కేసులో ప్రధాన నిందితుడు జీతూ సైనీ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అతడిపై రూ.50వేల రివార్డు ఉంది. కొన్ని రోజులుగా పరారీలో ఉన్న అతడిని గురువారం తెల్లవారుజామున పోలీసులు కాల్చి చంపారు. ధరౌ పోలీస్ అవుట్‌పోస్ట్ సమీపంలో స్కూటర్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపమని కోరారు. వారు ఆగకుండా పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని ఝూజర్ రోడ్డులో చుట్టుముట్టగా, నిందితులు కాల్పులు కొనసాగించారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక నిందితుడు గాయపడగా, మరొకరు చీకటిని ఆసరాగా చేసుకుని తప్పించుకున్నాడు. గాయపడిన జీతూ సైనీని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి ఒక పిస్టల్, బుల్లెట్లు, నంబర్ ప్లేట్ లేని స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 25న ఖుర్జాలో జరిగిన పుట్టినరోజు వేడుకలో అమర్‌దీప్ (30), మనీశ్(28), ఆకాశ్(18) అనే ముగ్గురు కుటుంబ సభ్యులను కాల్చి చంపిన కేసులో జీతూ సైనీ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. పుట్టినరోజు జరుపుకుంటున్న జీతూసైనీ ముఖానికి మృతులు సరదాగా కేక్ పూయడమే ఈ ఘర్షణకు కారణమైంది. ఈ చిన్న విషయంపై మాటామాటా పెరిగి, నిందితులు ఆయుధాలతో తిరిగి వచ్చి కాల్పులకు తెగబడ్డారు. పోలీసుల చర్యపై మృతుల కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిందితుల ఆస్తులను కూల్చివేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా సైనీ నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు.



రోదిస్తున్న బంధువులు

# ఒడిలో నాలుగేళ్ల కుమారుడితో తల్లి మృతి

### జబల్‌పూర్‌పడవప్రమాదంలో కన్నీరు పెట్టిస్తున్న దృశ్యం

### 9కి పెరిగిన మృతులు

**జబల్‌పూర్, మే 1:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లోజరిగిన పడవ ప్రమాదంలో హృదయ విదారక దృశ్యం ఆవిష్కృతమైంది. గురువారం జరిగిన ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 9కి చేరగా, శుక్రవారం సహాయక బృందాలు వెలికితీసిన ఒక తల్లి, ఆమె నాలుగేళ్ల కుమారుడి మృతదేహాలు అందరినీ కంటతడి పెట్టించాయి. తుదిశ్వాస విడిచే సమయంలోనూ ఆ తల్లిబిడ్డలు ఒకరినొకరు గట్టిగా కౌగిలించుకునే ఉన్నారు. వారిద్దరికీ కలిపి ఒకే లైఫ్ జాకెట్ ఉండటాన్ని బృందాలు గుర్తించాయి. నాలుగేళ్ల తన కొడుకుని తల్లి హత్తుకుని మరణించింది. ఆ చిన్నారి తల్లిని పట్టుకుని ప్రాణాలు కోల్పోయాడు. మరణంలోనూ తల్లీకొడుకు ఒకరినొకరు విడిచిపెట్టకుండా, చివరి క్షణం వరకు హత్తుకుని ఉండిపోయారు. ఒకరినొకరు పట్టుకుని ఉండిపోయిన తల్లీకొడుకు మృతదేహాలు నీటిలో తేలడం చూసిన సహాయక బృంద సభ్యులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రతి ఒక్కరినీ ఈ దృశ్యం కదిలిస్తోంది. గుండె బరువెక్కేలా చేస్తోంది. ఈ ఇద్దరితోపాటు వీరి కుటుంబానికి చెందిన మరో ఇద్దరు ఢిల్లీ నుంచి ఇక్కడికి విహారయాత్రకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరి మృతదేహాల్ని రెస్క్యూ బృందాలు ఒడ్డుకు చేర్చాయి. జబల్‌పూర్‌లోని బార్గీ డ్యామ్ రిజర్వాయర్‌లో ముందురోజు సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. సుమారు 30 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక క్రూయిజ్ బోటు ఆకస్మికంగా చెలరేగిన తుపాను కారణంగా నీటిలో బోల్తా పడింది. ఇప్పటివరకు 22 మందిని సురక్షితంగా కాపాడగా, పలువురు గల్లంతయ్యారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం, స్థానిక పోలీసులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న రాష్ట్ర మంత్రి రాకేశ్ సింగ్ తల్లి, బిడ్డ మృతదేహాలను చూసి తీవ్రంగా చలించిపోయి, కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. బలమైన గాలులు వీస్తున్నప్పుడు ఒడ్డుకు తిరిగి వెళ్దామని సిబ్బందిని కోరినా వారు వినలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అందరు ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఇవ్వలేదని ప్రమాదం నుంచి బయటపడిన ఒకరు ఆరోపించారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ హామీ ఇచ్చారు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాత ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పర్యాటక శాఖ మంత్రి ధర్మేంద్ర భవ్ సింగ్ లోధి స్పష్టం చేశారు.


## ఆస్తికోసం తల్లి, సోదరుడి హత్య

**తిరువనంతపురం, మే 1:** కేరళలో ఆస్తి కోసం కన్నతల్లిని, సోదరుడిని ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా హత్య చేసి, వారి మృతదేహాలను ఇంట్లోనే పూడ్చిపెట్టాడు. నెలరోజుల క్రితం ఇడుక్కి జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. పొన్నూట్టిల్ కుటుంబానికి చెందిన సజీ (45) తమ్ముడు రెజీ (40), తల్లి మేరీకుట్టి(65)తో కలిసి నివసిస్తున్నాడు. ఆ కుటుంబానికి చెందిన సుమారు ఎకరం భూమిని పంచుకోవడంపై సోదరుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో నెలరోజుల క్రితం ఓ రాత్రి రెజీ మద్యం సేవించి ఇంటికి వచ్చిన క్రమంలో అన్నదమ్ములు ఇద్దరికీ గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో రెజీ ముఖంపై సజీ తీవ్రంగా దాడి చేశాడు. అతను స్పృహ కోల్పోయిన తర్వాత టవల్‌తో గొంతు నులిమి హత్య చేశాడు. ఈ హత్యను చూసిన తల్లి మేరీకుట్టిని కూడా ముఖంపై కొట్టి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. రెండు రోజుల పాటు మృతదేహాలను ఇంట్లోనే దాచిపెట్టి, ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే గొయ్యి తీసి పూడ్చిపెట్టాడు. ఈ హత్యలు చేయడంలో తనకు ఎవరూ సహాయం చేయలేదని, ఒక్కడినే ఈ ఘాతుకానికి పాల్పడ్డానని సాజీ పోలీసుల ఎదుట అంగీకరించాడు. నెలరోజుల నుంచి మేరీకుట్టి, రెజీ కనిపించకపోవడంతో సజీని ఆరాతీశారు. సజీ వారికి పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దాంతో అనుమానించి ఇరుగుపొరుగు అనక్కరలో ఉండే వారి సోదరి సనీకి సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సజీ ఇంటికి వెళ్లాడు. పోలీసులను చూడగానే సజీ పారిపోయాడు. దాంతో అనుమానించిన పోలీసులు ఇంటి ఆవరణను పరిశీలించారు. తవ్వి పూడ్చిన ఆనవాళ్లు కనిపించడంతో తిరగతోడించగా రెజీ, మేరీకుట్టి మృతదేహాలు బయటపడ్డాయి. నిందితుడి కోసం తీవ్రంగా గాలించి గత నెల 28న అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కాగా 2018లో సజీ తండ్రి మాథ్యూ కూడా అదృశ్యమయ్యాడు. దాంతో ఆ ఘటనతో ఈ హత్యలకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు పట్టుకునన దృశ్యం

# ట్రంప్‌పై హత్యాయత్నం వీడియో విడుదల



హిల్టన్ ఫైర్ వీడియో

**వాషింగ్టన్, మే 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించిన వీడియోను యూఎస్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు విడుదల చేశారు. గతనెల 25న వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ కార్యక్రమంలో ఈ దాడి జరిగిన విషయం తెలిసిందే. నిందితుడు కోల్ థామస్ అలెన్ సెన్సార్ గేట్ల గుండా వేగంగా పరిగెత్తుకెళ్తూ ఒక పోలీస్ అధికారిపై కాల్పులు జరిపిన దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. ఈ ఘటనలో ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి తూటా తగలగా, అది ఎవరి కాల్పుల వల్ల జరిగిందనే దానిపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వాషింగ్టన్ యూఎస్ అటార్నీ జీనైన్ పిర్రో ఈ వీడియోను విడుదల చేశారు. అధ్యక్షుడిపై హత్యాయత్నం చేసే క్రమంలో కోల్ అలెన్ సీక్రెట్ సర్వీస్ అధికారిపై కాల్పులు జరిపినట్లు వీడియోలో స్పష్టంగా ఉంది. ఇది ఫ్రెండ్లీ ఫైర్ అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. కాలిఫోర్నియాకు చెందిన 31 ఏళ్ల కోల్ అలెన్, ఒక పార్ట్‌టైమ్ ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు. విచారణ పూర్తయ్యే వరకు జైల్లోనే ఉండేందుకు అతడు అంగీకరించాడు. అతడిపై అధ్యక్షుడిపై హత్యాయత్నంతో పాటు ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేశారు. నేరం రుజువైతే జీవిత ఖైదు పడే అవకాశం ఉంది. దాడికి ముందు తనను తాను ఫ్రెండ్లీ ఫెడరల్ అసాసిన్ అని చెప్పుకున్న అలెన్ ట్రంప్ పరిపాలనపై తనకున్న వ్యతిరేకతను పరోక్షంగా వెల్లడించాడు. ఈ ఘటనపై స్పందించిన సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ సీన్ కరన్ భద్రతా ఏర్పాట్లను సమర్థించారు. దాడిని కేవలం కొన్ని సెకన్లలోనే భద్రతా వలయం బయటి పరిధిలోనే అడ్డుకున్నామని తెలిపారు. దాడి జరిగిన ప్రదేశానికి, ట్రంప్ ఉన్న వేదికకు మధ్య 355 అడుగుల దూరం ఉందని, మధ్యలో అనేక సాయుధ అధికారులు, పటిష్ఠమైన భద్రత ఉందని ఆయన వివరించారు.



మాట్లాడుతున్న సోఫియా ఖురేషి

# మరోసారి మీడియా ముందుకు వ్యోమికా, సోఫియాలు..!

**న్యూఢిల్లీ, మే 1:** కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మరోసారి మీడియా ముందుకు వస్తున్నారనిప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గత సంవత్సరం పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో, భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ వివరాలను వెల్లడించేందుకు ఈ ఇద్దరు అధికారిణులు మీడియా ముందుకు వచ్చారు. వీరిద్దరు మరోసారి మీడియా ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వీరితో పాటు నేవీ కమాండర్ ప్రేరణా దేవస్థలి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ బ్రీఫింగ్‌లో వారు ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలు, ప్రాముఖ్యత, దాని వెనుక జరిగిన ప్రణాళిక వంటి విషయాల గురించి మాట్లాడే అవకాశముంది. సోఫియా ఖురేషీ గుజరాత్‌కు చెందినవారు. బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990లలో సైన్యంలో చేరారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా పని చేశారు. 2019లో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదాను పొందారు. మే 7తో ఆపరేషన్ నిర్వహించి ఏడాది పూర్తవుతుండడంతో వీరు మీడియా ముందుకు వస్తున్నట్టు తెలుస్తోంది.

## హర్భజన్ సింగ్‌కు భద్రత కల్పించండి

### - పంజాబ్ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, మే 1:** రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ వ్యక్తిగత భద్రతను పునః సమీక్షించాలంటూ పంజాబ్ ప్రభుత్వానికి పంజాబ్–హర్యానా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అతడికి ఎలాంటి హానీ జరగకుండా చూడాలని ఆదేశించింది. హర్భజన్‌సింగ్ ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామాచేసి, బిజెపిలో చేరారు. దీంతో పంజాబ్ ప్రభుత్వం హర్భజన్ సింగ్‌కు వ్యక్తిగత భద్రతను ఉపసంహరించింది. ఈ ఉపసంహరణ అనంతరం, ఆప్ కార్యకర్తలు ఆయన నివాసం వెలుపల నిరసన చేపట్టారు. ప్రహారీ గోడలపై “గద్దర్”(ద్రోహి) అని స్ప్రే పెయింట్‌తో రాశారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ రాజ్యసభ ఎంపీ హర్భజన్ సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పిటిషన్‌లో, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సెక్యూరిటీ) ఎటువంటి కొత్త ముప్పు అంచనా లేదా ముందస్తు నోటీసు లేకుండా, ఏకపక్షంగా మరియు కక్షపూరితంగా తన భద్రతను ఉపసంహరించుకున్నారని హర్భజన్ సింగ్ వాదించారు. భద్రతను ఉపసంహరించుకున్న వెంటనే, ఏప్రిల్ 25 మరియు 26 తేదీలలో ఒక గుంపు తన నివాసంపై దాడి చేసిందని, అయితే స్థానిక పోలీసులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, భద్రతను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపి, హర్భజన్ సింగ్‌కు ఎలాంటి శారీరక హాని జరగకుండా చూడాలని ఆప్ నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వానికి పంజాబ్, హర్యానా హైకోర్టు నోటీసు జారీ చేసింది.

# ఇంధన సంక్షోభంలో పాకిస్థాన్



పాకిస్థాన్‌లో పెట్రోలు కోసం బారులుతీరిన వాహనదారులు

**కరాచి, మే 1:** తీవ్ర ఇంధన సంక్షోభంతో పాకిస్థాన్ అల్లాడుతోంది. సహజ వాయువు (సీఎన్‌జీ) కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వం మరో భారం పడింది. తాజాగా పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ (హెచ్‌ఎస్‌డీ) ధరలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇరాన్ అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జల సంధిలో రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో ఈ పెంపు తప్పలేదని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త ధరలు వారం రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది. పాకిస్థాన్ పెట్రోలియం డివిజన్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం హైస్పీడ్ డీజిల్ ధర లీటర్‌కు 19.39 పాకిస్థానీ రూపాయలు పెరిగి, 380.19 నుంచి 399.58కి చేరింది. పెట్రోల్ ధర లీటర్‌కు 6.51 పెరగడంతో, పాత ధర 393.35 నుంచి 399.86కి ఎగబాకింది. పాకిస్థాన్‌లో హైస్పీడ్ డీజిల్‌ను ప్రధానంగా రవాణా, వ్యవసాయ రంగాల్లో ఉపయోగిస్తారు. ప్రస్తుతం దేశంలో పంటల సాగు సీజన్ నడుస్తున్నందున, ఈ ధరల పెంపు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రవాణా ఖర్చులు పెరగడంతో ఇప్పటికే ఎరువుల ధరలు పెరిగాయని సర్కారు చెపుతోంది. తాజా ధరల పెంపునకు ముందే పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ప్రజలు తీవ్ర గ్యాస్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రావిన్స్ వ్యాప్తంగా సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్లు మూతపడటంతో చాలా ప్రాంతాల్లో గృహ, వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో కోతలు విధించారు. సీఎన్‌జీ అందుబాటులో లేకపోవడంతో స్కూల్ వ్యాన్లు, బస్సుల ఆపరేటర్లు చాలావరకు తమ సర్వీసులను నిలిపివేశారు. ఇది విద్యార్థుల చదువులు, దినచర్యపై ప్రభావం చూపుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక ప్రజా రవాణా వాహనాలు పెట్రోల్‌తో నడపాల్సి రావడంతో నిర్వాహకులు ఛార్జీలను విపరీతంగా పెంచారు. ఒకవైపు సీఎన్‌జీ కొరత, మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం రెట్టింపు అయింది. సీఎన్‌జీ సరఫరాను పునరుద్ధరించకపోతే సర్వీసులను పూర్తిగా నిలిపివేస్తామని రవాణా నిర్వాహకులు హెచ్చరిస్తున్నారు

# రాహుల్‌గాంధీకి ఊరట

### -ఇండియన్ స్టేట్ వ్యాఖ్యలపై ఎఫ్‌ఐఆర్ నమోదుకు నిరాకరణ

### - పిటిషన్ కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు

**న్యూఢిల్లీ, మే 1:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వివాదాస్పద “భారత రాజ్యంతో పోరాటం” వ్యాఖ్యపై ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించడానికి నిరాకరిస్తూ సంభాల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు శుక్రవారం, మే 1న కొట్టివేసింది. హిందూ శక్తి దళ్‌కు చెందిన సిమ్రాన్ గుప్తా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్ డి. చౌహాన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం దీనిని తిరస్కరించింది. గత ఏడాది జనవరిలో కాంగ్రెస్ నాయకుడు చేసిన ఈ ప్రకటన దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది “రాజద్రోహ, దేశ వ్యతిరేక” ప్రకటనకు సమానమని గుప్తా తన పిటిషన్‌లో వాదించినట్లు ఐఏఎన్‌ఎస్ నివేదించింది. జనవరి 2025లో న్యూఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో గాంధీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. “తాము ఇప్పుడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, భారత రాజ్యంతోనే పోరాడుతున్నాము,“ అని ఆయన అన్నారు. ఆయన వ్యాఖ్యలు కేవలం రాజకీయ విమర్శలు మాత్రమే కాదని, దేశాన్ని అస్థిరపరిచే ఉద్దేశపూర్వక ప్రయత్నమని, అవి భారత రాజ్యాన్ని ఒక శత్రుశక్తిగా చిత్రీకరించాయని గుప్తా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనికి ముందు, రాహుల్ గాంధీపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ పిటిషనర్ దాఖలు చేసిన దరఖాస్తును సంభాల్‌లోని స్థానిక కోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత, ఈ విషయం అలహాబాద్ హైకోర్టుకు చేరింది. అంతేకాకుండా, ఆ తర్వాత దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాజాగా హైకోర్టు తీర్పునిస్తూ, రాహుల్‌గాంధీపై ఎఫ్‌ఐఆర్ నమోదుకు నిరాకరిస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది.

## భావపురిలో వైభవంగా శ్రీ క్షీర భావనారాయణ స్వామి రథోత్సవం

**బాపట్ల, మే01. ప్రభాతవార్త ప్రతినిధి:** బాపట్ల పట్టణంలోని చారిత్రక పుణ్యక్షేత్రం శ్రీమతసుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ క్షీర భావనారాయణ స్వామి వారి 1433వ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు అంబరాన్నంటాయి. ఉత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన దివ్య రథోత్సవం శుక్రవారం భక్తుల జయజయధ్వానాలు, వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత కోలాహలంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహంతో భావపురి క్షేత్రం భక్తిపారవశ్యంలో మునిగితేలింది. శుక్రవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, రథోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు,



బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు. మాజీ శాసనసభ్యులు రఘుపతి లు కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి వారు స్వామివారి దివ్య రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**భారీ బందోబస్తు.. విస్తృత ఏర్పాట్లు:** రథోత్సవానికి బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల



నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు బాపట్ల పట్టణ సీఐ రాంబాబు ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు భక్తులకు తాగునీరు, ఇతర కనీస సౌకర్యాల విషయంలో ఎక్కడా లోటు రాకుండా పర్యవేక్షించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, డీఎంహెచ్ఓ విజయమ్మ, డీఎస్పీ చంద్రమౌళి పాల్గొన్నారు. అలాగే జనసేన సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ, వేగేశన రాకేష్ వర్మ, ముప్పలనేని శ్రీనివాస రావు, ముప్పలనేని సుశాంత్, ఆలయ అధికారులు, అర్చకులు, స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పట్టణ వీధులన్నీ గోవింద.. నారాయణ స్మరణతో మారుమోగాయి.

## పింఛన్ 5రెట్లు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే : ఎమ్మెల్యే యరపతినేని

గురజాల, మే 1 ప్రభాతవార్త : పింఛన్‌ను ఐదు రెట్లు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని దివ్యాంగుల కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను ఆయన లబ్ధిదారులకు అందించి మాట్లాడారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ పండుగలా ఉంటుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని పింఛన్ రూ.3 వేల కోట్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2014లో కేవలం రూ.200 ఉన్న పింఛన్‌ను చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదు రెట్లు పెంచిందని గుర్తు చేశారు. 2024 ఎన్నికలకు ముందు పింఛన్‌ను పెంచి ప్రతి నెలా ఒకటో తేదీన అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తున్నారన్నారు. 1వ తేదీన సెలవు వస్తే ముందురోజే పింఛన్ను అందిస్తున్నారన్నారు. వద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు స్వయంగా ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారన్నారు. అనంతరం గురజాల పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి టెంట్ హౌస్‌ను ప్రారంభించారు. అలాగే రెడ్డి బండ సెంటర్లో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ



చైర్మన్ పులుకూరి కాంతారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కటకం అంకారావు, ఆర్డీవో మురళీకృష్ణ, డీఎల్‌డీవో గఫూర్‌నాయక్, తహసీల్దార్ దుర్గేష్, కమిషనర్ శివన్నారాయణ, పట్టణ ఇన్‌చార్జి చైర్మన్ బడేజాని, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నేలవెల్లి బొల్లయ్య, అడపా శ్రీనివాసరావు, శరమాల హనుమంతురావు, నవులూరి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 18 మందితో గుంటూరు బార్ అసోసియేషన్ నామినేటెడ్ జంబో కార్యవర్గం

### రికార్డు స్థాయి నామినేటెడ్ కార్యవర్గం



గుంటూరు లీగల్, మే 1 (ప్రభాతవార్త): న్యాయవాదుల సంక్షేమం, బార్ అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాల సలహా, సూచనల కోసం 18 మంది సీనియర్, జూనియర్ న్యాయవాదులను నామినేటెడ్ కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధిర నాగేశ్వరరావు శుక్రవారం వెల్లడించారు. గతంలో ఈ సంఖ్య ఐదు నుండి 17 వరకు న్యాయవాదులను నామినేట్ చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 18 మంది నామినేట్ కావటం విశేషం. సీనియర్లు, జూనియర్లు బేధం లేకుండా పనిచేసే ప్రతివారికి అవకాశం ఇచ్చినట్లు నాగేశ్వరరావు తెలిపారు. 202627 సంవత్సరానికి గాను పలు కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, తదనుగుణమైన టీం ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. జి.జోసఫ్ రవికుమార్, మట్టుపల్లి వెంకట సుబ్బారావు, నర్రా అంజయ్య, ఎన్.పెద నతానియల్, పోపూరి రాజశేఖర్ రెడ్డి, కారంకి లక్ష్మీనారాయణ, గుండు జ్ఞానేశ్వర్, నేలవల్లి శ్రీనివాసరావు, పుసులూరి జయరత్నం జీవ, కొండవీటి శ్రీనివాసరావు, జంగాల జవహర్ బాబు, మన్నవ జగన్మోహన్ రావు, పేర్ల రచన, పిల్లుట్ల బాబురావు, తోకల నాగరాజు, తోడేటి సందీప్ ఈశ్వర్, పాలపాటి అనిల్ కుమార్, షేక్ సుభాని నామినేటెడ్ కార్యవర్గంలో ఏడాదిపాటు కొనసాగుతారు. శుక్రవారం నాగేశ్వరావును నామినేటెడ్ కార్యవర్గం ఘనంగా సత్కరించింది.

## జర్నలిస్టులపై దాడులకు నిరసనగా గాంధీయవాది నాగరాజన్ ధర్మపోరాటదీక్ష

**తెనాలి మున్సిపాలిటీ మే1(ప్రభాతవార్త):** ఇటీవలి కాలంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు నిరసనగా, తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు,గాంధీ నాగరాజన్ ధర్మ పోరాట దీక్ష చేపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ,గంజాయి



మాఫియా అక్రమాలను ఎండగట్టిన జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్యకు న్యాయం కోరుతూ ధర్మ పోరాటం చేస్తున్న గాంధీయవాది నాగరాజన్. ఈ సందర్భంగా ఆయన ఒక లేఖ విడుదల చేశారు.ప్రియమైన సోదర సోదరీమణులకు, మీడియా మిత్రులకు మరియు ప్రజాస్వామ్యవాదులకు,నేను, మీ గాంధీ నాగరాజన్, ప్రతి నెలా 30వ తేదీన సమాజంలోని ఏదో ఒక సమస్యపై గాంధేయ మార్గంలో దీక్ష చేస్తున్నాను. "మంచి ఓటు మనం వేద్దాం అది మంచి వారికే వేద్దాం" అనే నినాదంతో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ, "దండియాత్ర 2" మరియు "నేను గాంధీ నాలో అంబేద్కర్" అనే సిద్ధాంతంతో నా జీవన విధాన యాత్రను కొనసాగిస్తున్నాను. ఈ ప్రయాణంలో భాగంగా, చిత్తూరు జిల్లాలో జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసనగా ఈ దీక్ష చేపడుతున్నాను.జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి సామాజిక బాధ్యతతో గంజాయి మాఫియా మరియు ఇతర అక్రమ వ్యాపారాల గురించి రాసిన కథనాలే ఆయన ప్రాణాలను బలితీసుకున్నాయి. దీనిపై గతంలోనే డీఎస్పీ కి ఫిర్యాదులు చేసినప్పటికీ, నిజమైన సూత్రధారులు ఇంకా బయట ఉండటం దురదృష్టకరం. గంజాయి పట్టడం పోలీసుల వల్ల కాకపోతే, ఆ అధికారాన్ని ఒక్క నెల నాకు ఇస్తే, ఏ పార్టీ వారు ఉన్నా, ఏ పోలీసు హస్తం ఉన్నా అందరినీ పట్టుకుని అరెస్ట్ చేస్తాను. ఇలా ప్రశ్నించే వారి ప్రాణాలకు హాని కలగడం ప్రజాస్వామ్య పద్ధతి కాదు.అందుకే, నేను చేపట్టబోయే ఈ ఉపవాస సత్యాగ్రహ నిరసన నిరాహార దీక్ష ద్వారా ప్రభుత్వాలకు ఈ క్రింది డిమాండ్లను విన్నవిస్తున్నాను:

**కఠిన చర్యలు:** గంజాయి మాఫియాను అంతం చేసి, జగన్మోహన్ రెడ్డి హత్యకు కారకులైన అసలు నిందితులను తక్షణమే శిక్షించాలి.జర్నలిస్ట్ ల రక్షణ చట్టం తేవాలి.ప్రశ్నించే గొంతుకలకు భద్రత కల్పించేలా ఖీజర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్ఖీను అమలు చేయాలి.చనిపోయిన జర్నలిస్ట్ కుటుంబానికి ప్రభుత్వం భారీ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలి.

## బాలికోన్నత పాఠశాల ఏర్పాటు లక్ష్యంను నెరవేర్చిన విద్యార్థులు

**-పదిలో అద్భుతమైన ఫలితాలు సాధించిన వెంగళరావు నగర్ స్కూల్ -గుంటూరు డిప్యూటీ డిఈఓ యేసు రత్నం,ఎంఈఓ 2 జ్యోతి కిరణ్ లు**

**గుంటూరు కార్పొరేషన్, మే 1, (ప్రభాతవార్త ) :** గుంటూరు నగరపాలక సంస్థ 53వ డివిజన్ నందలి వెంగళరావు నగర్ లో చుట్టుపక్కల 18 కాలనీలకు మధ్యలో కనుమరుగవుతున్న బాలిక విద్యను ప్రోత్సహించుటకు



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన బాలికోన్నత పాఠశాల లక్ష్యాలు ఖీఖీది ఫలితాల్లో స్పష్టంగా కనిపించాయని గుంటూరు డిప్యూటీ డిఈఓ యేసు రత్నం, ఎంఈఓ 2 జ్యోతి కిరణ్ తెలియజేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలకు చరవాణి ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా సీనియర్ టీచర్ పి రమేష్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో హెచ్ఎం ప్రమీల మేడం, కమిటీ చైర్మన్ చందు పవన్ కుమార్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సభలో మాట్లాడుతూ బాలికో ఉన్నత పాఠశాలగా అప్గ్రేడ్ అయిన తర్వాత మొదటిసారి 8 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరు కాగా 89 తో ఉత్తీర్ణత సాధించి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ద్వితీయ స్థానం సాధించడం గర్వంగా ఉన్నదని విద్యార్థులను అభినందించారు . ఉత్తీర్ణులైన ఏడుగురు విద్యార్థులలో నూనె అనూష 533 మార్కులను, కారు చోళ వినీల 511 మార్కులు సాధించగా మిగిలిన వారు ఫస్ట్ క్లాసులో ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలోనీ ఉపాధ్యాయులు సమిష్టిగా రాణించడం వలన సత్ఫలితాలను సాధించారని హెచ్ఎం పి ప్రమీల స్టాఫ్ ని అభినందించారు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు . టీచర్లు రాముల సార్ ,పి.రామయ్య, పిల్లి సుజాత, పిల్లి విజయలక్ష్మి ,కే మారుతి దేవి, మంగ, సుష్మా రెడ్డి పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి 500 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు శాలువాతోను బొకేతోను సత్కరించి ఆశీస్సులు అందించారుసరదా కాలనీ రాజీవ్ గాంధీ నగర్ మదర్ తెరిసా కాలనీ ఇన్నర్ రింగ్ రోడ్డు సంజీవయ్య నగరు వెంగళరావు నగర్ వసంత రాయపురం బొంగరాలు వీడు నెహ్రూ నగర్ తదితర ప్రాంత బాలికలు ఈ పాఠశాలలో చేరి పదవ తరగతి వరకు నిర్విఘ్నంగా తమ చదువులు కొనసాగించవచ్చని వారి గృహాలకు దగ్గర్లోనే మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో సీసీ కెమెరాలు పర్యవేక్షణలో కేవలం బాలిక పాఠశాల గా ఉన్న ఈ వెంగళరావు నగర్ బాలిక ఉన్నత పాఠశాలలో ఆడపిల్లలు తల్లిదండ్రులు ఉపయోగించుకోవలసినదిగా విద్యా కమిటీ చైర్మన్ తో పాటు మిగిలిన వక్తలు సూచించారు

## పేదవారి సంక్షేమం ఆలోచించిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**-దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి**

**కొల్లిపర,మే 1 ప్రభాతవార్త:** పేదవారి సంక్షేమం గురించి ఆలోచించిన ఏకైక ముఖ్య ంత్రి నారా చంద్ర బాబు నాయుడు అని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి పేర్కొన్నారు.



శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురంలో టీడీపీ నాయకులతో కలసి ఆయన ఇంటింటికీ తిరిగి పెన్షన్‌లను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ నాడు ఎన్నికలలో సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలన్ని అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ్,నీటి సంఘం అధ్యక్షుడు బొట్టా శ్రీరాములురెడ్డి,నాయకులు ఆరిగ పూర్ణచంద్రారెడ్డి,కొమ్మారెడ్డి గోపిరెడ్డి,కొండా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరునాళ్ళలో పలు సేవా కార్యక్రమాలు

**పొన్నూరు, మే 1,ప్రభాతవార్త:** సాక్షి శ్రీ భావనారాయణసా ్వమివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం జరిగిన భావయ్య తిరునాళ్ళ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం పలువురు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎండ, వేడిమిని లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి తిరునాళ్ళను తిలకించేవారికి అసౌకర్యం కలుగకుండా మజ్జిగ, మంచినీరు, ఆహార పదార్ధాలకు సంబంధించిన కౌంటర్లను ఏర్పాటు చేసి ఉచిత



సేవలు చేశారు. మండల, పట్టణ రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద భక్తులకు చక్కెర పొంగలి, పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అవ్వారు వెంకటేశ్వరరావు, రాంబాబు, చిలకా నరసింహారావు, తీర్థానందబాబు, అన్నపూర్ణా కిరాణా జనరల్ స్టోర్స్ ఆధ్వర్యంలో అవ్వారు సురేష్ అండర్ సన్స్ చెక్కరపొంగలి, దద్ధ్యోధనము పంపిణీ చేశారు. ఇంకా పలు సంస్థలు, వ్యాపార సంఘాల ఆధ్వర్యంలో మంచినీరు, మజ్జిగ, రస్నా తదితరాలను పంపిణీ చేశారు.

## స్వచ్ఛ సంపద కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలి

**-ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ్**

**కొల్లిపర,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** స్వచ్ఛ సంపద కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ్ అన్నారు. కొల్లిపర పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ



చెత్తరహిత గ్రామాలుగా తీర్చి దిద్దటమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.రోడ్డు పక్కన చెత్తచెదారం లేకుండా చూచుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎపిఎం రమాదేవి,వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యులో ఇటలీ కంపెనీ క్యాంపస్ డ్రైవ్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మే1,ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని సివిల్, మెకానికల్ బ్లాక్‌లోని డ్రోన్ సెంటర్‌లో ఇటలీకి చెందిన ఎన్టీఆర్ బయో సెన్సార్ సంస్థ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సంస్థలో ఉద్యోగాల భర్తీకి అవసరమైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఇటలీ నుంచి ఆర్ అండ్ డి హెడ్ డా. కె.హరీష్, సాఫ్ట్‌వేర్ మేనేజర్ టి. నరేష్, ఇండియన్ ఆపరేషన్



హెడ్ కె.రవికుమార్‌లు శుక్రవారం 4గురు విద్యార్థులను ఎంపిక చేశారని రెక్టార్, కామర్స్ విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరాంప్రసాద్ తెలిపారు. ఇటీవల వర్సిటీ నిర్వహించిన అకడమిక్ సమ్మిట్‌లో బయో సెన్సార్ సంస్థ ఏఎన్‌యుతో ఎంఓయు కుదుర్చుకుంది. అందులోభాగంగా ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహించారన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.ఎండి తౌసిఫ్ అహ్మద్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా వివిధ కంపెనీలను వర్సిటీకి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థికి ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ గోపీకృష్ణ, డా.చంద్రమౌళి, ఈసిఇ కోఆర్డినేటర్ అఖిలాజాన్, ట్రిబుల్ ఈ కోర్డినేటర్ ఉమామహేశ్వరి, మెకానికల్ కోఆర్డినేటర్ బోయపాటి పూర్ణచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ కూటమి ప్రభుత్వంలో పెన్షన్లు

**-తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్**

పొన్నూరు, మే 1,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సామాజిక పెన్షన్లు అందజేసేందుకు సిద్ధంగా ఉందని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో ఓ వికలాంగునికి నూతనంగా మంజూరైన పెన్షన్‌ను తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వికలాంగు



లకు చేయూతనిచ్చేందుకే ప్రభుత్వం పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. అర్హులకు పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ గణాంకాధికారి నల్లాని ప్రసాద్ తదితరులున్నారు.

## భావదేవుని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య


**పొన్నూరు, మే 1,ప్రభాతవార్త:** శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి శ్రీ భావనారాయణ స్వామివారిని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బ్రహోత్సవాల సందర్భంగా జరిగే రథోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



రథాన్ని లాగి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రోశయ్య వెంట వల్లంశెట్టి శ్రీధర్, యరసాని నాగభూషణం తదితరులున్నారు.

## ఘనంగా మేడే

**గురజాల, మే 1 ప్రభాతవార్త :** పట్టణంలోని మందపాటి నాగిరెడ్డి భవనంలో గల సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ నేతలు, ప్రజా సంఘాల నేతలు మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్ జెండాను ఎగురవేశారు. కార్మికుల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంఘాలను భలోపేతం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసీ నేత నాగేంద్రం,



చారి, షేక్ ఇబ్రహీం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో టాస్కోఫోర్స్ బృందం దాడులు

గుంటూరు క్రైమ్,మే1,ప్రభాతవార్త:ఇరుచోట్ల వ్యభిచారం జరుగుతుందనే సమాచారం తో టాస్కోఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గురువారం సాయంత్రం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని, ఇన్నర్ రింగ్ రోడ్డు, రెడ్డిపాలెం, ఫేస్ వన్, బిఓఐ బ్యాంక్ పైన ఐరా స్పా రిలాక్స్ రెన్యూ రెజ్యూవంటే 3,4 అంతస్తుల నందు స్పా సెంటర్ నందు స్పా మస్సాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారనిటాస్క్ ఫోర్స్ సిబ్బందికి రాబడిన సమాచారాన్ని ఎస్పి డిఎస్పీ కి తెలియపరిచి వారి ఆదేశాల ప్రకారం టాస్కోఫోర్స్ సిఐకి తెలియపరిచి నల్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి రైడ్ చేయగా ముగ్గురు మహిళలు(2 ఇతర రాష్ట్రాల వారు) 1ఒక వ్యక్తి ఉన్నారు.సూర్య (మేనేజర్) తదుపరి విచారణ కొరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ వారికి అప్పగించడం జరిగింది.అదేవిధంగా శుక్రవారం సాయంత్రం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫేస్ టు, కేనర బ్యాంక్ పైన ఏ 9 బ్యూటిఫుల్ సెలూన్ అండ్ స్పా 2, అంతస్తుల నందు స్పా సెంటర్ స్పా మస్సాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారనిటాస్క్ ఫోర్స్ సిబ్బందికి రాబడిన సమాచారాన్నిఎస్పి డిఎస్పీకి తెలియపరిచి ఎస్పి డిఎస్పీ ఆదేశాల ప్రకారం టాస్కోఫోర్స్ సిఐకి తెలియపరిచి నల్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి రైడ్ చేయగా ఏడుగురు వ్యక్తులు,నలుగురు మహిళలు(1 ఇతర రాష్ట్రాల వారు)11 సెల్ ఫోన్లుఆదినారాయణ (మేనేజర్) తదుపరి విచారణ కొరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ వారికి అప్పగించడం జరిగింది..

## టెన్త్ ఫలితాల్లో సెయింట్ లారెల్స్ విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య మే 1 ప్రభాతవార్త** పదో తరగతి ఫలితాల్లో గుంటూరు ఆర్టీసీ కాలనీ లోని సెయింట్ లారెన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని స్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు తెలిపారు. ఫలితాలలో మా విద్యార్థులు 593 591 586 584 581 581 581 ఈ విధంగా క్రమం తప్పకుండా నిలకడతో దిగువ మధ్యతరగతి కుటుంబాల విద్యార్థినీ విద్యార్థులకు మా విద్యాసంస్థ భరోసాను కల్పిస్తూ నాణ్యత గల విద్య




కు పునాదులు వేస్తున్నామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్కూల్ కరస్పాండెంట్ రవీంద్రబాబు , స్కూల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ శేష కుమారి మాట్లాడుతూ ఈ విజయం సమిష్టి విజయం గా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పూల బొకేలను ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎమ్. మీనాక్షి ,ప్రిన్సిపాల్ ఏ కళ్యాణి, లక్ష్మీ భారతి ,ప్రైమరీ హెచ్ఎం సీతామహాలక్ష్మి ్మ, కరుణ జ్యోతి, శ్రీదేవి మరియు పెద్ద ఎత్తున తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల విజయాన్ని అభినందించారు .అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థుల జాబితాలో 593 మార్కులు సాధించిన శారదా శ్రీ శర్వాణి, 591 మార్కులు సాధించిన బి దేవి ప్రియ ,586 మార్కులు సాధించిన సుహానా ముస్కాన్, 584 మార్కులు సాధించిన షా ఇస్తా తబసూం, 583 మార్కులు సాధించిన పి హరిణి లు ఉన్నట్లు రవీంద్రబాబు వెల్లడించారు.

## ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి అండగా ఉంటా

### ఎమ్మెల్యే యరపతినేని

**గురజాల, మే 1 ప్రభాతవార్త :** గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి అండగా ఉంటానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. తన సొంత నిధులతో కొనుగోలు చేసిన ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, కుర్చీలను శుక్రవారం వైద్యశాలకు అందించారు. అనంతరం



వైద్యశాలలో సిమెంట్ రోడ్డు, గార్డెనింగ్, టాయిలెట్స్ నిర్మాణం, వైద్యశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వైద్యశ్శాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో అన్ని సౌకర్యాలతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ వైద్యశాల కార్పొరేట్ వైద్యశాలకు ధీటుగా ఉండేందుకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి చైర్మన్ పాతూరి రామకృష్ణ, సభ్యులు ప్రసాద్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, సాయి కర్ణ, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బడేజాని, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నేలవెల్లి మల్లయ్య, శరమాల హనుమంతురావు, నవులూరి శ్రీరామూర్తి, ప్రకాష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కారానయలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, డీఎల్‌డీవో గఫ్రూనాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టెన్త్ ఫలితాలలో చౌత్ర ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య మే 1 ప్రభాతవార్త :** ప్రభుత్వ గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు గుంటూరు తూర్పు నియోజకవర్గం లో ప్రభుత్వ పాఠశాలలలో 580 మార్కులతో మొదటి స్థానం సాధించడంతోపాటు 23మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించటం అభినందనీయమని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి శ్రీఎండీ ఖాసీం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు పద్మజ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 105 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 84 మంది ఉత్తీర్ణులై 80 ఉత్తీర్ణత సాధించడం పట్ల వారు తల్లిదండ్రులను,విద్యార్థులను అభినందించారు తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించడానికి ముందుకు రావడంతో పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వటం అభినందనీయమని అదే విధంగా ఏ జిల్లాలో లేని విధంగా పదో తరగతి విద్యార్థులకు 100 డేస్ ప్లాన్లో భాగంగా సాయంత్రం పూట జిల్లా కలెక్టర్ గారి ఆదేశాలతో అల్పాహారం అందించడం కూడా ఫలితాలు సాధించడానికి దోహద పడిందని అన్నారు ఏ ఒక్క విద్యార్థి కూడా డ్రాప్ అవుట్ కాకుండా ఉన్నత చదువులు చదువుకోవాలని ఆ విషయంలో ఏమైనా ఇబ్బంది ఉంటే మా దృష్టికి తెస్తే చదువుకునేందుకు సహకారంగా ఉంటామని, గుంటూరు నగరంలో విద్యార్థినిల కొరకు అన్ని వసతులు సదుపాయాలు ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉన్నదని దాన్ని ఉపయోగించుకోవాలని వారన్నారు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను దృష్టిలో ఉంచుకొని తమ పిల్లలను అన్ని సౌకర్యాలు యున్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు సెలవులను సైతం వినియోగించుకోకుండా పదో తరగతి ఉత్తీర్ణత కొరకు సహకరించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను వారు అభినందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గం

**పెదనందిపాడు,మే 1, (ప్రభాతవార్త):** సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమని సి.ఐ.టి.యు.జిల్లా కార్యదర్శి జి.రమణ అన్నారు. మేడే సందర్భంగా, పెదనందిపాడు, వరగాని,కాకుమాను గ్రామాలలో జరిగిన సి.ఐ.టి.యు.పతాకాల ఆవిష్కరణ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా రమణ



పాల్గొని ప్రసంగించారు. కార్మికులంతా సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు.పోరాడితే పోయేదేమీలేదు,బానిస సంకెళ్ళు తప్ప అని మహనీయుడు కార్ల్ మార్క్స్ చెప్పారని , ఆయన చెప్పిన మాటలు గుర్తు చేసుకుని పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు.1886 లో అమెరికాలోని చికాగో నగరంలోని హేమార్కెట్ లో 8 గం.ల పని కోసం చేసిన మహత్తర పోరాటం సందర్భంగా, కార్మికుల నెత్తుటి నుండి ఎర్రజండా పుట్టిందని అన్నారు.పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని, లేబర్ కోడ్ ల వలన కార్మికుల హక్కులు హరింప బడ్డాయని అన్నారు.వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.సి.ఐ.టి.యు.మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ, కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. పోరాడి సాధించుకున్న 8 గం.ల పని విధానాన్ని కొనసాగించాలని, 12 గం.ల పనిని ప్రవేశ పెట్టాలనే ఆలోచనను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాల రా స్ తు న్ నా యని, జీతాలు పెంచకుండా , కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా మాయమాటలు చెబుతున్నాయని, కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని అన్నారు. కార్మికులంతా ఏకమై తమ సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. పెదనందిపాడు లోని పాత బస్టాండు సెంటర్ లో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకలలో, సి.ఐ.టి.యు. పతాకాలను సి.ఐ.టి.యు.జిల్లా కార్యదర్శి జి. రమణ, మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు లు ఆవిష్కరించారు.ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద యూనియన్ అధ్యక్షులు సికిందర్,సి.ఐ.టి.యు. కార్యాలయం వద్ద సి.ఐ.టి.యు.జిల్లా కార్యదర్శి జి. రమణ, వరగాని లో సి.ఐ.టి.యు.జిల్లా కార్యదర్శి జి. రమణ, కాకుమానులో సి.ఐ.టి.యు.నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు లు పతాకాలను ఆవిష్కరించారు.పాలపర్రులో అంబేద్కర్ సెంటర్ లో అన్నలదాసు ఆశీర్వాదం, పార్టీ కార్యాలయం వద్ద సి.ఐ.టి.యు.నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, లేబర్ పేట సెంటర్ లో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు లు సి.ఐ.టి.యు., సి.పి.ఎం.పతాకాలను ఆవిష్కరించారు. పాలపర్రులో గోలి సుబ్బారావు, ఆశీర్వాదం, దేవరకొండ శ్రీనివాసరావు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు లు, పెదనందిపాడు లోభవన నిర్మాణ కార్మికులు జల్లపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

**పెదనందిపాడు మే 1 (ప్రభాతవార్త)** స్థానిక పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వ్యాయమ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వాలీ బాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం ను విజ్ఞాన సంస్థల అధినేత కళాశాల సెక్రటరీ



కరస్పాండెంట్ డాక్టర్ లావు రత్తయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమములో కళాశాల పాలకవర్గ అధ్యక్షులు విశ్రాంత విజిలెన్స్ ఏ ఎస్ పి కాళహస్తి సత్యనారాయణ. కళాశాల జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ , పాలకవర్గ సభ్యులు నర్రా వీరయ్య , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. గుర్రం వీర రాఘవయ్య , వైస్ ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి ప్రతాప్ కుమార్ , వ్యాయమ అధ్యాపకులు డాక్టర్. పాతూరి శ్రీనివాస్ , నంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లూరి సత్యనారాయణ లు పాల్గొన్నారు. ఈ సందర్భముగా కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాణయ మాట్లాడుతూ పెదనందిపాడు పరిసర ప్రాంత విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొని శారీరక ధారుఢ్యం పెంపొందించుకోవాలని. వాలీబాల్ ఆటలలో మెళుకువలను పెంపొందించుకోవాలని వేసవి సెలవులలో ఈ కార్యక్రమ చేపట్టిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ రోజు భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ ని విజయవంతం గా నిర్వహించిన రోజు అని మన కళాశాల నుండి ఆర్మీ మరియు పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన ఎన్. సి. సి క్యాడెట్స్ లకు అభినందనలు తెలియజేసారు. డాక్టర్. లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా ఫోన్స్ మరియు టీవీ లకు అలవాటు పడటం వలన వారి శారీరక మరియు మానసిక సమస్యలకు లోనవుతున్నారని, ఇటువంటి కార్యక్రమాలను వినియోగించుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని పేర్కొన్నారు . ప్రిన్సిపాల్ డాక్టర్. గుర్రం వీర రాఘవయ్య మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం వలన క్రీడా స్ఫూర్తి పెంపొందించుకొని మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చు అన్నారు. శిక్షణ తరగతుల నిర్వాహకులు డాక్టర్. పాతూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరప్రాంత పాఠశాలల మరియు కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న వ్యాయమ ఉపాధ్యాయులకు, కళాశాల సిబ్బందికి, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ వారికి కృతఙ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్.సి.సి క్యాడెట్స్ కు యూనిఫామ్ , ట్రాక్ సూట్, షూస్ కి సంబందించినవి మరియు ఎన్. సి. సి బీ సర్టిఫికెట్ పరీక్ష ఉట్టిరనులైన విద్యార్థులకు కళాశాల పాలకవర్గ సభ్యుల చేతులమీద గా అందచేసినారు. ఈ కార్యక్రమం లో 23(తి)తీవి హవెల్దార్ సూర్య నారాయణ, డాక్టర్.గోగినేని హనుమంతురావు కళాశాల అధ్యాపక . అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# నూరుశాతం పంపిణీ పూర్తి చేయాలి

### -ఇంచార్జి కమిషనర్ పి.పోతురాజు

**పొన్నూరు, మే1, ప్రభాతవార్త:** సచివాలయ సిబ్బంది నూరు శాతం పించన్ల పంపిణీ పూర్తయ్యేవిధంగా చూడాలని ఇంచార్జి కమిషనర్ పి.పోతురాజు ఆదేశించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో పర్యటించిన



పోతురాజు పంపిణీకి సంబంధించిన పలు విషయాలను స్వయంగా పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. అర్హులందరికీ పెన్షన్లు అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పురపాలక సంఘం పరిధిలో పించన్ల పంపిణీ వేగవంతంగానే జరుగుతున్నట్లు చెప్పారు.

# ఎన్యుమరేషన్ పక్కాగా చేపట్టాలి

### -తహాశీల్దార్ కళ్ళెం శ్రీనివాసశర్మ

**చేబ్రోలు(పొన్నూరు), మే 1,ప్రభాతవార్త:** జన గణన ఎన్యుమరేషన్ పక్కాగా నిర్వహించాలని మండల తహాశీల్దార్ కళ్ళెం శ్రీనివాసశర్మ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రమైన చేబ్రోలు 94వ



బ్లాక్‌లో శుక్రవారం ఆయన ఎన్యుమరేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ చేసే సిబ్బంది ఇంటింటికి వెళ్ళి వివరాలను అడిగి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకొని ఉంటే వారు చేసిన వివరాలు సరైనవా..?కాదా...? అనే విషయాలను పరిశీలించారు. నూరుశాతం పక్కాగా ఎన్యుమరేషన్ అయ్యేవిధంగా చూడాలన్నారు. తహాశీల్దార్ వెంట సిబ్బంది ఉన్నారు.

# సమ్మర్ క్యాంపులు విజ్ఞానానికి వేదికలు

### -మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

**పొన్నూరు, మే 1,ప్రభాతవార్త:** సమ్మర్ క్యాంపులు విజ్ఞానానికి వేదికలని, విద్యార్థులందరూ ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సూచించారు. కొల్లివర మండలంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో లక్ష్మణరావు పాల్గొని ఓపెన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల తల్లి దండ్రులు కూడా సమ్మర్




క్యాంపులకు తమ పిల్లలను పంపించడం ద్వారా విజ్ఞానాన్ని పొందేందుకు దోహపడినవారవుతారన్నారు. క్విజ్ ద్వారా విద్యార్థుల్లో నిబిడీకృతమై ఉన్న విజ్ఞానాన్ని వెలికితీయవచ్చన్నారు. చిన్నారులతో మాట్లాడుతూ పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సాంబిరెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అహ్మద్ హుస్సేన్, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి కుటుంబరెడ్డి, విశ్రాంత అధికారి శివ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పథకాల అమలు ఘనత కూటమిదే

### -టిడిపి నాయకుడు బొప్పన బాపనయ్య

**పొన్నూరు, మే 1,ప్రభాతవార్త:** ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు సూపర్ సిక్స్ పథకాలను తు.చ తప్పకుండా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందని టిడిపి నాయకుడు బొప్పన బాపనయ్య అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో పెన్షన్ల పంపిణీ



కార్యక్రమంలో ఆయన పాల్గొని పెన్షన్ల పంపిణీ తీరును పరిశీలించారు. పెన్షన్ల పెంపు కూటమి ప్రభుత్వం యొక్క ఘనతేనన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలను మోసం చేసేవిధంగా వ్యవహరించాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేస్తుందన్నారు.

# మజ్జిగ పంపిణీ

**పొన్నూరు, మే 1,ప్రభాతవార్త:** మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామివారి కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకొని వేలాది మందికి మజ్జిగ పంపిణీ చేసి రికార్డు సృష్టించారు. ఇప్పటికే అసోసియేషన్



ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తున్న అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున మజ్జిగ పంపిణీ చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరుకు చెందిన ఆర్మీ శ్రీను బ్యాటరీస్, సోలార్ వారి సౌజన్యంతో నిర్వహించినట్లు అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి చిలకపాటి సింహాద్రి, ఈసి మెంబర్ పోలిశెట్టి విజయకుమార్, తిరుమలశెట్టి ప్రసన్న, జాహ్నవి, మేఘనాథ్, గోపిశెట్టి భూలక్ష్మి తదితరులున్నారు.

# ప్రభుత్వపాఠశాల విద్యార్థినికి జిల్లా స్థాయి ద్వితీయ ర్యాంకు

**పొన్నూరు, మే 1,ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్లలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తోట చిన్మయి మధురిమ భార్గవి 592మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సంపాదించింది. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అభినందన సభలో చిన్నారితోపాటు తల్లిదండ్రులకు సన్మానం



నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దూపం రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన తోట చిన్మయి మధురిక భార్గవి జిల్లా స్థాయిలో ద్వితీయస్థానాన్ని సాధించడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడంతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్నాయన్నారు. పైసా ఖర్చులేకుండా మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించుకొని ఉన్నతులుగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా తోట చిన్మయి మధురిమ భార్గవవితోపాటు పాఠశాల స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖాదికారి కొల్లి విజయభాస్కర్, ఎస్ఎంసి ఛైర్మన్ టి.నాగరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# ఘనంగా రథోత్సవం...

### - భక్తులతో కిటకిటలాడిన స్వర్ణపురి వీధులు

**పొన్నూరు, మే 1, ప్రభాతవార్త:** శ్రీ భావదేవుని బ్రహ్మోత్సవాల్లో 9వరోజైన శుక్రవారం ఉదయం కళ్యాణమూర్తులైన శ్రీ సుందరవల్లీ, రాజ్యలక్ష్మి సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారు వాహన సేవలలో విశిష్టమైన గరుడవాహనంపై స్వర్ణపురి పట్టణ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తి, పరాక్రమము, సేవానిరతి, చంచలమైన విశ్వాసము కలిగి స్వామి వారికి అవసరతకు తగినట్లు ప్రవర్తించదగినవాడు గరుత్మంతుడు. ఆయన స్వామివారిని తన భుజములపై పెట్టుకుని వెళ్ళుటకు అమితానందం చెందుతాడు. సర్పదోషములు కలిగినవారు గరుడుని పూజించినచో ఆ దోషములు రహితమగును. అటువంటి గరుడవాహన సేవను దర్శించడం సర్వపాపక్షయకరం. తదనంతరం స్వామివారికి విశేషమైనటువంటి రథోత్సవం జరిగింది. వైశాఖ పౌర్ణమిని భావయ్య పౌర్ణమి అని కూడా పిలుస్తారు. ఈ పౌర్ణమినాడు సాక్షి భావదేవుడు ఉభయ దేవేరులతో ఆసీనుడై ఉన్న స్వామివారు పురవీధుల్లో వెళ్ళి భక్తులకు కనువిందు చేశాడు. "రథస్త కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" అని శాస్త్ర ప్రమాణము. రథారూడుడైన కేశవుని దర్శించిన వారికి పాపము నశించి మరలా జన్మ ఉండదని తెలియుచున్నది. ఈ రథోత్సవ సేవలో పాములపాటి వంశీయులు మేజర్ పి.టి. చౌదరి శఠారి ధరించి ఆలయ మర్యాదలను అందుకున్నారు. తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ రథోత్సవానికి తొలుత పూజలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి జెండా ఊపారు. యాజ్ఞీకస్వామి ఎన్.ఎస్.కె.ఆర్.భట్టాచార్యులు(రాంబాబు), అర్చకులు గోవర్ధనం రామకృష్ణ, రొంపిచర్ల గౌతమ్ తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, కాట్రగడ్డ రామచంద్రరావు, గుడివాడ పవన్, కూరాకుల సత్యనారాయణ, ధరణికోట పద్మావతి, ఆకురాతి అనూరాధ, ఊటుకూరి బాజి



శిరీష, సింహాద్రి వెంకటలక్ష్మి, పరాశరం రంగవల్లి, ఎక్స్ అఫిషియో సభ్యుడు పొన్నూరు బాలగంగాధర తిలక్ పాల్గొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. తెనాలి డిఎస్పీ జనార్ధనరావు పర్యవేక్షణలో పొన్నూరు పట్టణ, రూరల్ సిఐలు లావూరి వీరానాయక్, కృష్ణయ్య, సీసీఎస్ సిఐ కెవి కోటేశ్వరరావు నేతృత్వంలో ఎస్సైలు బలగాని జగన్మోహనరావు, వాగాల శ్రీహరి,సిహెచ్‌వి సాయికుమార్, ఆర్ నవీన్, జి.నారాయణ, పలువురు రక్షకభటులు తదితరులు బందోబస్తు నిర్వహించారు.

# దావులూరులో వైభవంగా పేరంటాలమ్మ తిరుణాళ్ల

**కొల్లివర,మే 1 ప్రభాతవార్త:** భక్తులు కోరిన కోర్కెలు తీర్చే పేరంటాలమ్మ అమ్మవారి కళ్యాణం,తిరుణాళ్ళ మహోత్సవం మండల పరిధిలోని దావులూరు గ్రామంలో శుక్రవారం కన్నుల పండువగా జరిగింది.గ్రామస్తులతో పాటు మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయి



పొంగళ్ళు చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.భక్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి పసుపు,కుంకుమ,గాజులు,పూలు అమ్మవారికి సమర్పించారు.ఆలయ ఆవరణలో బాపమ్మ,గోపయ్య స్వామి వార్లకు వివాహ

**కన్నుల పండువగా అమ్మవారి కళ్యాణం**
**మొక్కులు తీర్చుకునేందుకు అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు**
**శిడిమానోత్సవంలో ఉట్టికొట్టేందుకు పోటీపడిన భక్తులు**

మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేసారు.అనంతరం ఆలయంలో స్వామివార్లకు అర్చకులు రోకళ్ళను పంచామృతాలతో ముంచి ధాతువృద్ధి కోసం పూజలు చేసారు.రాత్రి సమయంలో ఆలయం ఎదుట శిడిమానోత్సవం కార్యక్రమం నిర్వహించారు.శిడిమానోత్సవం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యి ఉట్టికొట్టేందుకు పోటీపడ్డారు.గ్రామస్తులు వాహనాలు ఆలయం చుట్టూ తిప్పారు.ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది.తిరుణాళ్ళ ను పురస్కరించుకుని దూర ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు చిన్నారులకు ఆటవస్తువులు,పెద్దలకు తినుబండారాలు ఆలయం వద్ద అందుబాటులో ఉంచటంతో అమ్మకాలు బాగా జరిగాయి.కమిటీ సభ్యులు ఆలయంకు విద్యుత్ ధీపాలు ఏర్పాటు చేయటంతో దగదగ మెరిసింది.పేరంటాలమ్మ తిరుణాళ్ళను పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.కొల్లివర ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందొబస్తు ఏర్పాటు చేసారు.

# తెనాలిలో ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు

### కార్మికులకు మజ్జిగ పంపిణీ చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి,మే1,(ప్రభాతవార్త):** ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా, తెలుగుదేశం పార్టీ కార్మిక అనుబంధ సంస్థ,తెలుగునాడు ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా మే డే వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసనమండలి సభ్యులు తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్,పాల్గొని



తెలుగు నాడు ట్రేడ్ ఆటో యూనియన్ జెండా ఆవిష్కరించారు.ముందుగా చెంచుపేట కరెంట్ ఆఫీసు వద్ద,శివాజీ చౌక్ లో, టి.బి రోడ్డులో మరియు ఆటోనగర్ లో, టిఎన్టియుసి జెండా ఆవిష్కరించి పలు చోట్ల కేక్ కట్ చేసి అన్నదానం,మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా కార్మిక, కర్షక సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అపారమని, వారి కష్టం లేకుండా ఏ రంగం ముందుకు సాగదని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా కూలీలు, కార్మికులు, దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన స్తంభాలని తెలిపారు.పరిశ్రమల అభివృద్ధి,నిర్మాణ రంగ విస్తరణ ఇవన్నీ కార్మికుల శ్రమ ఫలితమేనని ఆయన అన్నారు.వారి కష్టానికి తగిన గౌరవం,గుర్తింపు లభించేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పలు కీలక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎంఎల్సి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వివరించారు. కార్మికులకు భద్రత, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు పెంపు, కనీస వేతనాల అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కొత్త పథకాలు తీసుకొస్తున్నామని చెప్పారు. కర్షకుల గురించి ప్రస్తావిస్తూ, వారి శ్రేయస్సు ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ముఖ్యమని . ప్రస్తుత కాలంలో కార్మికుల హక్కులను కాపాడటం అత్యంత అవసరమని, సమాజం మొత్తం వారి శ్రమను గౌరవించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడి జీవన ప్రమాణం మెరుగుపడేలా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు..మేడే రోజు కార్మికుల త్యాగాలను, కష్టాలను గుర్తుచేసుకునే సందర్భమని, వారి సంక్షేమం కోసం అందరం కలిసికట్టుగా . పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో, తెనాలి నియోజకవర్గం టిఎన్టియుసి అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఖుద్దూస్,మైనార్టీ నాయకులు నసీం, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు కొల్లూరు శ్రీధర్,పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

# జనగణన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలి : తహాశీల్దార్

**తెనాలి, మే1,(ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం మే 1వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న జనగణన కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం



తెనాలి రూరల్ మండల గ్రామం సంఘం జాగర్లమూడి లో జరుగుతున్న జనగణ కార్యక్రమాన్ని, తెనాలి మండల తహసిల్దార్ కెవి. గోపాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ జనగణన కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి సహకరించి,దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. జనగణన కార్యక్రమంలో ప్రతి ఇంటి వివరాలు దేశ భవిష్యత్తు ప్రణాళికలకు పునాది లాంటిదన్నారు. జనగణన ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ,సిబ్బంది మొబైల్ యాప్ ద్వారా వేగంగా జనగణన చేపడుతున్నారని, ప్రతి ఇంటి గణన సుమారు 3 నుండి 4 నిమిషాల్లో పూర్తవుతుందన్నారు. మరింత సమర్ధవంతంగా జనగణన నిర్వహించాలని సిబ్బందికి తాసిల్దార్ గోపాలకృష్ణ సూచించారు.

# పేరంటాళ్లమ్మ దేవస్థాన నూతన విద్యుత్ ప్రభను ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి మే1,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని ఐతా నగర్ లో వేంచేసిన గ్రామ దేవత పేరంటాలమ్మ దేవస్థానం కి చెందిన నూతన విద్యుత్ ప్రభను శుక్రవారం, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి,శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గ్రామ దేవత పేరంటాళ్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు



నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఐతానగర్ గ్రామదేవత పేరంటాళ్లమ్మ ప్రసిద్ధి చెందిన అమ్మవారని, ఎన్నో సంవత్సరాలుగా, ఐతానగర్ వాసులనే కాకుండా, ప్రజలందరినీ కూడా రక్షిస్తూ పాడిపంటలతో సుఖసంతోషాలతో వర్ధిల్లే విధంగా కుల మత తారతమ్యాలు లేకుండా అందరికీ ఆ అమ్మవారు అండదండలుగా నిలుస్తున్నారని,ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఐతానగర్ మరియు పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# జనగణన ప్రతి ఒక్కరూ నమోదు చేయించుకోవాలి : తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, మే 1,ప్రభాతవార్త:** ప్రతి కుటుంబం విధిగా జనగణన చేయించుకోవాలని తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ కోరారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో శుక్రవారం జనగణన జరిగే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ జనగణన ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మొదటి సారిగా డిటిజటల్ పద్ధతిలో జరుగుతున్న జనగణనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెలాఖరులోపు నూరుశాతం పూర్తి చేసేవిధంగా ఎన్యుమరేటర్లు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా నూరుశాతం పక్కాగా జనగణన పూర్తి చేయాలన్నారు. తహాశీల్దార్ వెంట సహాయ గణాంకాధికారి నల్లాని ప్రసాద్, వీఆర్వో, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



